www.jagritiweekly.com


సంపుటి : 76 సంచిక : 34 పుటలు : 52


# జాగృతి

కలి 5126-శ్రీ క్రోధి జ్యేష్ఠ బహుళ దశమి

01-07 జులై 2024

వెల : ₹20/-





## విజయుడి పరాజయాహంకారం

ముస్లింల బుజ్జగింపు ధోరణి, సీఎం అహంకారం కేరళలో ఎల్‌డీఎఫ్‌ను ఓడించాయి



## టిబెట్‌కు కొత్త ఆశ



జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

76 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక



# జగన్నాథుడి స్నాన జాతర

ప్రపంచ ప్రఖ్యాత జగన్నాథ రథయాత్ర సంరంభం పూరీ క్షేత్రంలో ప్రారంభమైంది. జూన్ 22వ తేదీన స్నానజాతర నిర్వహించారు. పహాండి గర్భగుడిలోని రత్నసింహాసనం నుంచి వేకువన 5.20కి స్నానమంటపానికి వైభవంగా తీసుకువచ్చారు. స్నానమంటపంలో జగన్నాథుడు, సోదరుడు, సోదరి బలభద్రుడు, సుభద్రలకు పవిత్ర జలాలతో స్నానం చేయించారు. 108 కుండలతో పూజారులు ఆ ముగ్గురికి జలాభిషేకం చేశారు. ఈ జలమంతా ఆలయ ప్రాంగణంలోనే ఉన్న ఒక బావి నుంచి తీసుకువస్తారు. స్నానం తరువాత ముగ్గురు దేవతలతో పెద్ద ఊరేగింపు జరిగింది. దీనికి గర్భాలయం నుంచి సుదర్శనం ప్రతిమను కూడా తీసుకువస్తారు.ఒడిశాతో పాటు దేశం నలుమూలల నుంచి వచ్చిన భక్తులు ఈ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో వీక్షించారు. ఉదయం 7.45కు కార్యక్రమం పూర్తయింది. ఆపై మంగళ హారతి, తడప్‌లాగి, మయులం, అబకష్, సూర్యపూజ, రోసహోం జరిగాయి. ఇక్కడే ఒక సమైక్యతకు సంబంధించిన సంప్రదాయాన్ని కూడా పాటిస్తారు. మహారాష్ట్రులకు ఇష్టదైవమైన గణేశునిలా జగన్నాథుడిని బలభద్రుని, సుభద్రను అలంకరిస్తారు. దీనికే గజానన్ వేష్ అని పేరు. ఇది మరాఠీలను సంతోష పెట్టడానికి ఆచరిస్తారు. ఏటా జరిగే రథయాత్రలో స్నాన జాతర ఒక కీలక అంశం. పున్నమి (జ్యేష్ఠ) రోజున ఇది జరుపుతారు. అదే జగన్నాథుడి జన్మదినం కూడా. అందుకే స్నాన పూర్ణిమ అన్న పేరు కూడా ఉంది. స్కంద పురాణంలో స్నాన జాతర ప్రస్తావన కనిపిస్తుంది. ఇంద్రద్యుమ్నుడు ఈ సంప్రదాయాన్ని ప్రవేశపెట్టాడని ఆ పురాణం చెబుతోంది. ఆయన 12వ శతాబ్దంలో పూరీ ఆలయంలో దారు శిల్పాలను ప్రతిష్ఠించే ఆచారాన్నీ ఆరంభించాడు.

రథయాత్ర వ్యాసం: 35వ పేజీలో







# జాగృతి చదువుదాం.. చదివిద్దాం..

## జాతీయ భావనను బలోపేతం చేద్దాం..
## సాంస్కృతిక వారసత్వాన్ని నిలుపుకుందాం..

జాగృతి చందాను ఆన్‌లైన్‌లో
మీ మొబైల్ నుంచి
చెల్లించడానికి ఇక్కడ ఉన్న
క్యు.ఆర్. కోడ్‌లను గూగుల్ సెర్చ్‌బార్‌లో
ఉండే గూగుల్ లెన్స్‌తో స్కాన్ చేయండి.
లేదా క్రిందనున్న లింక్‌లను ఉపయోగించండి.

5 సం.రాల చందా రూ.4000/-
http://payit.cc/S18973

సం. చందా రూ.850/-
http://payit.cc/S18970

తక్కువ ఖర్చుతో జాగృతి సంచికను రిజిస్టర్డ్ పార్సిల్ (మ్యాగజైన్ పోస్టు) ద్వారా అందుకోవడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను ఉపయోగించాలి.
(సంవత్సర చందా రూ.850/- + మ్యాగజైన్ పోస్టు సం॥నికి రూ.624/-)

వెల : రూ.1474/-
https://payit.cc/S32796

**Bank A/c details :**
Jagriti Prakashan Trust,
A/c No.920010061405325,
Axis Bank, Kothapet Branch,Hyderabad,
IFSC : UTIB0002157,PAN : AAATJ3829L

విడి ప్రతి
రూ.20/-

వివరాలకు సంప్రదించండి సర్క్యులేషన్ మేనేజర్ : 040-27561453 / 9959997013

jagritiweekly.com facebook.com Jagriti Telugu Weekly youtube.com/@Jagrititv 3-4-228/4/1, Kachiguda, Hyderabad-027.

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య) సంప్రదించండి.**

జి.తుకారాం : సర్క్యులేషన్ మేనేజర్
040-27561453 / 9959997013

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య)**

కె. దుర్గారెడ్డి : అసోసియేట్ ఎడిటర్ -
సబ్ ఎడిటర్ : - 9959991304

డిజైనర్ : చిగుళ్ల కుమార్, ఎడ్ల కృష్ణ

## చందాదారులకి గమనిక

చందాలను ఎవ్వరికి వ్యక్తిగతంగా చెల్లించవద్దు. మీ దగ్గరకు వచ్చే బల్క్ మెంబర్లకు (కార్యకర్తలకు) మాత్రమే చెల్లించి రసీదు తీసుకోగలరు. లేదా కింద ఇచ్చిన అంకౌంట్ ద్వారా చెల్లించగలరు.

ఫోన్ పే, గూగుల్ పే నుండి చెల్లించడానికి జాగృతి అకౌంట్ **"To Bank / UPID"** ఆప్షన్ వాడండి.

**Link / QR Code** ద్వారా మీ చందా చెల్లించినప్పుడు **Remarks** దగ్గర కట్టించిన కార్యకర్త పేరు ఫోన్ నెం. తప్పకుండా రాయించండి.

విడి ప్రతి రూ.20

**5 సం॥ల చందా రూ.4000** **సంవత్సర చందా రూ.850**

**బ్యాంకు ఖాతా వివరాలు**

**A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch.**
**IFSC : UTIB0002157, PAN : AAATJ3829L**

**- సర్క్యులేషన్ మేనేజర్, జాగృతి**

'పగలు యాంటీ నాచ్, రాత్రి ప్రోనాచ్. సొంతూళ్లో యాంటీ నాచ్, పొరుగూరు పోతే అక్కడ ప్రోనాచ్...అవకాశం లేకపోతే యాంటీ నాచ్, ఉంటే ప్రోనాచ్..' మహా రచయిత గురజాడ 'కన్యాశుల్కం' నాటకంలో కరటకశాస్త్రి చెప్పిన భాష్యం ఇది. ప్రోనాచ్, యాంటీ నాచ్ అంటే అర్థం తెలిసిందే. వేశ్యా సంపర్కానికి అనుకూలం, వ్యతిరేకం. సంస్కర్త వేషధారులు ఎంత కృతకంగా ఉంటారో గురజాడ వారి ఈ మాటలు వెల్లడిస్తాయి. మన దేశంలో చాలామంది మేధావులు, రచయితలు, ఉదారవాదులు సరిగ్గా ఇలాంటి వాళ్లే. వీళ్ల బుద్ధి అధికారంలో ఉన్న రాజకీయ పార్టీని బట్టి మారిపోతూ ఉంటుంది. దృష్టి రంగు మార్చుకుంటుంది. పత్రికను బట్టి రాసిన వ్యాసంలో 'గొంతు'ను కూడా మార్చగల రచయితలు ఉన్నారు. చానల్‌ను బట్టి వాగ్ధోరణిని మలిచే ఉదారవాదులు, మేధావులు కూడా కోకొల్లలు. వాక్ స్వాతంత్ర్యం, భావ ప్రకటనా స్వేచ్ఛ, పత్రికా స్వాతంత్ర్యం..ఏమైనా.. అధికారంలో ఉన్న పార్టీని బట్టి ఈ మేధావుల చూపు, మాట, నోటి తీట సమయానుకూలంగా మారుతూ ఉంటాయి. బీజేపీ ఉంటే ఒక రకం. కాంగ్రెస్ ఉంటే వేరే రకం. అటూ ఇటూ కాని ప్రభుత్వం ఉంటే అప్పుడు మరో రకం.


అరుంధతీరాయ్ అనే రచయిత్రి పదిహేనేళ్ల క్రితం ప్రదర్శించిన మేథో పైత్యానికి చట్టం ప్రకారం ఇప్పుడైనా మందు వేయవచ్చునని ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ అనుమతి జారీ చేశారు. ఇంకేముంది! చాలామంది వాక్ స్వాతంత్ర్యం, దాని పవిత్రత, ఘనత, చరిత్రల గురించి భారత ప్రజానీకానికి పాఠాలు చెప్పడానికి బెత్తాలు పుచ్చుకుని మరొకసారి దేశం మీద పడ్డారు. మేధావి/రచయిత/వామపక్షవాది/ ఉదారవాది వగైరా బిరుదుల పుట్ట అనదగ్గ ఒకరు ఇదే అంశం మీద రాసిన వ్యాసం తెలుగు అనువాదాన్ని ఒక ప్రముఖ తెలుగు దినపత్రిక ఈమధ్య ప్రచురించింది. ఈ బాపతు వ్యాసాలలో దీని సంఖ్య ఎంతో కూడా చెప్పడం కష్టం. చరిత్ర మరువలేని, జాత్యహంకారానికి కొండగుర్తు వంటి జలియన్‌వాలా బాగ్ ఘాతుకానికి పాల్పడిన బ్రిటిష్ ప్రభుత్వం పట్ల నిరసన ప్రకటించడానికి ఆ కాలం భారతీయులకు ఉన్న హక్కు ఎలాంటిది? అని అడిగితే ఎవరైనా ఆ నిరసన హక్కు సహజమైనదనే అంటారు. గాంధీజీ 'యంగ్ ఇండియా'లో (మార్చి 18,1922) ఇదే హక్కును తిరుగులేకుండా బలపరిచినట్టు

**శాలివాహన 1946 శ్రీ క్రోధి జ్యేష్ఠ బహుళ దశమి**

## లోపలి పేజీలలో...




ముఖపత్ర కథనం
**విజయుడి పరాజయాహంకారం**
6లో




ధారావాహిక నవల
**జన్మ**
- సంబరాజు లీల (లట్టుపల్లి)
20లో



ఆరోగ్యం
**ఆరోగ్య దేహాలయం**
26లో

# జాగృతి

## సంపాదకీయం

కూడా ఆ రచయితే స్పష్టం చేశారు. గాంధీజీ 'ప్రభుత్వం పట్ల అసంతృప్తిగా ఉండటాన్ని ఒక ధర్మంగా నేను భావిస్తాను' అన్నారట. ఆ 'అసంతృప్తి' ఎలా ఉండాలో కూడా ఆయనే చెప్పారట. అదీ చూద్దాం. 'ఒక వ్యక్తికి, ఆ వ్యక్తి హింసను తలవనంతవరకు హింసను ప్రోత్సహించనంత వరకు తన అనిష్టతను వ్యక్తీకరించడానికి స్వేచ్ఛ ఉండాలి'. ఇంతవరకు బాగానే ఉంది.

కానీ ఈ మేధావులు, ఒక వర్గం పత్రికా రచయితలు ఎవరిని సమర్థించే క్రమంలో వాక్ స్వాతంత్ర్యం గురించి వదరుతున్నారు? ఆమె అరుంధతీరాయ్.

## మత్తురాతలు


ఆమె మావోయిస్టులను సమర్థించారు. కశ్మీర్ భారత్‌లో ఏనాడూ అంతర్భాగం కాదంటూ అక్కడ వేలాది మంది సామాన్య పౌరులను హిందువుల పేరుతో అనాగరికంగా చంపేసిన పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులకు మద్దతిచ్చే మాటలు మాట్లాడారు. ఆ రక్తపాతానికి, ఘాతుకాలకు నైతిక మద్దతు ఇచ్చారు. తుపాకీ గొట్టం ద్వారా రాజ్యాధికారం వస్తుందన్నది మావోయిస్టుల నమ్మకం, సిద్ధాంతం. గొట్టం నుంచి పొగ వస్తుంది. నేల మీద భద్రతా బలగాలదో, అమాయకులదో నెత్తురు పారుతుంది. పాక్ ప్రేరేపిత ఉగ్రవాదుల ధ్యేయమే కశ్మీర్ లోయలో హిందూ జనాభాను ఏరివేయడం. నక్సల్స్‌ని భద్రతాదళాలు చంపడం, లేదా భద్రతాదళాలను నక్సల్స్ మట్టుపెట్టడం, కశ్మీరీ హిందువులను మతం కారణంగా ఊచకోత కోయడం వీటిలో దేనినీ సమర్థించడం గాంధీజీ జీవిత లక్ష్యం లేదా సిద్ధాంతం ఉద్దేశం కాదని ఆయన మాటలు, చేతలను బట్టి అర్థం చేసుకోవచ్చు. మరి అరుంధతీరాయ్ హింసామార్గాన్ని గాంధీజీ 1922లో చెప్పిన పరిపూర్ణ అహింసా సిద్ధాంతంతో ఆ వ్యాస రచయిత ఎలా తూకం వేశాడో అర్థమే కాదు. అలాంటి మేధావుల మీద సాధారణంగా ఉండే పెగ్గు ప్రభావం దిగక ముందే తొందరపడి రాసి ఉండాలి. లేకుంటే ఆ 'యంగ్ ఇండియా' మాటలు జలియన్‌వాలా బాగ్ నేపథ్యంలో శ్వేతజాతి దురహంకార ప్రభుత్వం మీద గాంధీజీ వ్యక్తం చేసిన అభిప్రాయమన్న సంగతి ఎలా మరచిపోతారు? ఆ నిర్వచనమే స్వతంత్ర భారత ప్రభుత్వానికి కూడా వర్తింప చేయవచ్చునని గాఢాతి గాఢమైన మత్తులో ఉంటే తప్ప ఎలా రాయగలరు?

అరుంధతీరాయ్ కూడా సదా మత్తులో తూగుతూ ఉంటారు కాబోలు. మావోయిస్టులలో గాంధేయులను చూశారామె. రాజ్యాంగాన్ని ధ్వంసం చేయ డానికి ప్రభుత్వం విరామం లేకుండా ప్రయత్నిస్తుంటే రక్షించి, నిజాయితీగా అమలు చేయడానికి ప్రయత్నిస్తున్నవారు ఎవరైనా ఉన్నారూ అంటే, వారు నక్సలైట్లేనని తేల్చి పారేశారు. మరి, తమ రెండు చేతులు అడ్డుపెట్టి రాజ్యాం గాన్ని రక్షిస్తున్న నక్సలైట్లు ప్రభుత్వంతో చర్చలకు మధ్యవర్తిగా ఉండమంటే రాయ్ పారిపోయినట్టు? 2001 నాటి పార్లమెంటు మీద దాడి ఘటన విచారణలో చాలా లోపాలు ఉన్నాయట. నరేంద్ర మోదీని ప్రధానిగా ఎన్నుకో వడం వీటన్నిటికి పరాకాష్టలాంటి విషాదమని కూడా ప్రకటించారామె.

భారతీయ జనతా పార్టీని విమర్శించే క్రమంలో, శాపనార్థాలకు లంఘించుకునే క్రమంలో ఇలాంటి నిరంతర మత్తుజీవులు భారతదేశాన్ని అపఖ్యాత పాల్జేస్తున్న సంగతి ప్రతిక్షణం తట్టి గుర్తు చేయకతప్పదు. కశ్మీర్ ఉగ్రవాదులు కానీ, మావోయిస్టులు కానీ తాము శాంతియుత పంథాను నమ్ముతామని, రాజ్యాంగాన్ని రక్షిస్తామని, బుద్ధిగా ఆచరిస్తామని ఏనాడూ చెప్పినవాళ్లు కాదు. వాళ్లు తిరుగులేని రక్తపిపాసులు. వాళ్లలో గాంధీజీ అంతేవాసులను చూడడం మహాపరాధం. బీజేపీ మీద వ్యతిరేకతతో ఇలాంటి అంధత్వాన్ని ఆశ్రయిస్తే ఎలా? మీ బుద్ధి ఎంత కుంచించుకుపోయిందో చెప్పడానికి ఇది మరొక ఉదాహరణ కాదా! ★

01 జూలై 2024, సోమవారం

అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ - బృహదారణ్యకోపనిషత్




40లో

కథ

**తాతయ్య పొలం**

– శరత్ చంద్ర





| | | |
|---|---|---|
| రాజకీయ అగ్నిగుండంలో సింగరేణి (తెలంగాణ) | - | 14 |
| అమరావతిలో కొలువుదీరిన కొత్త సభ (ఆంధ్రప్రదేశ్) | - | 16 |
| సమ్మిళిత వృద్ధి దిశగా భారత్ ప్రయాణం (వేదిక) | - | 32 |
| జగన్నాయక జగన్నాథా! జయహో.. (ప్రత్యేక వ్యాసం) | - | 35 |
| కాలాతీత వ్యూహాలను రూపొందించిన యోధుడు.. (స్ఫూర్తి) | - | 28 |
| దేశభక్తి ప్రదీప్తమైన బంకించంద్ర 'ఆనందమఠం' (సాహిత్యం) | - | 30 |
| రికార్డుల 'హిట్టర్' రోహిత్ శర్మ! (క్రీడ) | - | 43 |
| భావోద్వేగాలకు అతీతం 'కల్కి 2898 ఎ.డి.' (సినిమా) | - | 50 |



# విజయుడి ప

ఈ లోక్‌సభ ఎన్నికలలో లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డీఎఫ్) ఘోర పరాజయానికి ముఖ్యమంత్రి పినరయి విజయన్ అహంకారమే కారణమని కేరళ వామపక్ష శిబిరం ఎలుగెత్తి చాటింది. సొంత పార్టీల నేతలే బహిరంగంగా ఆ మాట చెప్పారు. అంతేకాదు, వామపక్షాల చరిత్రలో ఎన్నడూ లేని విధంగా, మన బుజ్జగింపు ధోరణి పట్ల ప్రజలలో వెగటు పుట్టడం వల్లనే ఫ్రంట్ చతికిల పడిందని కూడా నిష్కర్షగా నాయకులు ప్రకటించారు. ఫ్రంట్ నిర్వహించిన పౌర, రాజకీయ కార్యక్రమాలన్నీ కూడా మత సభలను తలపింపచేశాయని తిట్టి పోశారు. మత పెద్దలకు అనవసర ప్రాధాన్యం ఇచ్చారని కూడా ఆరోపించారు. ఇక్కడ మతపెద్దలంటే, ముస్లిం మత గురువులే. ముఖ్యమంత్రి పినరయి కుమార్తె వీణా విజయన్ మీద వచ్చిన అవినీతి ఆరోపణలు కూడా ఓటమికి దోహదం చేశాయని ఆ వామపక్ష నేతలే ధ్వజమెత్తారు. పినరయి విజయన్ రాజీనామా చేసి అవతలకి పోయి, కొత్త ముఖ్యమంత్రిని ప్రతిష్ఠిస్తే తప్ప పార్టీకి మోక్షం లేదని తెగేసి చెప్పారు. ఫ్రంట్ పరాజయం గురించి ఐదురోజులు సుదీర్ఘంగా చర్చించిన తరువాత నాయకులు తేల్చినదేమిటి అంటే, ప్రజల ఆకాంక్షలను పట్టుకోవడంలో విఫలమయ్యాం, ఓడిపోయాం అనే. ఒక వైపు ఫ్రంట్ మితిమీరిన బుజ్జగింపు ధోరణితోనే ప్రజలు తమను ఓడించారని చెబుతూనే, ముస్లింలంతా కాంగ్రెస్ నాయకత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్‌కు మద్దతు ఇచ్చారని నాయకులు చెప్పడం వింతే. అలాగే సంప్రదాయకంగా వామపక్షాల వెనుక నిలిచిన వెనుకబడిన హిందువులలో బీజేపీ చొచ్చుకుపోవడం వల్లనే ఈ ఫలితాలు వచ్చాయని కూడా గమనించింది. జూన్ 20న ఈ మథనం ముగిసింది. ఫలశ్రుతి: తాను రాజీనామా చేయబోవడం లేదని పినరయి తేల్చి చెప్పడమే.

# రాజయాహంకారం

ఎన్నికలలో దారుణ పరాజయం గురించి జూన్ 16–20 మధ్య సీపీఎం రాష్ట్ర సెక్రటేరియెట్ సమీక్షించింది. ప్రభుత్వ వ్యతిరేకత ఓటమికి కారణమని ఆ సమావేశం కూడా అంగీకరించక తప్ప లేదు. వాస్తవానికి ఎన్నికల ఫలితాలు వెలువడగానే పార్టీని క్షాళన చేసే పని వెంటనే ఆరంభించాలని కొందరు సీనియర్ కమ్యూనిస్టు నాయకులు బహిరంగంగానే ప్రకటనలు ఇచ్చారు. అందులో ఒకటినాటి సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు, పార్టీ పత్రిక 'దేశాభిమాని' మాజీ అసోసియేట్ ఎడిటర్ అప్పుకుట్టం వల్లికున్ను వ్యక్తం చేసిన అభిప్రాయాలు చాలా తీవ్రమైనవి. పినరయి విజయన్ భారతదేశ గోర్బచెవ్ అని ఆయన తీర్పు చెప్పారు.

**సీపీఎం రాష్ట్ర సెక్రటేరియెట్ ఒప్పుకోలు**

ఎల్‌డీఎఫ్ హయాంలో జరిగిన లోటుపాట్లే ఈ ఎన్నికలలో దారుణ పరాజయానికి కారణమని సీపీఎం రాష్ట్ర సెక్రటేరియెట్ అభిప్రాయపడింది (ఆన్ మనోరమ, జూన్ 19, 2024). ముఖ్యమంత్రి అహంకార పూరిత ధోరణి కూడా అందుకు దోహదం చేసిందని కూడా సాక్షాత్తు, పినరయి సమక్షంలోనే రాష్ట్ర సెక్రటేరియెట్ భావించడం నిజంగా వింతే. పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎంవీ గోవిందన్ జూన్ 19న ఇచ్చిన నివేదికలో ఈ విషయాలు ఉన్నాయి. నాయకుల వ్యవహార సరళితో వారు ప్రజలకు దూరమయ్యారని కూడా ఐదు రోజుల ఈ సమావేశాలు గుర్తించక తప్పలేదు. ప్రజల సమస్యలను పార్టీ పట్టించుకోలేదని కూడా అన్నారు. ఇందులో కులం కోణం గురించి కూడా కార్యదర్శి చర్చించారు. ఆది నుంచి పార్టీకి వెన్నెముకగా ఉన్న ఎజువా వర్గం ఈసారి దూరంగా ఉందనీ అత్తింగళ్, అళప్పుజ, త్రిశూర్ కొజికోడ్ ఫలితాలలో అది ప్రతిబింబించిందనీ పేర్కొన్నారు. రాష్ట్ర సెక్రటేరియెట్ సమావేశంలో పాల్గొన్న జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి కూడా పరిపాలనకు సంబంధించిన లోపాలు ఉంటే సరిదిద్దుకోవాలని పిలుపునిచ్చారు. ఎల్‌డీఎఫ్ ఓటమి ప్రభుత్వ వ్యతిరేక తీర్పును ప్రతిబింబించడం లేదనీ, బీజేపీ వ్యతిరేకతను వ్యక్తం చేయడానికి యూడీఎఫ్‌కు ఓటు వేశారంటూ పినరయి చేసిన వాదనను సమావేశంతో అంగీకరించలేదు. అయినా పినరయి తనదైన శైలిలో ఎల్‌డీఎఫ్ కూటమి వ్యతిరేక తీర్పు అసలు రహస్యం ఏమిటో చెప్పారు. జాతీయ స్థాయిలో బీజేపీని ఎదుర్కొనగల శక్తి కాంగ్రెస్‌కు ఉందని నమ్మి ప్రజలు ఆ పార్టీకి ఓట్లు వేశారు. అంతేకాని ఆ తీర్పు తమకు వ్యతిరేకం కానేకాదు అంటున్నారు పినరయి. అందుకే రాజీనామా ప్రశ్నే లేదని తేల్చి చెప్పారు.

పినరయి తప్ప అన్యథా శరణం నాస్తి అన్న రీతిలోనే రాష్ట్ర కార్యదర్శి తన నివేదికను సమర్పించారనిపిస్తుంది. జాతీయ స్థాయిలో బీజేపీతో ఇండీ కూటమి పోరాడుతున్నప్పటికీ, కేరళలో మాత్రం కాంగ్రెస్‌కూ, సీపీఎంకూ మధ్య సయోధ్యకు కొన్ని పరిమితులు ఉన్నాయని, కేంద్రంలో కాంగ్రెస్ మాత్రమే ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని ప్రజలు భావించడంతో అటు మొగ్గారని రాష్ట్ర సీపీఎం కార్యదర్శి గోవిందన్ చెప్పారు (ది స్టేట్స్‌మన్, జూన్ 21, 2024). బీజేపీని నిలువరించగలిగే సత్తా కాంగ్రెస్‌కే ఉందని గట్టిగా విశ్వసించడం వల్ల ముస్లిం మతోన్మాదులు కాంగ్రెస్‌కే మద్దతు ఇచ్చారని సీపీఎం కొత్త సత్యం కూడా వెల్లడించింది. జమాత్ ఎ ఇస్లామి, ఎస్‌డీపీఐ (నిషిద్ధ పాప్యులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా ఉగ్రవాద ముస్లిం సంస్థకు రాజకీయ విభాగం) యూడీఎఫ్‌కే మద్దతు ఇచ్చాయని రాష్ట్ర కార్యదర్శి చెప్పారు. క్రైస్తవులలో ఒక వర్గం కూడా బీజేపీకి మద్దతు (ఫలితంగానే, త్రిశూర్‌లో సురేశ్ గోపీ గెలిచారని అంటున్నారు) ఇచ్చిందని తేల్చారు. నారాయణగురు ఆశయాలతో ఆరంభించిన భారత ధర్మ జనసేన నిజానికి బీజేపీ/ఆర్ఎస్ఎస్‌కు అనుబంధంగానే ఉందని, దీని ద్వారా బీజేపీ కుల సంఘాలను ఆకర్షించిందని చెప్పారు. కానీ ముస్లిం లీగ్ మాత్రం ఎల్‌డీఎఫ్ వెనుకే ఉంది.

కమ్యూనిస్టు నేతలలో ఉండే ఆధిపత్య ధోరణి, నియంతృత్వ ధోరణి ఏ ఇతర ప్రజ సంఘాలలోకాని, రాజకీయ పార్టీలలో కాని సాగదు. అలాంటి విమర్శలు పినరయి మీద కూడా తక్కువేమీ కాదు. అటు పార్టీ వ్యవహారాలు, ఇటు ప్రభుత్వం ఆయన ఉక్కు పిడికిలిలోనే ఉంటాయని చెబుతారు. పైగా ఆయన వ్యవహార శైలిని ప్రశ్నించే, నిలదీసే దీటైన ప్రత్యామ్నాయం పార్టీలో లేదు. కేంద్ర నాయకత్వం ఉన్నా నామమాత్రమే. జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరికి ఛాయ్ పైసలు, సిగరెట్ ఖర్చులు పినరయి సమకూరుస్తారని ఒక ప్రముఖ జర్నలిస్ట్ చెప్పడం విశేషం. అంటే ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిన పించన్‌దారుల సంగతి, పౌర సరఫరాలలో జరుగుతున్న లోపాల గురించి ఆయన దృష్టికి తీసుకువెళ్లే



వ్యవస్థ లేనేలేదు. నిజానికి ఈ అంశాలే పార్టీని నేలమట్టం చేశాయని నాయకులే చెబుతున్నారు.

**పినరయి రాజీనామా కోరిన సీపీఐ**

ఈ దారుణ పరాజయానికి బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి పినరయి విజయన్ రాజీనామా చేయాలని సీపీఐ కోరింది. కేరళ లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్‌లో కీలక భాగస్వామి సీపీఐ. ఫ్రంట్‌కు చిరకాలంగా నాయకత్వం వహిస్తున్నది సీపీఎం. 2024 లోక్‌సభ ఎన్నికలలో కేరళలో ఎల్‌డీఎఫ్ తుడిచిపెట్టుకు పోవడానికి (మొత్తం 20 లోక్‌సభ స్థానాలలోను పోటీ చేసి ఒక్కటంటే ఒక్క సీటు గెలిచింది) ప్రధాన కారణం ముఖ్యమంత్రి పినరయి విజయన్ అహంకారపూరిత వైఖరేనని సీపీఐ తిరువనంతపురం జిల్లా కౌన్సిల్ ఎలాంటి శషభిషలు లేకుండా విమర్శించింది. అళప్పుజ జిల్లా కౌన్సిల్ సమావేశం కూడా దాదాపు ఇలాంటి అభిప్రాయానికే వచ్చింది. పినరయి పదవికి రాజీనామా చేయకపోతే ఎల్‌డీఎఫ్ బతికి బట్టకట్టే ప్రశ్నే లేదని కూడా ఆ రెండు సమావేశాలు తేల్చి చెప్పేశాయి. ఈ ఘోర పరాజయం గురించి ఆ రెండు జిల్లాల కౌన్సిళ్లు జూన్ 16వ తేదీన సమీక్షించాయి.

ఆ పార్టీ (సీపీఎం) మైనారిటీ పక్షపాతం కూడా ఈ ఓటమికి జతయింది అని కూడా సీపీఐ నీళ్లు నమలకుండా విమర్శించింది. ఇటీవలి కాలంలో సీపీఎం వ్యవహరిస్తున్న తీరును సీపీఐ తూర్పార పట్టింది. 'సీపీఎం బహిరంగ సభలు మతసభలను తలపించాయి. రాజ్యసభకు అభ్యర్థిని కూడా మైనారిటీ వర్గం నుంచే ఎంపిక చేశారు' అని సీపీఐ విమర్శించింది. ముఖ్యమంత్రి పినరయి కుమార్తెపై వెల్లువెత్తిన అవినీతి విమర్శలు, మంత్రుల అసమర్థత కూడా



# 'భారతదేశ గోర్బచెవ్ పినరయి'

**సీపీఎం రాష్ట్ర కమిటీ మాజీ సభ్యుడు, పార్టీ పత్రిక 'దేశాభిమాని' మాజీ అసోసియేట్ ఎడిటర్, పార్టీ బహిష్కృతులలో ఒకరు అప్పుకుట్టం వల్లికున్ను లెఫ్ట్‌ఫ్రంట్ ఓటమి తరువాత 'ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్' (జూన్ 9, 2024)కు ఇచ్చిన ఇంటర్వ్యూలోని కొన్ని అంశాలు:**

భారత రాజకీయ చిత్రపటంలో వచ్చిన పెద్ద మార్పు 2024 లోక్‌సభ ఎన్నికలలో ప్రతిబింబించిందని వల్లికున్ను అన్నారు. స్వతంత్ర భారతదేశంలో జరిగిన రెండు లోక్‌సభ ఎన్నికలు చరిత్రాత్మకమైనవని, అందులో మొదటివి అత్యవసర పరిస్థితి తరువాత జరిగినవని కాగా, రెండో ఎన్నికలు ఇవేనని ఆయన వ్యాఖ్యానించారు. ఒక ఉదాహరణతో దీనిని వివరించారు. పున్నపారా–వయలార్ అనే ప్రదేశానికీ కమ్యూనిస్టులకీ అవినాభావ సంబంధం ఉంది. 1957లో ఈఎంఎస్ నంబూద్రీ నాయకత్వంలో ప్రభుత్వం(భారతదేశంలో తొలి వామపక్ష ప్రభుత్వం) ఏర్పడినప్పుడు, ప్రమాణస్వీకారోత్సవానికి ముందు మంత్రిమండలి అక్కడికి వెళ్లి తిరుగుబాటులో పాల్గొన్న అమరులకు పుష్పాంజలి ఘటించింది. ఈ

ఓటమికి తోడ్పడినాయని కూడా సీపీఐ స్పష్టం చేసింది. పోలింగ్‌కు కొంచెం ముందు ఎల్‌డీఎఫ్ కన్వీనర్ వెళ్లి బీజేపీ నాయకుడిని కలవడం కూడా ఫ్రంట్ గెలుపు మీద ప్రతికూల ప్రభావం చూపిందని సీపీఐ చెప్పింది. నిజానికి ఇంతకు ముందే సీపీఐ పినరయిని 'ధోతీ కట్టిన మోదీ' అని ఎద్దేవా చేసేది. 19 మంది మంత్రులు పినరయి ఛాయలని మాత్రమే ప్రస్తావించేది. ప్రభుత్వోద్యోగులనీ, పింఛన్‌దారులను ప్రభుత్వం పట్టించుకోకపోవడమూ ఓటమికి కారణమేనని ఆ పార్టీ వెల్లడించింది. రాష్ట్రమంతా ముఖ్యమంత్రి పట్ల వ్యతిరేకతతో నిండిపోయిందని అళప్పుజ సమావేశం అభిప్రాయపడింది. బీజేపీని అధికారం నుంచి తొలగించగలిగే స్థితిలో కాంగ్రెస్ ఉన్నదన్న అభిప్రాయమే జనంలో ఉన్నదని ఆ జిల్లా సీపీఐ కార్యదర్శి టీజే అంజలోస్ సమర్పించిన నివేదికలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రిని సరైన తోవలో పెట్టేవాళ్లు సీపీఎంలో ఒక్కరు కూడా లేరని నివేదిక మీద మాట్లాడిన నాయకులు విమర్శించారు. ముఖ్యమంత్రి స్థాయి నాయకుడు ప్రత్యర్థులను 'స్కౌండ్రల్' వంటి పదాలతో తూలనాడడం ఏమిటని కూడా వారు ప్రశ్నించారు. ఎల్‌డీఎఫ్ ఓట్లు కేవలం కాంగ్రెస్‌కే కాదు, బీజేపీ ఖాతాలోకి కూడా పోయాయని వారు చెప్పారు.

**బెడిసికొట్టిన కేంద్ర వ్యతిరేక ప్రచారం**

రాష్ట్రానికి నిధుల కేటాయింపులో కేంద్రం తీవ్ర వివక్ష చూపుతున్నదన్న ఆరోపణతో నిరుడు రాష్ట్ర ప్రభుత్వమే నిరసన కార్యక్రమాలు చేపట్టింది. అవే 'నవ కేరళ సదస్సులు'. ఈ సదస్సులకు మొత్తం పినరయి మంత్రిమండలి కట్టకట్టుకుని వెళ్లేది. రోజుకు నాలుగు సభల వంతున 140 అసెంబ్లీ నియోజక వర్గాలలో బహిరంగసభలు జరిపారు. 36 రోజులు సాగిన ఈ యాత్ర నవంబర్ 18, 2023న కాసర్‌గోడ్ దగ్గర మొదలయింది. ఆర్థికమంత్రి కేఎన్ బాలగోపాల్ కేంద్రం రాష్ట్రానికి రావలసిన రూ. 57,000 కోట్లు కేంద్రం ఆపేసిందని చెబితే, పినరయి ఆ మొత్తాన్ని రెట్టింపు చేసి చెప్పేవారు. ఆ సమయంలోనే కేరళ పర్యటనకు వెళ్లిన నిర్మలా సీతారామన్ కేంద్రం కేరళకు ఒక్క రూపాయి కూడా బకాయి లేదని తేల్చి చెప్పారు. ఒకవేళ బకాయి ఉంటే అది లెక్కలు చెప్పకపోవడం వల్ల మాత్రమే ఆగి ఉంటుందని వివరణ ఇచ్చారు.

**బుజ్జగింపు ధోరణికి పరాకాష్ట**

కేరళలో ఇటు ఎల్‌డీఎఫ్, అటు యూడీఎఫ్ రెండూ మైనారిటీల బుజ్జగింపులో పోటీ పడుతూ ఉంటాయి. ఈ విషయాన్ని వివరిస్తూ యోగమ్ సంస్థకే చెందిన యోగనాథమ్ పత్రికలో నటేశన్

## ఎర్ర ఓటు కొల్లగొట్టిన కాషాయం



సురేష్ గోపి విజయోత్సవం

కేరళలో 20 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. ఇందులో 18 కాంగ్రెస్ నాయకత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్‌కు దక్కాయి. ఒకటి సీపీఎం, ఒకటి బీజేపీ గెలుచుకున్నాయి. బీజేపీ వరకు ఇది చరిత్రాత్మక విజయం. ఈ ఎన్నికలలో ఎల్‌డీఎఫ్ 3 శాతం ఓటు శాతం కోల్పోయింది. నిజానికి ఎల్‌డీఎఫ్ ప్రత్యర్థి యూడీఎఫ్‌కు కూడా రెండు శాతం ఓట్లు (2019 ఎన్నికలతో పోలిస్తే) తగ్గిపోయాయి. అయినా 18 సీట్లతో తుడిచిపెట్టేసింది. అయితే ఎల్‌డీఎఫ్ ఓట్లను బాగా కొల్లగొట్టిన పార్టీ బీజేపీ. ఈ పార్టీ తన ఓట్ల శాతాన్ని 3.6 శాతానికి పెంచుకోగలిగింది. త్రిశూర్‌లో నటుడు సురేశ్ గోపీ గెలిచారు. నిజానికి శాసనసభ నియోజకవర్గాల ప్రాతిపదికగా ఓట్ల శాతాన్ని పరిశీలిస్తే 18 లోక్‌సభ స్థానాలలో బీజేపీ ఆధిక్యం చూపింది. ఇందులో 11 చోట్ల 2021 అసెంబ్లీ ఎన్నికలలో ఎల్‌డీఎఫ్ ఆధిక్యం చూపింది.

ఎన్నికలలో అక్కడ లెఫ్ట్ తుడిచిపెట్టుకుపోవడమే కాకుండా, బీజేపీ ఆధిక్యాన్ని ప్రదర్శించింది. కన్నూర్‌లో కూడా కమ్యూనిస్టు పార్టీ తరఫున పోరాడి అమరులైన వారు ఉన్నారు. అక్కడి చాలా ఎర్రకోట లలో బీజేపీ అగ్రస్థానానికి ఎగబాకింది. వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీ తరఫున ప్రధాన పోటీదారుగా ఉంటానని నటుడు సురేశ్ గోపీ ప్రకటించడం కూడా ప్రత్యేకంగా చూడవలసిన అంశమేనని వల్లికున్ను అభిప్రాయపడ్డారు. సురేశ్‌గోపి అలా ప్రకటించగలి గారు అంటే, రాష్ట్రంలోని చాలా కమ్యూనిస్టు కోటల మీద బీజేపీ రాజకీయంగా ప్రభావాన్ని చూపడం ఆరంభించందనే చెప్పాలని అన్నారు. ఈ లోపాలను సరిదిద్దుకుని పార్టీ ముందుకు వెళుతుందని తాను విశ్వసించడం లేదని ఆయన తెగేసి చెప్పారు. ఎందుకంటే, తప్పులేమైనా జరిగి ఉంటే దిద్దుబాటు చర్యలు తీసుకుంటామని మాత్రమే ముఖ్యమంత్రి ఫేస్‌బుక్‌లో చెప్పారు. దీని అర్థం ముఖ్యమంత్రి తన తప్పును తాను తెలుసుకోలేదనే అనాలని అభిప్రాయ పడ్డారాయన.


సీపీఎం నేతలు, కేరళలో పార్టీ పరిస్థితి గురించి మీ అభిప్రాయం ఏమిటి అన్న ప్రశ్నకు వల్లికున్ను సమాధానం తీవ్రంగానే ఉంది.

కేరళలో (పార్టీ) పరిస్థితి ప్రమాదకరంగానే ఉంది. కేరళ సీపీఎంలో కనిపించే అతి చిత్రమైన విషయం– పదిహేనేళ్లు పినరయి విజయన్ పార్టీ కార్యదర్శి. గడచిన ఎనిమిదేళ్లుగా వామపక్ష ప్రభుత్వా నికి నాయకత్వం వహిస్తున్నది కూడా ఆయనే. అటు ప్రభుత్వాన్నీ, ఇటు పార్టీనీ శాసిస్తున్నది ఆయనే. కానీ పినరయి పట్ల విశ్వసనీయత అధఃపాతాళానికి పోయింది. అది సిద్ధాంతపరమైన కారణాలతో జరగలేదు. అవినీతి వల్లనే. ముఖ్య మంత్రికీ, ఆయన కుమార్తెకు వ్యతిరేకంగా న్యాయ సంఘానికి బలమైన సాక్ష్యాలే దొరికాయి. అయితే దీని మీద అంతిమ తీర్పు ఎలా వస్తుందో అది వేరే విషయం. అయినా పినరయి మీద అవిశ్వాస తీర్మానం రాలేదు. ఇక్కడ మనం అర్థం చేసుకోవలసినది కేరళలో ఏర్పడిన తొలి కమ్యూనిస్టు ప్రభుత్వం విశ్వసనీయత అంతా అవినీతికి వ్యతిరేకంగా నిలిచినందుకే.

ప్రధాని నరేంద్ర మోదీ చూపించిన మర్యాదను కూడా పినరయి తన అక్రమాలను దాచిపెట్టడానికి కవచంగా వాడుకునే ప్రయత్నం చేశారని వల్లికున్ను మాటల ద్వారా తెలుస్తుంది. అయితే ఇంకో రెండా కులు ఎక్కువ చదివిన మోదీ పినరయి నాటకాన్ని బయటపెట్టిన రీతి ఎలాంటిదో కూడా వల్లికున్ను మాటలలోనే గమనించవచ్చు. 2016లో గెలిచి ముఖ్యమంత్రి అయిన తరువాత పినరయి ప్రధాని మోదీని కలుసుకోవడానికి వెళ్లారు. అప్పుడే మోదీ, ప్రధాని నివాసాన్ని మీ నివాసంగా భావించమని చెప్పినట్టు పినరయి చెప్పుకున్నారు. అయితే బంగారం స్మగ్లింగ్ ఎలా జరిగిందో అందరికీ తెలుసునని గడచిన అసెంబ్లీ ఎన్నికలలో మోదీ ధ్వజమెత్తారని వల్లికున్ను గుర్తు చేశారు. అంతేకాదు, లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో అయితే ఇంకో అడుగు ముందుకు వేసి ముఖ్యమంత్రి కార్యాలయంలో ఏం జరిగిందో (స్మగ్లింగ్‌లో) అందరికీ తెలుసుననే ప్రధాని విమర్శించా రని వల్లికున్ను గుర్తు చేశారు.

నరేంద్ర మోదీ, పినరయి విజయన్‌ల సమావేశం కేవలం ముఖ్యమంత్రి, ప్రధాని మధ్య మర్యాద పూర్వక సమావేశంగా చూడలేమని వల్లికున్ను అభిప్రాయపడడం విశేషం. ఒక వాస్తవమైన ఆధారంతో చెబుతున్నాననీ, మోదీ అజెండాయే పినరయి అమలు చేస్తున్నారని వల్లికున్ను నిర్ద్వంద్వంగా ప్రకటించారు. అంతేకాదు, పినరయి విజయన్ కేరళ గోర్బచెవ్ అనుకోవచ్చునా అంటే, కేరళకు మాత్రమే కాదు, భారత్‌కే గోర్బచెవ్ అనుకోవచ్చునని కుండ బద్దలుకొట్టారు. ★

ఎన్నికల ఫలితాల తరువాత రాసిన వ్యాసం కలకలం సృష్టించింది. యోగమ్ కేరళ సంస్కర్త నారాయణ గురు ఆశయాలతో నడుస్తున్న ఈ సంస్థ ఆర్‌ఎస్‌ఎస్‌కు అనుబంధంగా ఉంటుందన్న మాట కూడా ఉంది. అందుకే నటేశన్ వ్యాఖ్యలకు ప్రాధాన్యం వచ్చింది. త్రిశూర్, అళప్పుజలతో పాటు కొన్ని చోట్ల బీజేపీకి గణనీయంగా ఓట్లు వచ్చాయంటే కారణం ఆ రెండు ఫ్రంట్‌ల బుజ్జగింపు రాజకీయాలే నని నటేశన్ అభిప్రాయపడుతున్నారు. ఆ ఫ్రంట్‌ల బుజ్జగింపు వైఖరితో దిక్కుతోచని క్రైస్తవులు ఈసారి బీజేపీ వైపు మొగ్గారని నటేశన్ రాశారు. కేరళకు తొమ్మిది రాజ్యసభ స్థానాలు ఉన్నాయి. అందులో ఐదు ముస్లింలకే ఇచ్చారు. రెండు క్రైస్తవులకు ఇచ్చారు. సీపీఎం, సీపీఐ రెండూ కూడా ముస్లింలకే రాజ్యసభ సభ్యత్వాలు కట్టబెట్టాయి. అయితే పినరయి మితిమీరిన బుజ్జగింపు ధోరణి ప్రదర్శించారని సీపీఐ ఆరోపించడమే వింత. 2024 లోక్‌సభ ఎన్నికలలోను ముస్లింలు, క్రైస్తవులు అధికంగా ఉన్న మలప్పురం, కొట్టాయం ప్రాంతాల లోను ముస్లిం, క్రిస్టియన్ అభ్యర్థులనే నిలిపి, హిందువులు అధికంగా ఉండేచోట కూడా ఆ వర్గాల వారికే టిక్కెట్లు ఇచ్చి హిందువులకు మొండి చేయి చూపారని నటేశన్ ఆరోపణ. ఆ విధంగా సీపీఎం, సీపీఐ రెండూ హిందువులలోని వెనుకబడిన తరగతుల వారి నైతిక స్థయిర్యాన్ని దెబ్బతీశారని ఆయన వ్యాఖ్యానించారు. స్వయంగా ఎజువా వర్గానికి చెందిన నటేశన్ తమ



నటేశన్

**త్రిశూర్, అళప్పుజలతో పాటు కొన్ని చోట్ల బీజేపీకి గణనీయంగా ఓట్లు వచ్చాయంటే కారణం ఆ రెండు ఫ్రంట్‌ల బుజ్జగింపు రాజకీయాలేనని నటేశన్ అభిప్రాయ పడుతున్నారు. ఆ ఫ్రంట్‌ల బుజ్జగింపు వైఖరితో దిక్కుతోచని క్రైస్తవులు ఈసారి బీజేపీ వైపు మొగ్గారని నటేశన్ రాశారు.**

వర్గం ఎల్‌డీఎఫ్ హయాంలో ఎలాంటి లబ్ధి పొందలేకపోయిందని ప్రకటించారు. నిజానికి గడచిన అర్ధ శతాబ్దకాలంగా కేరళలో మైనారిటీలే ఆర్థికంగా, సామాజికంగా ముందడుగు వేశారు. హిందువులలో వెనుకబడిన తరగతుల వారు, ఎస్సీ, ఎస్టీ వర్గాలు నిర్లక్ష్యానికి గురైనాయి. కేంద్రానికి వ్యతిరేకంగా సీఏఏ వంటి అంశాలకు విపరీత ప్రచారం ఇచ్చి, ముస్లింలను మచ్చిక చేసుకునే ప్రయత్నంలో సంప్రదాయక ఎజువా వర్గ ఓట్లను సీపీఎం కోల్పోయింది. ఓబీసీలైన ఎజువాలు హిందువులలో పెద్ద సంఖ్యలో ఉన్నారు.

ఒకనాడు దేశంలో మూడు రాష్ట్రాలలో అధికారంలో ఉండి చెలరేగిపోయిన కమ్యూనిస్టులు (సీపీఎం) ఇప్పుడు కేరళకు పరిమితమయ్యారు. ఇప్పుడు లోక్‌సభలో ఆ వామపక్ష శిబిరానికి ఉన్న స్థానాలు తొమ్మిది. వీరి గెలుపు ప్రభావం ఎంతో ఇప్పుడు ఆలోచించే అవసరమే లేకున్నా, ఓటమిలోను కొన్ని ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కేరళ వామపక్ష శిబిరంలో ఇంత అల్లకల్లోలం చెలరేగుతూ ఉంటే దేశంలో మీడియా ఎలా గోప్యంగా ఉంచగలిగింది? పినరయి గురించి అహంకారపూరిత ధోరణి అన్న విమర్శ అంత తీవ్ర స్థాయిలో వెల్లువెత్తినా, ఆయన రాజీనామా చేసి పోతేనే మంచిదని సోదర వామపక్ష సంస్థలు ఎలుగెత్తినా మీడియాలో ఎందుకు రాలేదు? అదే విమర్శ నరేంద్ర మోదీ మీద చాలా తక్కువ తీవ్రతతో వచ్చినప్పటికీ ఎందుకు మీడియా అంతా ఆ రచ్చ? కమ్యూనిస్టులే గోప్యతకు నీళ్లు వదిలేస్తే, ఎర్రకలాలకి ఎందుకు గోప్యత? కమ్యూనిస్టుల శిబిరానికి లేని దురద కలాలకు ఎందుకు? అధికారం ఇచ్చిన పాపానికి కామ్రేడ్ల అహంకారం ప్రజలు మౌనంగా భరించవలసిందేనన్న సందేశం ఇందులో లేదా? ★

హఠాత్తుగా టిబెట్ మళ్లీ వార్తల్లోకి ఎక్కింది. టిబెట్‌లోని కొన్ని ప్రాంతాలకు భారత్ భారతీయ పేర్లు పెట్టబోతోందన్న వార్తతో, అమెరికా నుంచి అటు రిపబ్లికన్లు, ఇటు డెమోక్రాట్లు ఏకగ్రీవంగా టిబెట్ స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన ప్రాంతమని, కనుక దాని వివాదం ఇంకా అపరిష్కృతంగానే ఉన్నదంటూ సెనేట్‌లో తీర్మానాన్ని ఆమోదించడమే కాదు, ఏకంగా ఏడుగురు సభ్యుల బృందం వచ్చి దలైలామాను కలవడం వరస సంచలన వార్తలు ప్రపంచం దృష్టికి వచ్చాయి. దలైలామాను కలిసేందుకు వచ్చిన అమెరికా బృందం ప్రధాని మోదీని కూడా కలవడంతో చైనా కస్సుబుస్సులాడుతోంది. నిన్నటివరకూ తాను అడుగు పెట్టిన ప్రతి ప్రాంతంలో భూమిని ఏదో ఒక మిషతో నిరాటంకంగా ఆక్రమిస్తూ తన పరపతిని పెంచుకుంటూ వస్తున్న చైనాకు మరి ఇది ఒక ఆటంకమే.



# టిబెట్‌కు కొత్త ఆశ

హిమాచల్‌ప్రదేశ్‌లోని ధర్మశాలలో టిబెట్ ప్రవాస ప్రభుత్వ అధిపతి టెంజిన్ గయాస్టో (14వ దలైలామా)ను జూన్ 19న అమెరికా కాంగ్రెస్ సభ్యులు కలుసుకున్నారు. భారత ప్రభుత్వం తరపున ఒక అధికారి అరుణాచల్‌లో పర్యటించినా నిరసన వ్యక్తం చేయడానికి సిద్ధంగా ఉండే చైనా, అమెరికా బృందం రాకతో మండిపడింది. టిబెట్ ప్రజానీకం తమకు నచ్చిన మతాన్ని ఆచరించే హక్కును, వారి సంస్కృతిని కాపాడుకునే హక్కును కూడా కలిగి ఉందని కొన్ని దశాబ్దాలుగా అమెరికా భావిస్తున్నది. ఆ విధానంలో ఇప్పుడు పెను మార్పు తెచ్చింది. దీనికి కొనసాగింపుగానే అమెరికా బృందం దలైలామాను కలుసుకున్నది. టిబెట్‌తో 2010 నుంచి స్తంభించిన చర్చలను చైనా పునరుద్ధరించాలని ఈ మాసంలోనే అమెరికా కాంగ్రెస్ (పార్లమెంట్) ఒక బిల్లును ఆమోదించింది. 'టిబెట్ సమస్యను పరిష్కరించాలి' పేరుతో అన్ని పక్షాల ఆమోదంతో తెచ్చిన ఈ బిల్లు మీద జోబైడెన్ త్వరలోనే సంతకం చేయనున్నారు. ఆ బిల్లు రూపకర్త, కాంగ్రెస్‌లో ప్రతినిధుల సభ మాజీ స్పీకర్ నాన్సీ పెలోసి కూడా ఆ బృందంలో ఉన్నారు. కాంగ్రెస్ విదేశ వ్యవహారాల కమిటి చైర్మన్ మైకేల్ మెక్‌కౌల్ నాయకత్వం వహించారు. కాంగ్రెస్ నిబంధన కమిటీ ర్యాకింగ్ సభ్యుడు జిమ్ మెక్‌గోవర్న్, ఇండోపసిఫిక్ ర్యాంకింగ్ సభ్యుడు అమీ బెరా కూడా సభ్యులుగా ఉన్నారు. కాబట్టి ఇది చాలా శక్తిమంతమైన ప్రతినిధి బృందం.



పెలోసి, దలైలామా

ఈ పరిణామం పట్ల చైనా ఆందోళనకు, ప్రతికూల ధోరణికి కొన్ని అంశాలు కనిపిస్తాయి. మునుపెన్నడూ లేని స్థాయిలో అమెరికా-చైనా ద్వైపాక్షిక సంబంధాలు పతనమైన కాలమిది. వాటిని పునరుద్ధరించుకునే పనిలో ఉన్న చైనాకు అమెరికా బృందం దలైలామాను కలవడం అపశకునంగానే కనిపిస్తుంది. టిబెట్ మీద అమెరికా విధానం ఏమిటి? టిబెట్ అనే స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన ప్రాంతం చైనాలో భాగమే. కానీ తమ భవిష్యత్తును టిబెటన్లు మాత్రమే నిర్దేశించుకోవాలి అంటుంది అమెరికా. అలాగే 2016 నాటి డోక్లాం, 2020 నాటి గల్వాన్ పరిణామాలతో భారత్‌తో కూడా చైనా సంబంధాలు అధ:పాతాళానికి పడిపోయిన సమయంలో ఈ పరిణామం సంభవించింది. ఈ పరిణామానికి చైనా తత్తర పడుతున్న సూచనలు కూడా కనిపిస్తున్నాయి. టిబెట్ సమస్య పరిష్కారం బిల్లు మీద సంతకం చేయరాదని అమెరికా అధ్యక్షుడు జోబైడెన్‌ను చైనా హెచ్చరించడమే ఇందుకు నిదర్శనం. టిబెట్ సమస్య పరిష్కార బిల్లు అమెరికా విధానంలో వచ్చిన మార్పును సంకేతిస్తున్నదని అమెరికా కాంగ్రెస్ విదేశ వ్యవహారాల కమిటీ చైర్‌పర్సన్ మైకేల్ మెక్‌కౌల్ చెప్పడం ఈ పరిణామానికే కీలకం. మెక్‌కౌల్ టిబెట్ పార్లమెంట్‌లో ప్రసంగిస్తూ ఈ మాట చెప్పారు. అమెరికా బృందం వచ్చి దలైలామాను కలుసుకోవడం అంటే చైనాకు గట్టి సందేశం పంపించడమేనని టిబెట్ ప్రవాస పార్లమెంట్ స్పీకర్ కెన్పో సోనమ్, పలువురు టిబెటన్లు భావిస్తున్నారు. దీనికి కొసమెరుపు:చైనా హెచ్చరికలను బేఖాతరు చేస్తూ అమెరికా బృందం ధర్మశాలలో ఉండగానే జూన్ 20న మన ప్రధాని నరేంద్ర మోదీ వెళ్లి కలుసుకున్నారు. జూన్ 23వ తేదీనే దలైలామా ఆరోగ్య పరీక్షల కోసం అమెరికా చేరుకోవడం మరొక మలుపు.

మొన్నమొన్నటివరకూ ఉత్పత్తి రంగంలో చైనాను ప్రోత్సహించి, పెట్టుబడులు పెట్టిన అమెరికా, ఇప్పుడు అది తనను శాసించే స్థాయికి ఎదుగు తుందేమోనని వణుకుతోంది. అందుకే, వడివడిగా ఆర్థిక నిచ్చెన ఎక్కుతున్న భారత్‌ను దానికి పోటీగా నిలిపేందుకు తాపత్రయ పడుతోంది. నిజానికి, అది మనకు మేలు చేసినా, ఇన్నేళ్లు అటకమీద ఉన్న విషయాన్ని అమెరికా సంచలనం చేయడం వెనుక లక్ష్యం చైనాను ఇరుకున పెట్టడమే అన్నది నిర్వివాదం. అయితే ఈ ప్రాంతం నిన్నటి వరకూ భారత్, చైనాలకు మధ్య ఈ ప్రాంతం ఒక

బఫర్‌జోన్‌గా (తటస్థ ప్రదేశంగా) ఉందన్న విషయాన్ని విస్మరించరానిది.

**చైనాను నియంత్రించడమే అమెరికా లక్ష్యం**

చైనాను నియంత్రించేందుకు అమెరికా ప్రయత్నాలు తీవ్రతరం చేస్తోంది. సమస్య సత్వర పరిష్కారం పేరుతో బిల్లు ఆమోదం ఇందుకే. గుర్తింపు, మానవ హక్కులు, మత, సాంస్కృతిక, జాతీయ హక్కుల ప్రస్తావనతో పాటు తమకు నచ్చిన మతపరమైన నాయకులను ఎంపిక చేసుకునే హక్కు టిబెటన్ ప్రజలకు ఉందనే విషయాన్ని ఈ చట్టం నొక్కి చెప్తుంది. టిబెటన్ బౌద్ధాన్ని పిఆర్‌సి, భూటాన్, నేపాల్, మంగోలియా, భారత్, రష్యన్ ఫెడరేషన్, యునైటెడ్ స్టేట్స్ సహా పలు దేశాల్లో ఆచరిస్తున్న విషయాన్ని పట్టి చూపుతూ, ఈ కారణంగానే దలైలామాను చైనా ఏకపక్షంగా నియమించలేదనే విషయాన్ని స్పష్టం చేసింది. లాసాలో యుఎస్ కాన్సులేట్‌ను ఏర్పాటు చేసేందుకు అనుమతించే వరకూ అమెరికాలో పిఆర్‌సి మరొక కాన్సులేట్‌ను ఏర్పాటు చేసుకునేందుకు చైనాకు అనుమతి ఇచ్చేది లేదని స్పష్టం చేసింది. ఆ మాత్రానికే వివిధ దేశాల్లోని టిబెటన్లు సంతోషిస్తున్నారు.ప్రస్తుతం చైనా పాక్, శ్రీలంకల నుంచి, బంగ్లా నుంచి కూడా కాస్త ప్రతికూలత ఎదుర్కొంటున్న తరుణంలో అమెరికా కొత్త ఎత్తు వేసినప్పటికీ టిబెట్ సమస్య దక్షిణాసియా లోనే పెద్ద చరిత్ర కలిగిన అంశం.

**అధికారం లేనివారితో ఒప్పందం**

నిజానికి చైనాను ఇబ్బంది పెట్టేందుకు అత్యంత ముఖ్యమైన చట్టకోణం ఒకటుంది. టిబెట్టుపై 1950లో ఆక్రమణకు దిగిన చైనా, మే 23, 1951న చట్టవ్యతిరేకంగా 17 పాయింట్ల చట్టంపై బల వంతంగా సంతకాలు చేయించు కుంది. పిఆర్‌సికి టిబెట్‌పై పూర్తి నియంత్రణను ఈ ఒప్పందం ఇచ్చింది. ఏ అధికారం లేకుండానే టిబెట్ తరపున, దాని ప్రజల తరపున ఈ ఒప్పందంపై ఒక వ్యక్తి సంతకాలు చేశాడు. కాగా, ప్రధాన ప్రకటనలో మొదటిలోనే టిబెట్‌ను ప్రత్యేక భూభాగమని, గత శతాబ్ద కాలంలో చైనా ఎటువంటి ప్రభావవంతమైన నియంత్రణను కలిగి లేదని కూడా ఆ ఒప్పందంలో పేర్కొన్నట్టు వార్తలు వచ్చాయి. ఒకవేళ ఇదే నిజమైతే, ఈ న్యాయపరమైన లోపాలను వాడుకోవచ్చు. తనంతట తానుగా టిబెట్ చైనాలో భాగం కాదనే విషయాన్ని ఇది రుజువు చేస్తుంది. ఇందుకు మరింత లోతుగా అధ్యయనం చేయడం అవసరం.

**మావో ఫైవ్ ఫింగర్ సిద్ధాంతం**

2020లో భూటాన్‌కు 100 కిమీల లోపల ఉన్న సాకతెంగ్ శాంక్చువరీ తమదంటూ చైనా ప్రకటించింది. ఈ ప్రాంతం తవాంగ్ ప్రాంతం దగ్గరగా ఉంటుంది, దీనితో దీనిని కూడా దక్షిణ టిబెట్‌లో భాగమని చైనా ప్రకటించేసింది. ఈ రకంగా చైనా మావో అరచేతిని, అతడి ఫైవ్ ఫింగర్ థియరీ (ఐదు వేళ్ల సిద్ధాంతాన్ని) చైనీయులు పునరుద్ధరిం చారు. "గ్జిజాంగ్ (టిబెట్) అన్నది తన ఐదువేళ్ల – లద్దాక్, నేపాల్, సిక్కిం, భూటాన్, అరుణాచల్ నుంచి విడివడిన చైనా కుడి చేతి అరచెయ్యి. ఈ ఐదింటినీ భారత్ ఆక్రమించింది, లేదా అవి భారత్ ప్రభావంలో ఉన్నాయి. ఈ ఐదూ గ్జిజాంగ్ (టిబెట్)తో తిరిగి కలిసేందుకు వాటిని 'విముక్తం' చేయడం చైనా బాధ్యత,' అన్న ఈ సిద్ధాంతానికి అనుగుణంగానే తన పావులు కదపడం ప్రారంభించింది.

**భారతీయ దృక్పథం**

టిబెట్టును 2003వరకూ చైనాలో భాగంగా భారత్ గుర్తించలేదు. ఆ ఏడాది చేసుకున్న ఒప్పందం ఇలా ఉంది –'సరిహద్దు వాణిజ్య మార్కెట్టుకు వేదికగా సిక్కింలోని చంగ్గు ప్రాంతాన్ని నిర్దేశించేందుకు భారతీయ పక్షం అంగీకరిస్తోంది; చైనా పక్షం టిబెట్ స్వతంత్రప్రతిపత్తిగల ప్రాంతంలోని రెన్‌క్విన్‌గ్యాంగ్‌ను సరిహద్దు వాణిజ్య మార్కెట్‌కు వేదికగా పేర్కొం టోంది.' కానీ, ఈ ప్రకటనను కాస్త తిరగమరగ చేస్తే, టిబెట్‌ను చైనాలో భాగంగాను, సిక్కింను భారత్‌లో భాగంగానూ భారత్ గుర్తిస్తున్నట్టు స్థాపించవచ్చు. నాథూలా పాస్‌ను ప్రవేశ, నిష్క్రమణ పాయింట్‌గా ప్రస్తావించడంతో, దానినే సరిహద్దుగా పరిగణించడం సహజం. మరొక విషయం ఏమిటంటే, టిబెట్ స్వయంప్రతిపత్తి ప్రాంతం మెక్‌మోహన్ రేఖకు దక్షిణం వరకూ విస్తరించి ఉందని 2003లో చైనా ఎప్పుడూ పేర్కొనలేదు. సహజ అవగాహన ఏమిటంటే, కొన్ని ప్రదేశాలలో ఆ రేఖపై వివాదాలు ఉన్నప్పటికీ, మెక్‌మోహన్ రేఖకు ఉత్తరంగా టిబెట్ ఉంటుందన్నది సామాన్య అవగాహన. ఇందుకు సాక్ష్యం, 1917లో చైనా పోస్టేజ్ మ్యాపే. ఇందులో ఎక్కడా అరుణాచల్ ప్రదేశ్‌ను టిబెట్‌లో భాగంగా చూపలేదు. అలాగే ఉత్తర సరిహద్దులు సంప్రదాయ భావనకు అనుగుణంగా అనిపిస్తాయి. ఇందులో టిబెట్, గ్జిన్‌జియాంగ్, మంగోలియాలను భిన్న ప్రాంతాలుగానే చూపారు.

2003 అనంతరమే, అరుణాచల ప్రదేశ్ దక్షిణ టిబెట్ అన్న వాదనను చైనా ప్రారంభించింది. తమ జలమంత్రిత్వ శాఖ వెబ్‌సైట్‌లో 2006లో చైనా ఒక మ్యాప్‌ను (ఇప్పుడు తొలిగించినా) పోస్ట్ చేసింది. ఇందులోనే చిత్రరూపంలో దక్షిణ టిబెట్‌గా అరుణాచల్‌ను చూపింది. కాగా, అలా చేయడం ద్వారా చైనీయులు వాస్తవంగా 2003 హామీలను ఉల్లంఘించారు. అంతేకాదు, చైనా ఎప్పుడూ చైనా–భారతీయ ఒప్పందాలను ఉల్లంఘించి తూర్పు లద్దాక్ ప్రాంతంపై 2020లో ఆక్రమణలకు పాల్పడింది. కేవలం ఈ వాస్తవాలు చాలు, టిబెట్‌ను చైనాలో భాగంగా భారత్ గుర్తించకుండా ఉండటానికి.

అయితే, టిబెట్‌ను స్థిరీకరించేందుకు చైనా పలు చర్యలకు ఇప్పటికే శ్రీకారం చుట్టింది. ఇందులో వాస్తవాధీన రేఖవద్ద సైనిక మౌలిక సదుపాయాల మెరుగుదల, టిబెట్ జనాభా, టిబెటన్ బౌద్ధాన్ని చైనామయం చేయడం కీలకమైనవి. అంతేకాదు, తమ సిద్ధాంతాన్ని బలవంతంగా రుద్దేందుకు దారిద్ర్య నిర్మూలన ముసుగులో నైపుణ్యాల శిక్షణ కేంద్రాలలో ఐదులక్షలమంది టిబెటన్లను ఉంచారనే వార్తలు కూడా ఉన్నాయి.

**పేర్ల మార్పుతో ఆట**

భారత్ ఈశాన్య ప్రాంతాలను మధ్య ప్రాచ్యానికి ప్రధాన ద్వారంగా రూపొందిస్తానంటూ ప్రకటించి నప్పటి నుంచీ చైనా 2017 నుంచి అరుణాచల్ ప్రదేశ్‌లోని పలు ప్రాంతాల పేర్లు మారుస్తూ వస్తోంది. వాస్తవాధీన రేఖ వెంట గల 12పర్వతాలు, నాలుగు నదులు, ఒక సరస్సు, ఒక పర్వత పాస్‌తో పాటుగా కొంత భూభాగం సహా 30 ప్రదేశాల పేర్లను మార్చింది. తిరిగి 2021లో 15 ప్రదేశాలు, 2023లో 11 ప్రదేశాల పేర్లను మార్చివేసి, అది దక్షిణ టిబెట్‌గా పిలుచుకునే ప్రాంతాన్ని బలోపేతం



దలైలామాను సత్కరిస్తున్న అమెరికా బృందం



# టిబెట్ కోణంలో

అవతారమూర్తి బుద్ధుడు జన్మించిన పవిత్ర స్థలిగా, ఆర్యభూమిగా టిబెటన్లు భారత్‌ను చూస్తారు. భారత్ ఎప్పుడూ టిబెటన్లకు ఆశ్రయమిస్తూనే వచ్చింది. దలైలామా 1959లో తప్పించుకుని భారత్‌కు వచ్చే యాభై ఏళ్ల ముందు 1910లో చైనా సైన్యం లాసాను చేరుకున్నప్పుడు రక్షణ కోసం పదమూడవ దలైలామా బ్రిటిష్ ఇండియాకు వచ్చారు.

ప్రాచీనకాలం నుంచి టిబెట్ తమ అంతర్భాగమన్న చైనా వాదనను 1949 కాలానికి ముందు అధికారిక చారిత్రిక రికార్డులు కొట్టిపారేస్తున్నాయంటూ ఒక ప్రాజెక్టు నివేదిక కనుగొన్న అంశాలను 2022లో యుఎస్ కాంగ్రెస్ కమిషన్ ఆన్ చైనాకు సమర్పించింది. అంతేకాదు, పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా (పిఆర్‌సి) 1950ల్లో దానిపై దండెత్తే వరకూ టిబెట్టు ఏనాడూ చైనాలో భాగం కాదని ఆ నివేదిక తేల్చిపారేసింది. టిబెట్ ఏనాడూ చైనా సామ్రాజ్యంలో భాగం కాదని రుజువు చేసేందుకు, మింగ్, చింగ్ వంశాల కాలం నాటి మ్యాపులను కూడా అందించింది. దీనితో టిబెట్‌ను కలుపుకోవడం ద్వారా చైనాను ఏకీకరించా మంటున్న పిఆర్‌సి చేస్తున్న వాదనలు నిరాధారమైనవని కూడా తేల్చింది. పిఆర్‌సి చెప్పే చారిత్రిక వర్షన్ కన్నా వాస్తవ

చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నది.


**భారత వైఖరిలో మార్పు**

చైనాతో సన్నిహితమైన సంబంధాలను నెలకొల్పుకోవడం కోసం మోదీ ప్రభుత్వం ధర్మశాలలో నివసిస్తున్న బౌద్ధ ఆధ్యాత్మిక గురువు దలైలామా నుంచి దూరంగానే ఉన్నది. కానీ, 2020లో వాస్తవాధీన రేఖ వద్ద గల్వాన్‌లో భారత్, చైనా సైనికుల మధ్య క్రమంతప్పకుండా హింసాత్మక ఘర్షణలు చోటు చేసుకోవడం ప్రారంభమైన తర్వాత ఇరు దేశాల మధ్య సంబంధాలలో కదలిక వచ్చింది. తదనంతరం టిబెటన్ స్పెషల్ ఫ్రాంటియర్ ఫోర్స్‌ను అధికారికంగా సమర్ధించడం ద్వారా భారత్ తన వైఖరిని వెల్లడించింది. కాగా, కేంద్ర టిబెటన్ ప్రభుత్వాన్ని గుర్తిస్తే, ఆ సమర్ధనకు మరింత విలువుంటుందని టిబెటన్లు భావిస్తున్నారు.

ఈ మార్పు వెలుగులోనే మోదీ ప్రభుత్వం 14వ దలైలామాతో తమ దూరాన్ని చెరిపివేసింది. దలైలామా 87వ జన్మదినమైన జులై 6న ఆయనకు ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలపడం చైనాకు ఆగ్రహాన్ని కలిగించింది. ఊహించి నట్టుగానే, "14వ దలైలామా వేర్పాటువాద, చైనా వ్యతిరేక స్వభావాన్ని భారత్ పూర్తిగా తెలుసుకోవలసి ఉంది," అంటూ హితవు కూడా పలికింది. నిజానికి 2014లో మోదీ ఎన్నిక అయినప్పటి నుంచీ దలైలామాకు పుట్టినరోజు శుభాకాంక్షలు పంపుతూనే ఉన్నారు.

దీనితో పాటుగా, 2023లో అంతర్జాతీయ బౌద్ధ సంఘను భారత్‌లో నిర్వహించారు. ఇటీవలికాలంలో చైనా సరిహద్దు వివాదంపై తన వైఖరిని కటువుగా మార్చుకుంది. దీనితో, దేశీయంగా, అంతర్జాతీయంగా దలైలామా కదలికలను నియంత్రించే భారతీయ ప్రభుత్వం, ఆయన ఉనికిని వ్యూహాత్మక సందేశం కోసం ఉపయోగించు కుంటోంది. ఇందుకు అనుగుణంగానే భారత్ ఆగస్టు 2023లో 6వ యూఘర్ స్వాతంత్ర్య సమరయోధుల సదస్సును న్యూఢిల్లీలో నిర్వహించింది. అంతర్జాతీయ టిబెట్ స్వాతంత్రోద్యమంలో భాగమైన ఈ సమావేశానికి ప్రవాస టిబెట్ ప్రభుత్వ, పార్లమెంటు సభ్యులు కూడా హాజరయ్యారు.

టిబెట్ విషయంలో చైనా అత్యంత సున్నితంగా ఉన్నట్టు అనిపిస్తోంది. ఆ దేశ అతిపెద్ద బలహీనత అదే. దానికి గ్జిన్‌జియాంగ్‌ను కూడా జతచేస్తే ఈ బలహీనత మరింత పెరుగుతుంది. ఈ క్రమంలోనే భారత్ తన దూకుడును పెంచడం అవసరం. మొదటగా, 2003 ఒప్పందంపై వ్యాఖ్యానం ఏకపక్షమన్న విషయంతో ప్రారంభించి, దానిని చట్టపరంగా సవరించాలంటూ ప్రచారం చేయడం అవసరమన్నది నిపుణుల భావన. తూర్పు లద్దాక్‌లో చైనా పాల్పడిన సైనిక దౌర్జన్యం అన్ని ఒప్పందాలను ఉల్లంఘించింది. ఈ నేపథ్యంలో టిబెట్టును చైనాలో భాగంగా గుర్తించకూడదు, 2003లో గుర్తింపు వివాదాస్పదమైంది. కనుక, టిబెట్‌ను మొదటగా నిర్వచించాలన్నది వారి సూచన. అదనంగా, అరుణాచల్‌ప్రదేశ్ తమదని చైనా అంటున్నట్టుగా ప్రాచీన మత గ్రంథాల ఆధా రంగా మానససరోవర్ సరస్సు ఉన్న ప్రాంతమంతా ఉత్తరాంచల్‌లోని భాగమని ప్రకటించాలి. ఈ మొత్తం అంశాలపై తిరిగి చర్చలు జరపాల్సిన అవసరం ఉం ది. అప్పటివరకూ టిబెట్టును స్వతంత్ర దేశంగా పరిగణించడం ఒక ఉత్తమ పద్ధతి అన్నది భౌగోళిక రాజకీయ నిపుణుల



## వాస్తవ చరిత్ర

చైనా చరిత్ర భిన్నమైందని దీని ద్వారా మనకు అవగతమవుతుంది.


ఇంకాస్త వెనకకు వెళ్లినా టిబెట్ స్వతంత్రంగానే ఉన్న సంగతి తెలుస్తుంది. సాంగ్‌త్సేన్ గంపో (627-649) ఏడవ శతాబ్దంలో టిబెట్‌ను స్వతంత్ర రాజ్యంగా పాలించాడు. అతడు ఒక చైనీస్ యువరాణిని వివాహం చేసుకొని చైనాతో సంబంధాలను నెలకొల్పుకున్నాడు. దాదాపు అదే కాలంలో భారత్ నుంచి బౌద్ధం టిబెట్‌లో ప్రవేశించింది. మంగోలులు 13వ శతాబ్దంలో చైనాను, టిబెట్‌ను జయించి పాలించే వరకూ అది స్వతంత్ర రాజ్యంగానే కొనసాగింది. మంగోలుల ప్రభ తగ్గిపోయిన తర్వాత వచ్చిన మింగ్ వంశం (1368 -1644) టిబెట్‌ను అధీనంలోకి తీసుకోలేదు. తర్వాత (చివరి) చింగ్ వంశం (1644-1911) మంచూరియాకు (మంచూస్ అని కూడా అంటారు) చెందినవారు. 1720 ప్రాంతంలో టిబెట్‌లో చోటు చేసుకున్న రాజకీయ సంక్షోభ సమయంలో మంచూలు జోక్యం చేసుకొని అక్కడ శాంతి, భద్రతలను పునరుద్ధరించారు. ఇదంతా కూడా టిబెట్ తన స్వంత అధికారిక, న్యాయ వ్యవస్థలను నిలుపుకున్న సమయంలోనే జరిగింది. చింగ్‌లు కూడా టిబెట్‌ను తమ ప్రావిన్సుగా అధికారికంగా ప్రకటించే ప్రయత్నం ఏనాడూ చేయలేదు.

ఈ అస్పష్టమైన సంబంధాన్నే బ్రిటిషర్లు ‘చైనా ఆధిపత్యం’ (సుజారానిటీ)గా అభివర్ణించారు. కల్నల్ యంగ్‌హజ్బెండ్ తన పటాలంతో 1904లో లాసాకు వచ్చే ప్రవేశించే సమయానికి చైనా ప్రభావం తగ్గిపోయింది. 1912లో చాంగ్ కై షెక్ నేతృత్వంలోని జాతీయ ప్రభుత్వం టిబెట్‌ను చైనాలో భాగంగా ప్రకటించింది. తక్షణమే, 1913 ఫిబ్రవరి 13న దలైలామా టిబెట్ స్వాతంత్ర్యాన్ని ప్రకటించి, చైనీయులందరినీ బహిష్కరించారు. ఇది తన స్వంత జెండా, సైన్యం, ప్రభుత్వం, భాష, కరెన్సీ, సరిహద్దు నియంత్రణతో కూడిన వాస్తవ స్వతంత్ర టిబెట్‌ను సృష్టించింది. బ్రిటిష్ వారి ఉనికి కారణంగా చైనీయులు ఆ ప్రాంతాన్ని వదిలివెళ్లక తప్పలేదు. భారత్ స్వాతంత్ర్యం సాధించిన అనంతరం బ్రిటిష్ అధికారం కూడా తగ్గిపోవడంతో, 1949లో కమ్యూనిస్టు పార్టీ టిబెట్‌ను విముక్తి చేయవలసిందిగా వారికి అప్పీల్ చేసేలా పంచన్ లామాను ప్రభావితం చేసి, ప్రేరేపించింది. 1950లో పిఎల్ఎ ఈ కారణాన్ని సాకుగా చూపి టిబెట్‌పై దండెత్తింది. మిగిలింది చరిత్ర.

ఒక్కముక్కలో చెప్పాలంటే, చైనాలో కలిసిపోయేందుకు టిబెట్‌పై వత్తిడి వచ్చింది. పిఆర్‌సి ప్రకటించుకున్నట్టుగా అది ఏనాడూ చైనాలో సమగ్ర లేదా దాని సార్వభౌమాధికారంలో భాగం కాదు. చైనా, టిబెట్‌ల మధ్య సంబంధం అప్పుడప్పుడు ఆధిపత్యానికి సంబంధించిందే. ఈ విషయాలన్నింటినీ యుఎస్ కాంగ్రెషనల్ కమిటీ బయటపెట్టింది. ★

వాదన.

వాస్తవాధీన రేఖ వెంట సరిహద్దులను భారత్ పరిరక్షించుకోవాలి. ఇందుకోసం భారత్ సంప్రదాయ పద్ధతులపై ఆధారపడితే ఉపయోగం ఉండదు. తూర్పు, పశ్చిమ హైవేలవరకూ ప్రాంతాలన్నీ మన నిఘాలో ఉండాలి. భవిష్యత్తులో సైనికపరమైన చర్య జరిగితే, యుద్ధ క్షేత్రాన్ని తీవ్రం చేసేలా దళాలను వ్యవస్థీకరించుకోవాలి. మనం భిన్నంగా ఆలోచించి వ్యవహరించనంతవరకూ, చైనా వాస్తవాధీన రేఖ సహా ఎక్కడ కావాలంటే అక్కడ తనకు నచ్చినట్టుగా ప్రవర్తిస్తూనే ఉంటుంది.



టిబెట్టు, చైనా వ్యవహారాలపై పట్టు ఉన్న వ్యక్తులు మన దగ్గర లేకపోవడం పెద్ద లోపం. పైగా తమను తాము నిపుణులుగా చెప్పుకునే కొద్ది మంది కూడా ఒకేరకమైన భాషను, భావనలను వ్యక్తం చేస్తుంటారన్నది భౌగోళిక రాజకీయ వ్యవహారాల నిపుణుల భావన. వీరంతా కూడా భావజాలపరంగా మావోతోనో, మార్క్స్ కారణంగానో ప్రభావితమైన వారే. అందుకే వారు చైనా గొప్పదనాన్ని, భారత్ నిస్సహాయతను గురించే మాట్లాడుతారు. తన ప్రభావం కోసం చేపట్టే ఆపరేషన్లలో భాగంగా చైనా అంతర్జాతీయ మీడియాను కొనుగోలు చేస్తోందనే వార్తలు వస్తున్నాయి.

టిబెట్‌లో భారత్‌కు నిఘా స్థావరం అవసరమని సైనిక వ్యవహారాల నిపుణులు సూచిస్తున్నారు. యుఎస్ఎ ఉన్నా, లేకున్నా మనం వివిధ అంశాలకు సంబంధించి లోతుగా నిఘాను అభివృద్ధి చేసుకోవాలి. అప్పుడు మాత్రమే, మనం కూడా విషయాలను మనకు నచ్చిన లైనుపై పట్టాలను ఎక్కించి, ప్రగతి సాధించగలమన్నది వారి వాదన. ఏ పరిస్థితిలో అయినా భారత్ వెనక్కి తగ్గింది అంటే, నిఘా లోపమే. వాస్తవాధీనరేఖ ఆవలి నుంచి మానవ మేధస్సు అనేది కూడా ప్రముఖ పాత్ర పోషిస్తుంది కనుక దానిపై దృష్టి పెట్టాలి. మనం కూడా సమాచార, నిఘా ఆపరేషన్లతో మీడియాను కూడా కలిపేయాలి.

వీటన్నింటినీ మించి భూటాన్, నేపాల్ వంటి దేశాలలో భూఆక్రమణకు చైనా పన్నుతున్న పన్నాగాలను అడ్డుకునేందుకు ఆ దేశాలను కలుపుకుపోవడం కూడా అవసరం. దీనితో పాటుగా, చైనా మింగివేసిన తమ తమ భూభాగాలను/ సముద్రయాన, నావికా హక్కులను పునరుద్ధరించేందుకు దేశాలతో ఒక బృందాన్ని భారత్ ఏర్పాటు చేయాల్సి ఉందని జియోపొలిటికల్ నిపుణులు అంటున్నారు.

చైనా వెనక్కి తగ్గకపోతే దానికి ఎర్రజెండా చూపాల్సిందే. టిబెట్టే ఆ ఎర్ర జెండా. ఎన్నో లోటుపాట్లు ఉన్నా దానిని ఎర్రజెండాగా మార్చే ప్రయత్నాలు జరుగాల్సిందే. అదేమీ రాత్రికి రాత్రి జరిగే పని కాదు. కానీ, ప్రయత్నం చేయ వలసిందే. భారత్ రక్తం స్రవించేందుకు పాకిస్తాన్‌తో కలిసి చైనా ఆడిన ఆటలను మనం విస్మరించలేం. అది చేసిన ప్రయోగ రుచిని దానికి చూపవలసిందే.

భౌగోళిక రాజకీయ వ్యవహారాలలో ప్రతి దేశం తన స్వార్థాన్ని చూసుకుని ముందుకు పోతుంటుంది. ఈ రాజకీయ చదరంగంలో జాలి, దయ అనే వాటికి చోటుండదు. ఇప్పుడు మనం చైనాతో పోటీపడి రహదారులను నిర్మిస్తున్నాం, రేవులను అభివృద్ధి చేస్తున్నాం. ముఖ్యంగా ప్రధాని మోదీ అధికారం చేపట్టిన తర్వాత దేశం ప్రగతి పథంలో పరుగులు తీస్తున్నది. దానిని పట్టాలు తప్పించేందుకు జరుగుతున్న ప్రయత్నాల పట్ల అప్రమత్తంగా ఉండడమే కాదు, నిర్దయగా మన ప్రభావాన్ని పెంచుకుంటూ పోవడం ద్వారానే చైనావంటి దేశాలను నియంత్రించ గలుగుతాం. ★



తెలంగాణ రాజకీయం అంతా ఇప్పుడు బొగ్గు చుట్టూ తిరుగుతోంది. ప్రధానంగా సింగరేణి సంస్థ ఈ వ్యవహారంలో నలిగిపోతోంది. ఉమ్మడి రాష్ట్రంలో పూర్తి లాభాల్లో కొనసాగిన ఈ సంస్థ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత ఆ లాభాల స్థాయి పూర్తిగా దిగజారిపోయింది. అప్పుడు లాభాల్లో ఉన్నందునే సంస్థ ఉద్యోగులందరికీ లాభాల్లో వాటాను ఏటా బోనస్‌గా చెల్లించడం ఆనవాయితీగా వస్తోంది. కానీ బీఆర్ఎస్ సర్కారు సంస్థను దివాళా తీసే దిశగా తీసుకెళ్లిందన్న విమర్శలు వస్తున్నాయి. కేంద్రం దేశవ్యాప్తంగా బొగ్గుగనుల వేలానికి సంబంధించిన చట్టం రూపొందించినప్పుడు లోక్‌సభలో బీఆర్ఎస్ కూడా మద్దతు తెలిపింది. కానీ, గనులు వేలం సమయంలో మాత్రం ఏమీ తెలియనట్లు విమర్శల వర్షం కురిపిస్తోంది. ప్రధానంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు అటు కేంద్రంలో బీజేపీని, ఇటు రాష్ట్రంలో కాంగ్రెస్ లక్ష్యంగా ఆరోపణలు చేస్తున్నారు. గతంలో బొగ్గుగనుల వేలంలో పాల్గొనవద్దని అప్పటి సీఎం కేసీఆర్ సింగరేణి సంస్థకు ఆదేశాలు జారీ చేశారని గుర్తు చేస్తున్నారు. అది ఒకరకంగా నిరసన తెలపడమే అంటున్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వేలంలో పాల్గొనడం సింగరేణి సంస్థకు ఉరి వేసినట్లే అని కూడా కేటీఆర్ అన్నారు.

# రాజకీయ అగ్నిగుండంలో సిం

రాష్ట్రంలోని ఉన్న బొగ్గు బ్లాక్‌లను నేరుగా సింగరేణికి అప్పగించాల్సింది పోయి, వేలంలో పాల్గొని వాటిని దక్కించుకోవడమేమిటి అన్న అంశాన్ని లేవనెత్తుతూ బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కె. తారక రామారావు జనంలో మరోసారి సింగరేణిపేరుతో సెంటిమెంట్ రగిల్చే ప్రయత్నం చేశారు. కానీ, కేటీఆర్ ఆరోపణలపై కేంద్రరాష్ట్ర ప్రజా ప్రతినిధులు ప్రజా ప్రతినిధులు స్పష్టత ఇవ్వడంతో అసలు బండారం బయటపడింది. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వేర్వేరుగా ప్రకటనలు చేసినా, ఆ రెండూ వాస్తవానికి కూడా దగ్గరగా ఉండటంతో నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఆలోచించిన కోణం, ఇప్పుడు రాజకీయ ప్రాబల్యం కోసం చేస్తున్న విమర్శల కోణం ప్రజలలకు తెలిసిపోయాయి.

బొగ్గుగనులు (స్పెషల్ ప్రొవిజన్స్) చట్టం-2015 దేశవ్యాప్తంగా అమలులోకి వచ్చింది. ఈ చట్టం ప్రకారం దేశంలో ఉన్న ఖనిజ సంపదను ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థలకు వేలం ద్వారా



కేసీఆర్

అప్పగిస్తోంది. వేలంలో రాయల్టీ ఎక్కువ చెల్లించిన సంస్థకు గనులను అప్పగించే ప్రక్రియ కొనసాగుతోంది. అప్పట్లో బీఆర్ఎస్ మద్దతుతో ఉభయ సభలలో ఈ చట్టానికి ఆమోదం లభించింది. ఇన్నాళ్లు ఆ అంశాన్ని బయటకు చెప్పని బీఆర్ఎస్. తాను అధికారంలో ఉండగా, కేంద్ర ప్రభుత్వం గనులను వేలం వేసినప్పుడు మాత్రం సింగరేణికి స్థానిక బొగ్గు గనులు నేరుగా నామినేషన్ పద్ధతిలో అప్పగించాలని ఉత్తుత్తి డిమాండ్ చేసింది.

రాజకీయ రగడను చూస్తే.. బొగ్గుగనులకు సంబంధించి కేసీఆర్ చేతికి కూడా మసి అంటింది. ఆయన హయాంలో అభివృద్ధి, కాళేశ్వరం ప్రాజెక్టు, పాలాభిషేకాలు, కాంగ్రెస్, బీజేపీ, మోదీ దండుగ, దేశ ప్రజలు కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారనే మాటలు ఎక్కువగా వినపడేవి. అయితే అభివృద్ధి మాటున ఆయన చిలక్కొట్టుడు చాలా ఉందని ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాగితాలు తీసి మరీ చూపిస్తున్నారు. ప్రస్తుతం సింగరేణి బొగ్గు గనులు నిప్పు లేకుండానే భగభగమని మండుతున్నాయి. దీనికి కారణం కేంద్ర ప్రభుత్వం శ్రావణపల్లి బొగ్గు గనిని కూడా వేలంపాట వేయడం, దానిలో సింగరేణి పాల్గొనడమే. దీంతో అలవాటు ప్రకారం బీఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్, బీజేపీలపై యుద్ధం ప్రకటించేసింది. కానీ పాత లెక్కలు చూసుకోకుండా యుద్ధభేరి మోగించేయడం చాలా రాంగ్ అని కాస్త ఆలస్యంగా ఆగ్రహించింది. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సింగరేణి ప్రయివేటీకరణ కాకుండా కడుపులో పెట్టుకొని కాపాడుకున్నారని, కానీ కాంగ్రెస్, బీజేపీలు కలిసి అమ్మేస్తున్నాయంటూ కేటీఆర్ విమర్శలు గుప్పించారు. దీంతో కాంగ్రెస్, బీజేపీలు కూడా పాత లెక్కలు బయటకు తీసి, 2021లో గనులు వేలంలో సింగరేణిని పాల్గొననీయకుండా కేసీఆర్ అడ్డుకొని తన సన్నిహితులైన అరబిందో గ్రూప్ ఆఫ్ కంపెనీకి చెందిన ఆరో కోల్, శ్రీ అవంతిక కాంట్రాక్టర్లకు అవి దక్కేలా చేసి, సింగరేణికి నష్టం కలిగించారని ఆ పార్టీలు గుట్టు విప్పుతున్నాయి. కేసీఆర్ ఇప్పుడు సింగరేణి కోసం మొసలి కన్నీళ్లు కార్చుతున్నారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెర వెనక కథ చెప్పేశారు.

అంతేకాదు.. తమ అనుయాయులకు బొగ్గు బ్లాకులు అప్పగించేందుకే సింగరేణి సంస్థను వేలంలో పాల్గొనకుండా సీఎం హోదాలో కేసీఆర్ ఆదేశాలు జారీచేశారని, అలా.. సింగరేణికి ఒకరకంగా ఉరి వేశారని కిషన్‌రెడ్డి కుండబద్దలు కొట్టారు. 'సింగరేణిపై బీఆర్ఎస్ పార్టీ మొసలికన్నీరు కారుస్తోంది. లాభాల్లో ఉన్న సంస్థను అప్పులపాలు చేసిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుంది. మితిమీరిన రాజకీయ జోక్యంతో సంస్థను ఓటుబ్యాంక్‌గా మార్చుకొని కేసీఆర్ కుటుంబం ఇష్టారాజ్యంగా దోచుకుని సంస్థ ఆర్థిక విధ్వంసానికి పాల్పడింది. సంస్థ అధికారులను పావులుగా చేసుకొని రాజకీయాలు చేశారు' అని మండిపడ్డారు.కేంద్రం సింగరేణి ప్రైవేటీకరణకు యత్నిస్తున్నట్లు అసత్య ప్రచారం చేశారని, సింగరేణిలో కేంద్రం వాటా 49%, రాష్ట్ర ప్రభుత్వం వాటా 51% కాగా రాష్ట్ర ప్రభుత్వం అనుమతి

సుజాత గోపగోని, 6302164068

లేకుండా ప్రైవేటీకరణ ఎలా సాధ్యం అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే గత ప్రభుత్వం చేసిన అవినీతిపై విచారణ చేయించాలని అన్నారు.

సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారమే అత్యంత పారదర్శకంగా బొగ్గు గనుల వేలం జరుగుతోందని వెల్లడించారు. సింగరేణి వ్యవస్థను కేసీఆర్ చిన్నాభిన్నం చేశారని కిషన్‌రెడ్డి దుయ్యబట్టారు. 2014లో సింగరేణి అకౌంట్‌లో 3 వేల 500 కోట్ల రూపాయల నిధులున్నాయని, నేడు సంస్థను అప్పులపాలై కార్మికులు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన చెందారు. సింగరేణి కార్మికులకు సకాలంలో వేతనాలు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణిలో కేంద్ర ప్రభుత్వ వాటా ఉన్నప్పటికీ ఏ రోజు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని సంప్రదించలేదన్నారు. సింగరేణిని అభివృద్ధి కోణంలో

# గరేణి



కిషన్ రెడ్డి


ఏ రోజు కేసీఆర్ చూడలేదని చెప్పారు. బొగ్గు గనుల వేలం ద్వారా వచ్చే నిధులలో ఒక్క పైసా కూడా కేంద్రం తీసుకోదని, సింగరేణి కార్మికులకు హామీ ఇస్తున్నానని, అన్ని రకాలుగా అండగా ఉంటానన్నారు. సింగరేణినీ కేసీఆర్, కేటీఆర్ ఎన్నికలలో ఉపయోగించుకున్నారు తప్ప, కార్మికుల కోసం ఏం చేయలేదన్నారు. దేశవ్యాప్తంగా ఇప్పటి వరకు బొగ్గు గనులను 9 దశలుగా వేలం వేశారని, ఇందులో రూ. 37వేల కోట్లు ఆదాయం వచ్చిందన్నారు. ఇందులో ఒక రూపాయి కూడా కేంద్రానికి రాదని, 14 శాతం రాయల్టీ రాష్ట్రప్రభుత్వానికి వస్తుందన్నారు.

వేలంలో పాల్గొనకుండా బీఆర్ఎస్ నేతలు సింగరేణికి నష్టం చేశారని,కోల్ బ్లాకులను వారి సన్నిహితులకు కట్టబెట్టడానికే ఇలా చేశారని మరోవైపు.. మల్లు భట్టి విక్రమార్క ఆరోపించారు. సింగరేణికి ప్రస్తుతం ఉన్న బొగ్గు గనులు మరో పదేళ్లలో అయిపోతాయని ఆ తర్వాత పరిస్థితేమిటని ప్రశ్నించారు. వేలంలో అయినా బొగ్గు గనులు దక్కించుకోవాలని, తర్వాత కేంద్రంపై పోరాడి .. దొరికిన గనులు కేటాయింపు చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం వాదిస్తోంది.

బొగ్గు బ్లాకులు ప్రైవేటు సంస్థల పాలవుతున్నాయి. బొగ్గు నిక్షేపాలు కళ్లముందే కనిపిస్తున్నా.. ప్రభుత్వ అనుమతి లేనందున వేలం పాటకు వెళ్లలేక, వాటిని దక్కించుకోలేని దీన స్థితి. దీంతో 135 ఏళ్ల చరిత్ర కలిగిన, సింగరేణి సంస్థ ఇప్పుడు ఎటూ పాలుపోనిస్థితిలో ఉంది. వాస్తవానికి సింగరేణికి 2015కు ముందు గోదావరి-ప్రాణహిత లోయలో 600 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న బొగ్గు నిల్వలపై గుత్తాధిపత్యం ఉండేది. అయితే ఆ తరువాత నుంచి గనుల కోసం కేంద్రాన్ని విజ్ఞప్తి చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే తొమ్మిది సార్లు వేలం నిర్వహించగా 10వ విడత వేలం హైదరాబాద్‌లోనే జరిగింది.ఇదిలా ఉంటే.. ఓవైపు బొగ్గు నిల్వలు వేగంగా కరిగిపోతున్నాయి. మరోవైపు ఇందులో.. బొగ్గు నిల్వలు ఉన్నట్లు సింగరేణి స్వయంగా అన్వేషించిన బ్లాకులు, అందులోనూ ఆ సంస్థ ఇప్పటికే మైనింగ్ చేస్తున్న బ్లాకుల ముందు, వెనుక ఉన్న బ్లాకులను కూడా ఇతర ప్రైవేటు సంస్థలు ఎగరేసుకుపోయాయి. సింగరేణి మాత్రం ప్రభుత్వ అనుమతి లేక వేలంలో పాల్గొనలేని పరిస్థితిలో ఉంది. అయితే ఎంఎండీఆర్ యాక్ట్-2016లోని సెక్షన్ 17(2)ఏ ప్రకారం దక్కిన ప్రత్యేక అధికారాలతో బొగ్గు బ్లాకులను రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థకు కేటాయించే విచక్షణ కేంద్రానికి ఉంది. ఈ చట్టం ప్రకారం బొగ్గు బ్లాకులను సింగరేణికి రిజర్వ్ చేయవచ్చు. ప్రస్తుతం కేంద్రాన్ని తెలంగాణ ఇదే కోరుతోంది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కతోపాటు విపక్షాలు కూడా కేంద్రానికి ఉన్న విచక్షణతో సింగరేణికి బ్లాకులు కేటాయించాలని తాజాగా నివేదించారు.

విశాఖ ఉక్కు కర్మాగారానికి క్యాప్టివ్ మైన్స్ లేనందు వల్ల నష్టాల్లోకి వెళ్లిపోయింది. సింగరేణిని కూడా అలాగే చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడు ప్రభుత్వం సింగరేణికి బొగ్గు గనులు కేటాయింప చేసుకోవాల్సిన అవసరం ఉంది. లేకపోతే పదేళ్లలో సింగరేణి కనుమరుగు అవుతుంది. కొయ్యగూడెం, సత్తుపల్లిలోని 6 కోల్ బ్లాకులను ను సింగరేణికి కేటాయిస్తే అనువుగా ఉంటుందని ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. ఈ విషయమై ప్రధాని మోదీని ఒప్పించాలని కిషన్ రెడ్డిని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కోరారు. అవసరమైతే ప్రధానితో మాట్లాడేందుకు తాను, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రావడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.

సింగరేణి సంస్థ ప్రస్తుతం 39 బొగ్గు గనుల్లో మైనింగ్ చేస్తోంది. వీటిలో రానున్న ఐదేళ్లలో 8 భూగర్భగనులు, మూడు ఓపెన్‌కాస్టులు మూతపడనున్నాయి. ఆ తర్వాత మరో ఐదేళ్లలో అంటే 2032



భట్టి విక్రమార్క

నాటికి మరో 5 భూగర్భ గనులు, 6 ఓపెన్ కాస్టులు కలిపి... 11 గనులు బంద్ కానున్నాయి. 2037-38 నాటికి ఇంకో 5 గనులు మూతపడనుండగా... 12 గనులకు సింగరేణి కుదించుకుపోనుంది. 2014 నాటికి సింగరేణిలో కార్మికుల సంఖ్య 60 వేలకు పైగా ఉండగా... ప్రస్తుతం 40 వేలకు తగ్గింది. రానున్న 15 ఏళ్లలో గనుల సంఖ్య 12కు తగ్గి.. కార్మికుల సంఖ్య 8వేల మందికి తగ్గిపోయే పరిస్థితి. గడచిన పదేళ్లలో సింగరేణి.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రూ. 49,666 కోట్లను పన్నుల రూపంలో చెల్లించింది. రాష్ట్ర ప్రభుత్వానికి 9 రకాల ట్యాక్సులు, రాయల్టీల రూపంలో రూ. 23,446 కోట్లను చెల్లించగా, కేంద్ర ప్రభుత్వానికి 21 రకాల పన్నుల ద్వారా రూ. 26,207 కోట్లు చెల్లించింది. అంతేకాదు.. రాష్ట్రంలోని ఆరు జిల్లాల్లో వివిధ గ్రామాల్లో రోడ్లు, మౌలిక సదుపాయాల కల్పన, సీవరేజీ, తాగునీటి సౌకర్యం, పాఠశాల భవనాల నిర్మాణం వంటి వాటికి జిల్లా మినరల్ ఫండ్ ట్రస్ట్ కింద రూ. 3 వేల కోట్లను, సామాజిక బాధ్యత కార్యక్రమాల అమలు కింద భారీగా నిధులు వెచ్చించింది. ఇలాంటి సంస్థ కోసం కేంద్ర ప్రభుత్వం ఉదారంగా గనులు కేటాయించాల్సిన బాధ్యత ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

గనుల వేలం పాటతోనే సింగరేణికి మేలు జరుగుతుందని అధికార వర్గాలు అంటున్నాయి. నామినేషన్ పద్ధతిలో పొందిన బ్లాకుల్లో బొగ్గు ఉత్పత్తి చేస్తే 14శాతం దాకా రాయల్టీని రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. అయితే అదే వేలం పాటలో అయితే 2022 నుంచి ఉన్న నిబంధన ప్రకారం కనిష్ఠంగా 4శాతం నుంచి పాట మొదలవుతుంది. ఈ మేరకు కోయగూడం బ్లాకును 5శాతం రాయల్టీ, సత్తుపల్లి బ్లాకును 7.5శాతం రాయల్టీ చెల్లించడానికి అంగీకరిస్తూ ప్రైవేట్ సంస్థలు దక్కించుకున్నాయి. ఏ లెక్కన చూసుకున్నా వేలం పాటలో సింగరేణి పాల్గొంటే ఏ గని అయినా 10 శాతం లోపే దక్కేదని అధికారులు గుర్తు చేస్తున్నారు.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన శాసనసభ జూలై 21న కొలువుదీరింది. సమావేశాల తొలిరోజు జూన్ 22న ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్యచౌదరి సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. తొలిరోజు 172 మంది, మరునాడు ముగ్గురు సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా అసెంబ్లీ ఆవరణలోనూ, పరిసర ప్రాంతాల్లోనూ కోలాహలం నెలకొంది. శాసనసభ్యుల అనుచరులు పెద్ద సంఖ్యలో అసెంబ్లీ వద్దకు చేరుకున్నారు. మీడియా గ్యాలరీతో సహా ఇతర గ్యాలరీలూ కిక్కిరిసిపోయాయి. ముఖ్యమంత్రి, శాసనసభా పక్షనేత చంద్రబాబునాయుడు తొలుత ప్రమాణ స్వీకారం చేశారు. ఆ తరువాత ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఆ తరువాత రాష్ట్ర మంత్రులు ప్రమాణం చేశారు. ఇంగ్లీషు అక్షర క్రమంలో మంత్రులు ఒకరి తరువాత మరొకరు ప్రమాణం చేశారు. ఆ తరువాత వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఎమ్మెల్యేగా ప్రమాణం చేశారు. అంతకుముందు చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్ ప్రమాణ

# అమరావతిలో కొలువు

జగన్‌మోహన్‌రెడ్డిని మందడంలో రైతులు అడ్డుకుంటారనే సమాచారంతో సీడ్ యాక్సెస్‌రోడ్డు నుండి వెలగపూడి మీదుగా అసెంబ్లీ వెనుక రోడ్డు నుండి తీసుకొచ్చారు. పోలీసు అధికారుల సూచన, పార్టీ నాయకుల కోరిక మేరకు ఆయన్ను అటువైపుగా వచ్చేందుకు అనుమతించామని శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ లాబీలో తెలిపారు. తొలిరోజు కావడంతో జగన్ వాహనాన్ని అసెంబ్లీ ప్రాంగణంలోకి అనుమతించారు.


**ఎవరెవరు ఎలా**


ప్రమాణం చేసిన వారిలో వరుస క్రమంలో హోం మంత్రి వంగలపూడి అనిత మూడో వ్యక్తిగా ఉన్నారు. సభ్యుల్లో శాసనసభా వ్యవహారాలశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, మంత్రి కందుల దుర్గేష్, లోకేష్ ప్రమాణం చేశారు. క్యాబినెట్ మంత్రి బీజేపీ ఎమ్మెల్యే వై.సత్యకుమార్ ప్రమాణస్వీకారం చేశారు. తర్వాత ఎమ్మెల్యేల వరుసలో బీజేపీకి చెందిన ఎమ్మెల్యేలు ఈశ్వరరావు (ఎచ్చెర్ల), విష్ణుకుమారరాజు (విశాఖ) నల్లమిల్లి రామకృష్ణారెడ్డి (అనపర్తి) కామినేని శ్రీనివాస రావు (కైకలూరు), వైఎస్ చౌదరి (విజయవాడ పశ్చిమ), పార్థసారథి(ఆదోని) ఆదినారాయణరెడ్డి (జమ్మల మడుగు) ప్రమాణస్వీకారం చేశారు.


ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సభలోకి వచ్చే సమయంలోనూ, వెళ్లే సమయంలోనూ ఎమ్మెల్యేలు, వారితో వచ్చిన అనుచరులు ఫోటోల కోసం ఎగబడ్డారు. వారిని మార్షల్స్ కూడా నివారించలేక పోయారు. చివర్లోనూ పవన్ అసెంబ్లీ నుండి బయటకు వచ్చే సమయంలో చీఫ్ మార్షల్ గణేష్ అక్కడకు వచ్చి సర్దాల్సి వచ్చింది. ఐటీ శాఖ మంత్రి లోకేష్ బయటకు వెళ్లే సమయంలో ఎక్కువమంది సభ్యులు ఆయనను కలిసేందుకు ఎగబడ్డారు. లాబీలో అందరికీ సర్దిచెప్పుకుంటూ ఆయన ముందుకు వెళ్లాల్సి వచ్చింది. కొంతమంది ఎమ్మెల్యేలు వారి వినతులనూ లోకేష్‌కు అందించారు. అసెంబ్లీలో పార్టీలకు తాత్కాలికంగా కార్యాలయాలు కేటాయించారు. గతంలో టీడీపీ శాసనసభాపక్ష కార్యాలయానికి ఎదురుగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామికి కేటాయించిన ఛాంబర్‌ను ప్రస్తుతం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి, టీడీపీ కార్యాలయాన్ని జనసేనకు కేటాయించారు. అన్ని పార్టీలకూ త్వరలె కార్యాలయాలు కేటాయించనున్నారు.

**సీఎంగానే అసెంబ్లీకి వస్తానని గట్టిగా చెప్పా : చంద్రబాబు**

ముఖ్యమంత్రిగానే శాసనసభకు వస్తానని చేసిన శపథాన్ని చంద్రబాబు నాయుడు నిలబెట్టుకున్నారు. నవంబర్ 24, 2021న అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా కీలకమైన అంశాలపై చర్చ జరిగే సందర్భంలో నాటి అధికార వైసీపీ సభ్యులు ప్రతి పక్షనేత నారా చంద్రబాబునాయుడుపై వ్యక్తిగత విమర్శలకు దిగారు. దీంతో టీడీపీకి సంఖ్యాపరంగా ఎమ్మెల్యేల సంఖ్య తక్కువగా ఉన్నప్పటికీ చంద్రబాబు అధికార పక్షంపై తనదైన శైలిలో ఎదురుదాడికి దిగారు. వైసీపీ సభ్యులంతా ఆ సమయంలో చంద్రబాబుపై మరిన్ని విమర్శలు చేశారు. కొందరు మంత్రులైతే ఏకంగా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరిపై వ్యాఖ్యలు చేయడంతో అప్పట్లో సభలో పెద్ద ఎత్తున దుమారం రేగింది. సభలో ఉన్న చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ అధికారపార్టీ సభ్యులపై నిప్పులు చెరగుతూ, 'గౌరవంలేని కౌరవసభలో నేనుండలేను.. తిరిగి ముఖ్యమంత్రి గా సభలో అడుగుపెడతా..' అంటూ శపథం చేసి భావోద్వేగంతో అ వెళ్లిపోయారు. 2019లో ఓటమి పాలైన టీడీపీని 2024 ఎన్నికల్లో నారా చంద్రబాబు నాయుడు తిరిగి అధికారంలోకి తీసుకువచ్చారు. అందుకు కూటమి ఏర్పడటం ఒక కారణమైతే చంద్రబాబునాయుడు కృషి, పట్టుదల, వ్యూహాత్మకమైన రాజకీయ ఎత్తుగడలు, యువనేత నారా లోకేష్, చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరిల పోరాటాలు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే వివిధ కేసుల వ్యవహారంలో వైసీపీ ప్రభుత్వం చంద్రబాబును అరెస్ట్‌చేసి 53 రోజులు జైలుకు పంపింది. ఆ సమయంలో కూడా భువనేశ్వరి ఒంటరి పోరాటం సాగించారు. చంద్రబాబు కూడా విస్తృతంగా, రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి వైసీపీ ప్రభుత్వ తీరును ఎండగట్టడంతో పాటు ప్రజలకు స్పష్టంగా వివరించారు. ఆయన పట్టుదలే తిరిగి టీడీపీని అధికారంలోకి తీసుకువచ్చాయి. ముఖ్యమంత్రి హోదాలోనే తిరిగి సభలో అడుగుపెడతానని చేసిన శపథాన్ని గుర్తు చేసుకుంటూ సుమారు 30 నెలల తర్వాత సగర్వంగా అసెంబ్లీలో అడుగుపెట్టారు. శాసనసభ్యుల ప్రమాణ స్వీకారోత్సవంలో భాగంగా పచ్చదనంతో నిండిపోయిన అసెంబ్లీలో చంద్రబాబు







టీఎస్. భూషణ్

స్వీకారం చేస్తున్న సమయంలో సభలో ఉత్కంఠ వాతావరణం నెలకొంది. రెండున్నరేళ్ల తరువాత సభలోకి అడుగుపెడుతున్న చంద్రబాబు తొలుత అసెంబ్లి మెట్లకు ప్రణమిల్లారు. అనంతరం తన కార్యాలయానికి వెళ్లి అక్కడ వేదపండితుల ఆశీర్వచనం తీసుకొని శాసనసభలోకి ప్రవేశించారు. ఆయన హాల్లోకి రాగానే సభ్యులు 'నిజం గెలిచింది- ప్రజాస్వామ్యం నిలిచింది' అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఆయనకు స్వాగతం చెబుతూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఆ సమయంలో చంద్రబాబు కొంత ఉద్విగంగా కనిపించారు. నేరుగా పవన్ కల్యాణ్ సీటు వద్దకు వెళ్లి ఆయనను అలింగనం చేసుకున్నారు. 'నారా చంద్రబాబు నాయుడు అను నేను' అంటూ ఆయన ప్రమాణ స్వీకారం చేస్తుండగా, సభ్యులు బల్లలు చరుస్తూ హర్షధ్వానాలు చేశారు. ప్రమాణ స్వీకారానికి పవన్ కల్యాణ్ లేవగానే టీడీపీ, జనసేన, బిజెపి సభ్యులందరూ తమ సీట్ల వద్ద లేచి హర్షధ్వానాలు చేశారు. 'కొణిదెల పవన్ కల్యాణ్' అంటూ ఆయన ప్రమాణ స్వీకారం చేశారు.



# దీరిన కొత్త సభ

ముఖ్యమంత్రి హోదాలో అడుగుపెడుతుంటే తెలుగుదేశం, జనసేన, బీజేపీ సభ్యులు మర్యాద పూర్వకంగా లేచి నిలబడటంతో పాటు ఆయనకు చప్పట్లతో స్వాగతం పలికారు. ఆ సన్నివేశాన్ని రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యక్ష ప్రసారం ద్వారా తిలకించిన ప్రజలు సైతం 'దటీజ్ చంద్రబాబు నాయుడు' అంటూ గత సన్నివేశాన్ని మరోసారి గుర్తు చేసుకున్నారు.

**జగన్ భావోద్వేగం**

శాసనసభ్యుల ప్రమాణ స్వీకారానికి హాజరైన వైసీపీ అధినేత జగన్ నిరాశ, నిస్పృహతో కనిపించారు. ప్రమాణస్వీకారం చేసినప్పుడు ఆయన తడబడ్డారు. ఒకప్పుడు రాజులా శాసించిన ఈ అసెంబ్లీ భవనంలో ఇప్పుడు అధికారం కోల్పోయి కేవలం ఒక ఎమ్మెల్యేగా మిగలడం, తను నీచంగా చూసిన, హేళన చేసిన చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్ ఇప్పుడు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి స్థానాల్లో ఉండటంతో ఆయన సిగ్గు, అవమానంతో ఇబ్బంది పడుతున్నట్లు కనిపించారు. ముఖంలో ఒత్తిడి, ఆందోళన కనిపించాయి. గతంలో ఆయన శాసనసభ ప్రధాన ద్వారం నుంచి ముఖ్యమంత్రి ఛాంబరుకు చేరుకునే వారు. 21 వ తేదీన జరిగిన సమావేశాల సందర్భంగా ఆయనను సాధారణ ఎమ్మెల్యేల తరహాలోనే సభలోకి పంపుతారని భావించారు. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు శాసనసభ వ్యవహారాలు, ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, నిబంధనలను సడలించి జగన్ వాహనాన్ని మొదటి గేటు నుంచే అనుమతించాలని అధికారులకు సూచించడంతో పాటు వరుస క్రమంలో కాకుండా మంత్రులు ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే జగన్‌కు అవకాశమిచ్చారు. శాసనసభలో వైఎస్సార్ సీఎల్పీ కార్యాలయాన్ని కూడా మార్పు చేశారు. గతంలో టీడీపీకి కేటాయించిన గదినే వైసీపీకి కేటాయించటంతో సభా ప్రాంగణంలో రివర్స్ సీన్ సాక్షాత్కరించింది.

**అటు వారిటు... ఇటు వారటు**

శాసనసభలో అధికార, ప్రతిపక్ష సభ్యుల కుర్చీలు తారుమారయ్యాయి. అటు వారు ఇటు.. ఇటు వారికి అటు సీట్లు కేటాయించారు. ఎన్నికల ముందు ఇదే ఏడాది ఫిబ్రవరి 5వ తేదీ నుంచి ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ ప్రసంగించారు. మరుసటి రోజున గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాల తీర్మానం.. ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌పై చర్చ అనంతరం ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన రెడ్డి ప్రసంగంతో సమావేశాలు ముగిసాయి. ఆ రోజుకు సభలో వైసీపీ పూర్తి స్థాయి మెజారిటీ 151 మంది సభ్యులతో బడ్జెట్‌ను ఆమోదించింది. ఏప్రిల్లో ఎన్నికలకు షెడ్యూల్ విడుదల కావటం మే 13న పోలింగ్ అనంతరం జూన్ 4వ తేదీన ఫలితాలు వెలువడిన నేపథ్యంలో తెలుగుదేశం- జనసేన- బీజేపీ కూటమి తిరుగులేని మెజారిటీతో 164 మందితో అధికార పగ్గాలు చేపట్టింది.. అప్పటి వరకు అధికారపక్షంగా ఉన్న వైసీపీ ఈ ఎన్నికల్లో 11 సీట్లకే పరిమితం కావడమే కాకుండా ప్రతిపక్ష హోదా కూడా సాధించలేదు. దీంతో గతంలో టీడీపీ నుంచి వైసీపీకి మద్దతిచ్చిన వారికి కేటాయించిన సీట్లనే ప్రస్తుతం వైసీపీకి కేటాయించారు. అప్పట్లో టీడీపీకి 23, జనసేన ఒక స్థానం గెలుచుకోగా టీడీపీ నుంచి ఇరువురు, జనసేన తరపున గెలిచిన ఒక ఎమ్మెల్యే వైసీపీకి మద్దతు పలికారు. అయితే టీడీపీకి 21 మంది సభ్యులు ఉండటంతో ప్రధాన ప్రతిపక్ష హోదా దక్కింది. ప్రస్తుత సభలో వైసీపీకి మాట్లాడే అవకాశం కూడా తక్కువే. ప్రధాన ప్రతిపక్షంగా 21 సీట్లతో జనసేన ముందుంటే తరువాత వైసీపీ, ఆపై 8 సీట్లతో బీజేపీ వరుస స్థానాల్లో ఉన్నాయి.

**స్పీకర్‌గా అయ్యన్న పాత్రుడు ఏకగ్రీవం**


అసెంబ్లీ స్పీకర్‌గా సీనియర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయనను సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు అచ్చెన్నాయుడు, సత్యకుమార్ యాదవ్ స్పీకర్ స్థానంలో కూర్చోబెట్టారు. ఈ సందర్భంగా అయ్యన్న పాత్రుడుకి సభ్యులంతా అభినందనలు తెలిపారు. సభ సంప్రదాయాల ప్రకారం ప్రతిపక్షం కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని సభాపతిని గౌరవ సూచకంగా ఆయన స్థానం వరకు తీసుకు వెళ్లాలి. కానీ, వైసీపీ నాయకులు ఒక్కరు కూడా సభకు హాజరుకాలేదు. ముఖ్యంగా ఆ పార్టీ అధినేత, ఎమ్మెల్యే జగన్ సైతం ఈ సంప్రదాయాన్ని విస్మరించారు.

ఉమ్మడి విశాఖపట్నం జిల్లా, నర్సీపట్నం నియోజకవర్గానికి చెందిన అయ్యన్న పాత్రుడు టీడీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీలో ఉన్నారు. పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీ రామారావు పిలుపుతో 25 ఏళ్ల వయసుల్లో రాజకీయాల్లోకి వచ్చి, 1983లో నర్సీపట్నం నుండి తొలిసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. మొత్తం ఏడుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా విజయం సాధించారు. 16 ఏళ్లు మంత్రిగా పనిచేసిన అనుభవం ఉంది. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడిగా పదేళ్లపాటు సేవలందించారు.

**సంప్రదాయాలకు పెద్దపీట : స్పీకర్**

సభలో సంప్రదాయాలకు పెద్దపీట వేద్దామని సభ గౌరవాన్ని, హుందాతనాన్ని పెంచుదామని స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. తనను ఏకగ్రీవంగా ఎంపిక చేసిన కూటమి పార్టీల నేతలకు, ఎమ్మెల్యేలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ దఫా కొత్తగా 88 మంది సభ్యులు సభలో అడుగుపెట్టారని, మొదట సారి గెలిచిన వారికి సభలో మాట్లాడే అవకాశం ఇస్తామన్నారు.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్




# 29 • విభీషణుని శరణాగతి

**'శరణని వచ్చిన శత్రువునైన
పరికింపగా రాచపాడి రక్షింప
నీ విభీషణు దేల యేచినయట్టి
రావణుండైన గర్వము దక్కివచ్చి
శరణన్న గాతు నే చందమునైన
మరియాద లిట్టివి మాకులంబునకు'**

ఆ సమయంలో విభీషణుడు వచ్చాడు. తన అన్న రావణుడు వెళ్లగొట్టాడు. అందుకని తన నలుగురు మంత్రులతో కలిసి వచ్చి, "రామా, శరణు శరణు" అన్నాడు. శ్రీరాముడు అందరినీ సమావేశపరిచాడు. 'ఏం చేద్దాం' అన్నాడు. "గుప్తచారులను పెట్టి పరీక్షిద్దాం" అన్నాడు శరభుడు అనే వానరుడు. "నాకు అనుమానం వేస్తున్నది" అని జాంబవంతుడన్నాడు. 'ఇతడు తన అన్ననే మోసం చేసి వచ్చాడు. మనతో ఉంటాడని నమ్మకం ఏమిటి' అన్నాడు సుగ్రీవుడు. సుగ్రీవుని మాటలకు చిరునవ్వు నవ్వి ఊరుకున్నాడు రాముడు. రాముడి మనస్సులో

> విభిషణుడిని అసలు ఎందుకు బహిష్కరించాడు రావణుడు. "అగ్రజా, సీతను అప్పగించు రాముడుకి" విభిషణుడు అన్నకు సలహా ఇచ్చాడు. అది తప్పు అయింది.

భరతుడు మెదిలాడు. చేతికి వచ్చిన రాజ్యం వద్దన్నాడు భరతుడు. అన్న వెంట బడ్డాడు. ఇక సుగ్రీవుడేం చేశాడు? అన్నను చంపాడు. గద్దె ఎక్కాడు. అందులో అధర్మం ఏమీ లేదు. కాని అట్టి సుగ్రీవుడు విభీషణుణ్ణి విమర్శిస్తున్నాడు. ఇదీ రాముడి నవ్వు. "విభీషణుడు సాధు పురుషుడు, స్వార్థ రహితుడు, ధర్మజ్ఞుడు, స్వీకరిద్దాం" అన్నాడు హనుమంతుడు. అంతా విని రాముడు తన నిర్ణయం చెప్పాడు. "విభీషణుడే కాదు, రావణుడే స్వయంగా వచ్చి శరణు వేడినా నేను క్షమిస్తాను, అభయమిస్తాను" అన్నాడు. శక్తిమంతుడు రాముడు అనగలడు, చేయగలడు. "సాధు, సాధు" అన్నారందరూ. విభీషణుడు వచ్చి రామ పాదాలపై వాలాడు. విభీషణుని అప్పటికప్పుడే రాజ్యాభిషిక్తుణ్ణి చేశాడు రాముడు. "ఇక నుండి లంకకు నీవే రాజువు" అన్నాడు. విభీషణుడు చేసిన పని మంచిదేనా? అన్నను వదలిపెట్టటం, శత్రుపక్షంలో చేరటం భ్రాతృ ద్రోహం కాదా? అని అడగవచ్చు. కాని విభీషణుడు వదిలి పెట్టాడా? రావణుడు వెళ్లగొట్టాడా? మెడపట్టి నెడితే చూరుపట్టుకొని వేలాడుతుండాలా? విభీషణుడిని అసలు ఎందుకు బహిష్కరించాడు రావణుడు. "అగ్రజా, సీతను అప్పగించు రాముడికి" అని విభీషణుడు అన్నకు సలహా ఇచ్చాడు. అది తప్పు అయింది. అలాంటి సలహా ఇవ్వకుండా ఉంటే అక్కడే ఉండవచ్చు గదా అంటారు. కాని ధర్మం అని తెలిసిన దానిని చెప్పటానికి కూడా వీలులేని చోటు అయితే ఎలా? ధర్మం చెప్పటానికి సందేహించే తత్త్వం కాదు విభీషణుడిది. అలా సందేహించే వాడు ఒక మనిషా? భ్రాతృ ద్రోహం రావణుడిది, విభీషణుడిది కాదు.

ఇంకో విమర్శ ఉంది. రావణుడు మంచివాడు కాదని అనుకుందాం. వదలిపెట్టి వెళ్లవచ్చు. ఆ వెళ్లినవాడు శత్రుపక్షంలో చేరటమెందుకు? ఎక్కడికో పోయి ఉండవచ్చుగా! రాముడికి సాయం ఎందుకు? ఇంద్రజిత్తు వేసిన ప్రశ్న ఇది. "నేను అటు చేరను, ఇటు చేరను, తటస్థంగా ఉంటాను" అని చెప్పే తృతీయ ప్రకృతి కాదు విభీషణుడిది. ఇటువంటి తటస్థ విధానం అసమర్థులకు కావాలి. ఇందులో పౌరుషం లేదు పరాక్రమం లేదు. పురుషార్థంలేదు, ధర్మదృష్టి లేదు. ఎటో ఒక అటు చేరాలి ఇది తప్పనిసరి. ఒకానొక విచిత్ర పరిస్థితిలో బలరాముడు తటస్థంగా ఉండవలసింది. కాని కృష్ణుడిది ఆదర్శమార్గం. విభీషణుడు అదే పని చేశాడు. సజ్జనుల పక్షంలో చేరాడు.

**–వైశంపాయన**

**'జాగృతి' 02-01-1982 సంచిక నుంచి**




మన రుషులు

# 'అద్వితీయాగ్ని' అంగిరస మహర్షి



**సృ**ష్టి కార్యంలో తనకు సహకరించేందుకు బ్రహ్మదేవుడు జన్మనిచ్చిన మానస పుత్రులలో అంగిరసుడు మూడవ వారని విష్ణుపురాణం చెబుతోంది. పుట్టుకతోనే దివ్యతేజస్సుగల ఆయనకు బ్రహ్మ ఆదేశానుసారం చేసిన మహాతపస్సు వల్ల ఆ తేజస్సు దేదీప్యమానమైంది. ఏకకాలంలో ముల్లోకాల్లో నింపగల తేజస్సు ప్రసాదించిన బ్రహ్మ, లోకక్షేమం కోసం తపమాచరించాలని అంగిరసుని ఆదేశించాడు. అలా తపస్సు ద్వారా మహర్షిత్వం సంపాదించుకుని విజ్ఞాననిధిగా, అనేకానేక వేదమంత్రాలకు ద్రష్టగా, బహుముఖాలైన ధర్మాలకు శాసనికునిగా నిలిచాడు. కర్దమ ప్రజాపతి తొమ్మండుగురు కుమార్తెలలో ఒకరైన శ్రద్ధను అంగిరసుడు వివాహమాడగా, వారికి ఏడుగురు కుమారులు, ఏడుగురు కుమార్తెలు కలిగారు. ఆయన బోధించిన ధర్మ రహస్యాలు 'అంగిస్మృతి' అనే పేరుతో ఉన్నాయి. మనిషి శాస్త్ర ప్రకారమే కర్మలు చేయాలని, పశుపక్షి సంతతిని చంపకూడదని, మాంసాహారం మానాలని మహాదోషాలకు పాల్పడిన బ్రాహ్మణులు 'వజ్రవ్రతం' అనే కఠినమైన దానిని అనుసరించాలని సూచించాడు. ఆయన వినయశీలతకు ఒక ఉదాహరణ... యజ్ఞయాగాదులలో తనకు తగినంత గౌరవం దక్కడం లేదని అలిగిన

# కలిమి లేముల నడుమ కృష్ణ-కుచేల సంబంధం

29




సాయంత్రం అయింది. కుచేలుడు ద్వారకకు చేరుకున్నాడు. 'ద్వారక బహుసుందరమయిన నగరం. మధుర కంటే కూడా బాగుంది' అనుకు న్నాడు. కుచేలుడి వస్త్రాలు మురికిగా, చినిగిపోయి ఉన్నాయి. ఒకసారి చూసుకొన్నాడు. ధోవతి, ఉత్తరీయం, ఒకటే జత. మూడు రోజులుగా ప్రయాణిస్తూ ఉతుక్కొనే అవకాశం కూడా కలగలేదు. అయినా తన వస్త్రాలను చూస్తాడా కృష్ణుడు? తానొక పేదవిప్రుడు కావచ్చు. కృష్ణుడు యాదవ శ్రేష్ఠుడు కావచ్చు. అయితేనేం! తామిరువురు మిత్రులు కారా? దుస్తులు ఎలా ఉన్నా కుచేలుడు కుచేలుడే. స్నేహమనేది వస్త్రధారణలో ఉండదు కదా! తన వేషాన్ని చూసి మాత్రమే కృష్ణుడు గౌరవిస్తాడనుకుంటే తాను కృష్ణుడికి స్నేహితుడు కానేకాలేడు. స్నేహితం అనేది ఒక భావన.

భౌతికమైన పరిస్థితి కాని, బాహ్య ప్రదర్శనలు గాని అడ్డువస్తే అది స్నేహితమా? కృష్ణుడు ఒక నవ్య సమాజాన్ని, ఒక మానవ ధర్మాన్ని, స్థాపిస్తున్నాడని అంటున్నారు.

మైత్రీ లక్షణం కృష్ణుడికి తెలియదా? తన పిచ్చిగాని ఇవీ కుచేలుడి ఆలోచనలు. ఈ ఆలోచనలతో ద్వారకా నగరంలో రాజ ప్రాసాదాన్ని సమీపించాడు కుచేలుడు. ఇలాంటి చోటికి రావటం కొత్త ఆయనకు. ఈ సైనికులు, ఈ ద్వారక పాలకులు తనను ఈ వేషంతో లోనికి రానిస్తారా అసలు? అయినా ఇలా సందేహిస్తుంటే, ఇలా కుంచించుకు పోతుంటే, ఇలా గాభరపడి పోతుంటే నిజంగానే వాళ్లు రానీయరు. ధైర్యంతో, శ్రీకృష్ణుని స్నేహితుని హోదాలో వెళ్లాలి. అది తన పరిచయం...

ఒక సైనిక అధికారి చేతులు ముందుకు జాపి "రండి, రండి" అని కుచేలుడిని ఆహ్వానించాడు. "తమ పేరు ఏమన్నారు? కుచేలుడు అనే కదా?" ఔనన్నట్లు కుచేలుడు తల ఊపాడు. "తమరు కూర్చోండి వారికి కబురు వెళ్లింది. వారి సందేశాన్ని కొద్ది క్షణాలలో మీకు అందజేయగలం" అన్నాడు ఆ అధికారి. కుచేలుడు ఆ గదిలో కూర్చొన్నాడు. ఆ గది ఎలా ఉంది? తాను అడుగుపెడితే, తాను ముట్టుకొంటే వాటికి మురికి అంటుకుంటుందేమో అన్నట్లుగా ఉంది ఎటు చూసినా. అక్కడి ఆసనాలు, తెరలు కిటికీలు, మణులు మాణిక్యాలతో పొదిగి ఉన్నాయి. ఒకసారి చుట్టూ చూశాడు కుచేలుడు. కళ్లు తిరిగిపోయాయి ఆ వైభవాన్ని చూసి. తల వంచుకొని ఒదిగి ఒక మూల కూర్చున్నాడు.

ఇంతలో ఎవరో గబగబ నడుస్తూ వస్తున్నట్లుగా చప్పుడయింది. మరుక్షణంలో తెర తొలగించుకొని రాజవేషంలో ఒక వ్యక్తి కుచేలుడి ముందు! కుచేలుడు తల ఎత్తాడు. కృష్ణుడు!! ఆయన దృష్టి క్షణకాలం కుచేలుడిపై పడింది. ధూళి ధూసరితమైన కృశించి పోయిన ఆ వ్యక్తిలో తన బాల్యసఖుని వెతుకు తున్నట్లుగా ఉన్నది ఆ చూపు.

"కుచేలా!" అని అన్నాడు కృష్ణుడు. ఆతురతతో ముందుకువచ్చాడు. కుచేలుడు తాను ఏమిచేయాలో ఆలోచించుకొనటానికి గాని, ఏ మాట మాట్లాడ టానికిగాని, అవకాశం ఇవ్వకుండానే కృష్ణుడు వచ్చి కుచేలుడిని తన బాహుబంధంలో బిగించి వేశాడు.

కృష్ణుడి దివ్యసుందరమైన శరీరం నుండి ఎంతో విద్యుత్ తరంగాలు తన శరీరంలోకి ప్రవహిస్తు న్నట్లుగా, తన మనస్సుకు శాంతి లభిస్తున్నట్లుగా తన శరీరానికి బడలిక తగ్గినట్లుగా కుచేలుడికి తోచింది.

"కుశలమా కుచేలా" అని కృష్ణుడు కౌగిలి విడిచి ప్రశ్నించాడు "ఇదిగో నీ ఎదురుగానే ఉన్నాను కదా" కుచేలుడు చిరునవ్వు నవ్వటానికి ప్రయత్నించాడు.

"బాగా అలసిపోయి ఉన్నావు. చాలా దూరం ప్రయాణించి వచ్చావు. రా,రా" కృష్ణుడు ఒక చేయి కుచేలుని భుజంపై వేసి, రెండవ చేత్తో తెర తొలగించి "ఎవరక్కడ ఈ వస్తువులు నా గదిలో పెట్టు" అని పరిచారకుడితో చెప్పాడు. "అతిథి గృహంలోనా?" పరిచారకుడు అడిగాడు. అతనికి స్పష్టంగా వినిపించ లేదేమో? కృష్ణుడు చిరునవ్వుతో "నాగదిలోనే" అన్నాడు. కృష్ణుడు మందగతితో ముందుకు నడుస్తూ కుచేలుడిని లోనికి తీసుకొని వెళ్లాడు. అత్యున్నతమైన సింహాసనం మీద కుచేలుడిని చేయిపట్టుకొని కూర్చోబెట్టాడు.

"నేను..." కుచేలుడు సంకోచంతో అన్నాడు. "కూర్చోవయ్యా" కృష్ణుడు మాట్లాడటానికి అవకాశం ఇవ్వలేదు. కూర్చోపెట్టాడు.

–వైశంపాయన

'జాగృతి' 18-09-1982 సంచిక నుంచి

---

అగ్నిదేవుడు బ్రాహ్మణ గృహాల్లోని యాగశాలల నుంచి మాయమైపోవడంతో అగ్నులు చల్లారి యజ్ఞాలు నిలిచి పోయాయి. దాంతో ఇంద్రాది దేవతలు బ్రహ్మకు విన్నవించుకోగా, అగ్నికి ప్రత్యామ్నాయంగా అంగిరసుడికి బాధ్యతలు అప్పగించాడు. అంగిరసుడు తన విధులు నిర్వర్తిస్తూ జగదారాధకుడయ్యాడు. లోకం అగ్నిదేవునే మరచిపోయేస్థితి ఏర్పడింది. కొంతకాలానికి అగ్ని పశ్చాత్తాపంతో ఇంద్రుడి వద్దకు వెళ్లగా, అక్కడే స్వదేహంతో ఉన్న అంగిరసుడు, ఆయనకు నమస్కరిస్తూ, 'మీరు లేని లోటు స్పష్టంగా కనిపిస్తోంది. ఈ కార్యాన్ని మీరే నిర్వహించండి' అని కోరాడు. ఆ వినయానికి ముగ్ధుడైన అగ్ని, 'నన్ను మించిన మహత్తు కలవాడివి. నీ వంటి మహాత్ముడి వల్ల యజ్ఞయాగాదులకు నేను లేని కొరత తీరిపోయింది. దేవతలు, మానవులకు నీ దర్శన భాగ్యం ఉండబట్టే నేను అలిగి వెళ్లానేమో' అని బదులు పలికాడు. 'మీరు నన్ను స్తుతిస్తున్నారు తప్ప మీకంటే ఉన్నతుడిని కాను. లోకారంభం నుంచే మీరే అగ్నిహోత్రం. యజ్ఞయాగాది క్రతువులకు మూలాధారులు. మీ ముందు పుట్టిన వాడిని మీతో సమానుడిని ఎలా అవుతాను? కనుక ప్రథమ పూజ్యులు మీరే. త్రేతాగ్నిలో మొదటి అగ్నిగా మీరుంటే,మీ అభీష్టం మేరకు ద్వితీయాగ్నిగా నేనుంటాను' అని చెప్పాడు. అలా ద్వితీయాగ్నిగా ఆవాహన చేసేనప్పుడు వచ్చే అగ్నిగా అంగిరసుడు నిలిచాడు.

–రామచంద్ర రామానుజ

---

## వివేకానంద సూక్తిశతి

The education which does not help individuals to equip themselves for the struggle of life, which does not bring out strength of character, a spirit of philanthropy and the courage of a lion is it worth the name?

సద్గుణాలు పెంచు సంఘ సేవను పెంచు
ధైర్యమిచ్చు విద్య ధాత్రి వలయు
వెలిగి జీవితమున గెలిపించునదె విద్య
వినుడి స్వామి సద్వివేక వాణి!!





బండిరాజుల శంకర్




పెద్ద భవనం, చుట్టూ తోట, పలచని లాన్. ఆ గార్డెన్ నిండా రంగురంగుల గులాబీలు, చేమంతులు విరగబూసి, తలలూపుతూ లోపలికి అనుమతినిస్తున్నాయి. అంచులకు వేసిన కొబ్బరి, అశోక, మామిడి వృక్షాలు సైనికుల్లా ఆ ఇంటిని పహరా కాస్తున్నాయి.

గూర్ఖా గేట్ తీయగానే, కారు నెమ్మదిగా లోపలికొచ్చింది.

గీరా దిగగానే పనమ్మాయి వచ్చి లోపలికి తీసుకువెళ్లింది. పెద్ద హాల్. అందమైన ఫర్నిచర్‌తో ఐశ్వర్యం కొట్టొచ్చినట్టుగా కనిపిస్తూ రాజభవనాన్ని తలపింపజేస్తుంది.



గీరా కూర్చోగానే సత్యవతి వచ్చి పలకరించింది.

హుందాగా, ఇస్త్రీ చీరలో డాక్టర్ వ్యాస్ పోలికలతో ఉన్న ఆమెను చూడగానే, ఆవిడే సత్యవతి. వ్యాస్ తల్లి అని ఊహించగలిగింది గీరా. కొద్దిపాటి నగలతో, వయసు నలభై సంవత్సరాలు దాటినట్లున్నా ఆమెను చూస్తే, ఆమెకంత వయసున్న కొడుకున్నాడంటే, నమ్మలేనట్లుంది. ఆవిడే తనను తాను పరిచయం చేసుకుంటూ, "నా పేరు సత్యవతి. వ్యాస్ మా పెద్దబ్బాయి" చెప్పింది. గీరా కూడా మర్యాదగా నమస్కారం చేసింది. పనమ్మాయి కాఫీ, ఫలహారం తెచ్చింది. సత్యవతి తనొకటి తీసుకుని, గీరాకొకటిచ్చింది. తరువాత యాపిల్ జ్యూస్,

**'జాగృతి' నిర్వహించిన స్వర్గీయ కొండపాక కిషన్‌రావు స్మారక నవలల పోటీలో ప్రథమ బహుమతి పొందిన రచన**



మంచినీళ్లు తెచ్చి ఇచ్చింది ఆ అమ్మాయి.

ఆ మర్యాద, పద్ధతి, ఆ ఇంటి హోదా స్వర్గంలా అనిపించాయి గీరాకు. ఆవిడ డైరక్టుగా విషయానికొస్తూ "గీరా! పేపర్ స్టేట్‌మెంట్, టీవీ స్క్రోలింగ్ చూశావుగా? అన్ని రకాల సదుపాయాలు, కుటుంబంలోని కోడలిగా ఉంటాయి.

"అయితే, భర్తగా వ్యాస్  నీకు తక్కువగా అందుబాటులో ఉంటాడు. దానికి నీవంగీకరించాలి. నీ విషయాలన్నీ వ్యాస్‌కు మెయిల్ చేశాను. వాడికి నచ్చాయి. మా కుటుంబంలో అందరూ అంగీకరించారు. నీకూ అంగీకారమైతే ఒక్కసారి మీవాళ్ల విషయం కూడా చెప్పు. వాళ్ల గురించీ తెలుసుకుంటాం!" చెప్పింది సత్యవతి.

గీరాకు ఒక్క క్షణం మౌనంగా ఉండిపోక తప్పింది కాదు.

తను డాక్టర్ వరదతో కమిటయిన విషయం చెప్పాలి. అప్పుడే తను ఈ కొత్త అంకానికి అంగీకారం చెప్పాలి. కానీ అందం, ఆరోగ్యం, హోదా, చదువు గౌరవనీయమైన పదవిలో ఉన్న యువకుడు తనను వరించి వస్తానంటే ఆమోదించకపోవటం మూర్ఖత్వమే అవుతుంది.

ఆనందమో, ఉద్వేగమోగానీ గీరా మనసు మాటలు మర్చిపోయింది. నిజానికి ఈ ఇంటి గౌరవంతో పోల్చి చూస్తే, వారికి తను కనుచూపు మేరలో కూడ నిలబడలేదు.

మరి... అలాంటి అవకాశం తనను అందుకోవటానికి వస్తుంటే ఏం చేస్తుంది!

వెంటనే గీరా తల ఊపి వారి వివరాలు ఇచ్చింది.

తరువాత మెల్లని స్వరంతో "మీకు నా విషయాలు కొన్ని చెప్పాలి. ప్రభుత్వ సహాయం వల్ల చదువుకున్న నేను, డబ్బు కోసం కొన్ని పనులు ఎంచుకున్నాను. అవి పూర్తయ్యాకే నా వివాహం. నిజానికి మీ హోదాకు, మా కుటుంబానికి చాలా అంతరముంది.

"మేమున్న పరిస్థితుల్లో మీతో సరితూగటమటుంచి, కనీసం కంటితో కూడా చూడలేము. కానీ మీ ప్రకటనకు ముందే నేనొక పని గురించి కమిటయ్యాను. నాకు మీరు కొంత సమయమివ్వాల్సి వస్తుంది. దానికి నేను మాట ఇచ్చి, ఒప్పందం కుదుర్చుకున్నాను కాబట్టి, తప్పదు.

"మీరు నన్ను కోడలిగా ఆహ్వానిస్తున్నందుకు చాలా సంతోషం. అయినా నేను మీకు ఆంక్షలు పెట్టటం తప్పే, కానీ తప్పదు. ఈ లోపల నేను మావాళ్లందర్నీ ఒప్పించగలను. లేకున్నా, నేను మేజర్ని. నా పెళ్లి, నా ఇష్టానికే జరుగుతుంది"



## సంబరాజు లీల (లట్టుపల్లి)

చెప్పింది గీరా.

"ఒప్పుకుంటాము గీరా! ఇన్ని రోజులు ఆగిన మేము, కొద్దికాలం ఆగలేమని కాదు. మేమూ కొన్ని ఆంక్షలు, ఒప్పందాలతోనేగా నీకు కోడలి హోదా ఇవ్వాలనుకున్నది. నీ పనుల కోసం నీకెంత సమయం కావాలి?" ప్రశ్నించింది సత్యవతి.

"సుమారుగా పది, పదకొండు నెలలు" చెప్పింది.

"సమయం ఎక్కువే! ఆ పనులేమిటో చెబితే సమయాన్ని కుదించుకోవచ్చేమో ఆలోచించవచ్చు. ఐ మీన్, మా కుటుంబంలోకి రాబోయే కోడలు చేసే పనుల గురించి మాకు తెలియాలిగా!" శాంతంగా చెప్పింది సత్యవతి.

ఒక్క క్షణం గీరా ఆలోచించింది.

అసలు విషయం చెప్పాలా, వద్దా అనుకుంది మొదట. చెప్పాల్సిందే! ఇదేమి చిన్న విషయం కాదు. మాతృత్వం స్త్రీ జీవితంలోనే కాదు, మనశ్శరీరాల మీదా ఎన్నో మార్పులు సూచిస్తుంది.

ముఖ్యంగా ఇప్పుడింత సుకుమారంగా ఉన్న రూపలావణ్యంలో, అనూహ్యంగా, పొట్ట మీద చారలు, పసివాడి పోషణ కోసం, ప్రకృతి సృష్టించే క్షీర సముద్రాలయిన ఎద లోతులు! ఆ తరువాత తెలిసినా, లేదా తెలవకపోయినా, వాళ్లు గుర్తిస్తే జీవితం మీదే చెప్పుకోలేని ముద్ర పడుతుంది. వాళ్లు నన్ను అంగీకరించనీ, లేకపోనీ! ముందే చెబితే, నా మనస్సాక్షి నాకు తోడుగా ఉంటుంది అనుకుంది.

"నేను, సరోగేట్ మదర్‌గా ఒప్పుకున్నాను. అందుకోసం మాట ఇచ్చాను. ఇందులో మీ కుటుంబానికి కలిగే పరువు నష్టమేమి ఉండదు. నన్ను మీ కోడలిగా అంగీకరిస్తే అందుకు కూడా మీ అనుమతి అవసరమౌతుంది."

"అంగీకరించామని ముందే చెప్పాము. మామూలుగా అయితే ఎలా ఆలోచించేవాళ్లమోగానీ, ప్రస్తుతం మేము అలాంటి తల్లి మీదనే ఆధారపడి మా

వంశాకురాన్ని తెచ్చుకుంటున్నాము.

"అలాంటి తల్లులే లేకుంటే, మా కుటుంబానికెంత అసంతృప్తిగా ఉండేది! మాకే కాదు, ఎంతమంది దంపతుల అసంతృప్తిని పోగొడుతుందో ఈ పద్ధతి.

"ఇన్ని సంవత్సరాలు ఆగాము. ఇక, కొద్దినెలలాగలేమా? నీవు చేస్తున్నది గొప్ప త్యాగమే గీరా! మాతృత్వమనేది స్త్రీకి గొప్పవరం. అది రాకపోవటం, ఆ స్త్రీకి శాపమే సుమా! దాన్ని నీవందిస్తావంటే ఆ తల్లి చేసుకున్న పూజాఫలమది. అందుకు ఒప్పుకుంటాం, అంతదాకా ఆగుతాం కూడా. నేను వ్యాసుకీ విషయం తెలియజేస్తాను. నీవొకసారి ఫేస్‌బుక్ ఓపెన్ చేసి, వ్యాస్‌తో కూడా మాట్లాడు. ఒకవేళ వాడికి సమయం లేకుంటే మెయిల్ మాత్రమిస్తాడు. దానికి బాధపడకేం!

"ఈ విషయంలో నా కొడుకులకు ముఖ్యంగా వ్యాసుకు అభ్యంతరం ఉండకపోవచ్చు. వాడికి తెలియజేసి నీకు మెయిల్ చేస్తాను. ఈనాటి నుండే, నీవు మా కోడలిగా ఇకముందు తీసుకునే నిర్ణయాల్ని తెలియపర్చాల్సి ఉంటుంది.

"అయితే ఇది ఆంక్ష కాదు, అభ్యర్థన మాత్రమే!

"కుటుంబంలో ఎలాంటి దాపరికాలు లేకపోవటం, ఆ కుటుంబంలోని స్థిరత్వానికి, ప్రశాంతతకు చిహ్నం" చెప్పింది సత్యవతి.

"తప్పకుండా! మీరింత సహృదయంతో ఒప్పుకున్నందుకు నాకు సంతోషంగా ఉంది. అన్ని నిర్ణయాలు మీకు తెలియపరచటం నా బాధ్యత అనే అనుకుంటాను" సంతోషంగా చెప్పింది గీరా.

"గీరా! నీవు ఎవరి బిడ్డను మోస్తున్నావో, ఏ తల్లి స్థానంలో నిలిచి, సరోగేట్ తల్లిగా మాతృదానం చేస్తున్నావో నీకేమయినా తెలుసా?" కుతూహలంగా ప్రశ్నించింది సత్యవతి.
"లేదు! అంత రహస్యంగాను బిడ్డను గర్భంలో వేసుకుని, అంతకన్నా గోప్యంగా కని, ఆ శిశువును కంటితో కూడా చూడకుండా వెనక్కి తిరిగి వచ్చేయటమే! పోయేటప్పుడు కడుపులో బిడ్డతో, తిరిగి వచ్చేప్పుడు ఒడిలో డబ్బుకట్టలు" నవ్వింది గీరా.



"గీరా! నీవు ఎవరి బిడ్డను మోస్తున్నావో, ఏ తల్లి స్థానంలో నిలిచి, సరోగేట్ తల్లిగా మాతృదానం చేస్తున్నావో నీకేమయినా తెలుసా?" కుతూహలంగా ప్రశ్నించింది సత్యవతి.

"లేదు! అంత రహస్యంగాను బిడ్డను గర్భంలో వేసుకుని, అంతకన్నా గోప్యంగా కని, ఆ శిశువును కంటితో కూడా చూడకుండా వెనక్కి తిరిగి వచ్చేయటమే! పోయేటప్పుడు కడుపులో బిడ్డతో, తిరిగి వచ్చేప్పుడు ఒడిలో డబ్బుకట్టలు" నవ్వింది గీరా.

"గీరా! ముందుముందయినా నీ వివాహ జీవితం ఇలాగే భర్త చెంత ఉన్నా, అతన్ని చేరటానికి సమయం తీసుకునేంత దూరంలో ఉంటావు" హెచ్చరించింది సత్యవతి.

"ఆ విషయం, ముందే తెలియజేసారుగా! ఒక రకంగా ఇది కాంట్రాక్టు వివాహం. అయితే, ఒక్క విషయం! మీ అబ్బాయికింత హఠాత్తుగా పెళ్లి చేసుకోవాలన్న కోరిక ఎందుకు కలిగిందో...? తెలుసుకోవచ్చా?" ప్రశ్నించింది గీరా.

"ఇది, నా కొడుకు కోరిక కాదు. నా కోరిక. నా కుటుంబ వారసత్వానికి ఉత్తరాధికారిగా ఈ ఆస్తి, అంతస్తులకు కాపాడే వారసుడు కావాలని కోరాను. దీనిని నా కోరిగా తీసుకుని ఈ అమ్మ కోసం, అమలు పరుస్తున్నాడు" చెప్పింది సత్యవతి.

ఆమెలో సన్నని విచారవీచిక క్షణం కనిపించి మాయమయింది. అది గీరా దృష్టిని దాటిపోలేదు.

"మీకిద్దరు అబ్బాయిలు కదా..." ఆగిపోయింది గీరా.

ఆవిడ నిట్టూర్చింది. గీరా అంతరంగం అర్థమయినట్టు విషయం వివరించింది. "వ్యాస్ పెద్దవాడు. శాస్త్రవేత్త. వాడి విషయం నీకు తెలుసు. రాష్ట్రాయ్ రెండోవాడు. వాడికి పసి వయసులోనే తీవ్రస్థాయిలో మశూచి వచ్చింది. బ్రతకడనే అన్నారు. కేవలం ఆయుష్షుండి బ్రతికాడంతే!

"ఆ కారణంగా వాడికి పిల్లలు కలగరని ముందే చెప్పారు. ఆ విషయం తెలిసే నా కోడలు గాంధారి ఒప్పుకుంది. అందుకే ప్రస్తుతం అద్దె అమ్మ ద్వారానే వారసుడిని పొందబోతున్నాం. పోనీలే. ఒకేసారి కొత్తకోడలు, నా వారసులు ఇంటికొస్తారు" నవ్వింది సత్యవతి.

గీరా వెళ్తానంటే, పట్టుచీర, పూలు, గాజులు ఇచ్చి కుంకుమ దిద్దింది. గీరా లేస్తుంటే హుందాగా, లాల్చిపైజామల్లో, చేతికర్రతో అరవై, అరవైఐదు సంవత్సరాల వయసున్న వ్యక్తి ఈవినింగ్ వాక్ కోసం కాబోలు క్రిందికి వచ్చాడు.

అతన్ని పరిచయం చేస్తూ "గీరా! మీ మామగారు శంతన్ ఐ.ఏ.ఎస్. విశ్రాంత ఉద్యోగి. మన వ్యాసుకు అగ్రిమెంట్ ఇచ్చిన అమ్మాయి గీరా! ఇక నుంచి మన కోడలు" పరిచయం చేసింది.

గీరా మనసు మరోసారి ఎగిరిపడింది. మంచి చదువు, సంస్కారం, ఐశ్వర్యం, అందం, సహృదయత కలిగిన కుటుంబంలోకి, ఒక లోతైన మహా సముద్రంలోకి, ఓ చిన్న నీటి బిందువులా చేరబోతున్నది.

గీరా లేచి వినయంగా నమస్కారం చేసింది.

ఆ తరువాత డ్రైవర్‌ను ఇచ్చి గీరాను హాస్టల్‌కు పంపింది సత్యవతి.

(సశేషం)






# నీట్.. ప్రశ్న..జవాబు..

**ఈ ఏడాది దేశవ్యాప్తంగా మెడికల్ కళాశాలలు, దంత వైద్యకళాశాలల్లో ప్రవేశానికి నిర్వహించిన నీట్ పరీక్ష అనేక వివాదాలకు దారి తీసింది. చివరకు ప్రశ్నపత్రం లీక్ సంగతి బయటపడి సీబీఐ విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. ప్రశ్నపత్రం బహిర్గతం కావటం దగ్గర నుంచి, ఎక్కువ మంది విద్యార్థులకు మొదటి ర్యాంకు రావటం వరకు అనేక అంశాలు ఇందులో వివాదాస్పదమయ్యాయి. పరీక్ష నిర్వహించిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ)ని బాధ్యతల నుంచి తప్పించాలని విపక్షాలు, విద్యార్థులు డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం సీబీఐ విచారణకు ఆదేశించటంతో పాటు ఎన్టీఏను సమూలంగా ప్రక్షాళన చేసేందుకు నడుం బిగించింది. మరోవైపు నీట్ పరీక్ష రద్దుకు సుప్రీంకోర్టు సుముఖత వ్యక్తం చేయలేదు. దాంతో జులై 6 నుంచి కౌన్సెలింగ్ యథావిధిగా కొనసాగుతుంది. అలాగే సుప్రీంకోర్టులో విచారణ జూలై 8వ తేదీ నుంచి ప్రారంభమవుతుంది.**

ఈ ఏడాది మే 5వ తేదీన నిర్వహించిన నీట్–యూజీ పరీక్షపైన ఆరోపణల నేపథ్యంలో, వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. " పరీక్ష నిర్వహణలో పారదర్శకత కోసం, సమీక్ష అనంతరం ఈ వ్యవహారాన్ని సీబీఐకి అప్పగించాలని నిర్ణయించాం" అని కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. తర్వాత ఎన్టీఏ అధిపతిని పదవి నుంచి తప్పించింది. అసలు ఎన్టీఏకు లోపాల్లేకుండా పరీక్షలు నిర్వహించే సామర్థ్యం ఉందా లేదా తేల్చుకునేవరకూ పరీక్షల నిర్వహణకు విరామం ప్రకటించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా నీట్–పీజీ పరీక్షను వాయిదా వేశారు. ప్రభుత్వ తీసుకున్న నిర్ణయాన్ని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రశంసించింది.

భవిష్యత్తులో డాక్టర్లు కావాలనే అందమైన కలను నిజం చేసుకోవటానికి లక్షలాది మంది విద్యార్థులు నీట్ పరీక్షకు హాజరవుతూంటారు. ఏటేటా వారి సంఖ్య పెరుగుతూ వస్తోంది. ఈ ఏడాది మే5వ తేదీన నిర్వహించిన పరీక్షకు దాదాపు 25 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. ముందుగా ప్రకటించిన తేదీ కంటే 10 రోజుల ముందు అంటే ఈ నెల 4వ తేదీన ఫలితాలు ప్రకటించారు. యావద్దేశం ఎన్నికల ఫలితాలపైన ఆసక్తిని ప్రదర్శిస్తున్న వేళ చడీచప్పుడూ లేకుండా ఈ ఫలితాలు విడుదలకావటంపైన కూడా ఆరోపణలొచ్చాయి. వాటితోపాటు ఇతర ఆరోపణలు ఇలా ఉన్నాయి.

**టాపర్ల మార్కులపై సందేహాలు**

ఈ ఏడాది టాపర్లకు వచ్చిన మార్కులపైన సందేహాలు ముసురుకున్నాయి. 2020లో కేవలం ఇద్దరు విద్యార్థులకే పూర్తి మార్కులు 720 వచ్చాయి. మరుసటి సంవత్సరం వారి సంఖ్య మూడుకి చేరింది. 2022లో ఒక్క విద్యార్థికి కూడా పూర్తి మార్కులు రాలేదు. అప్పుడు టాపర్ సాధించిన మార్కులు 715. గత ఏడాది ఇద్దరు విద్యార్థులు పూర్తి స్కోరు సాధించారు. ఈ ఏడాది 67 మంది విద్యార్థులు పూర్తి మార్కులు సాధించారు. ఇంత ఎక్కువ మంది ర్యాంకుసాధించటం ఒకటయితే.. హరియాణాలోని బహదూర్ ఘడ్‌లో హర్ దయాళ్ పబ్లిక్ స్కూలు పరీక్ష కేంద్రం నుంచి హాజరయిన ఆర్గురు (ఐదుగురు అబ్బాయిలు, ఒక అమ్మాయి) విద్యార్థు లకు అత్యధిక మార్కులు వచ్చాయి. ఈ 67 మంది విద్యార్థుల్లో 44 మందికి గ్రేస్ మార్కులు కలపటం వల్ల ఆ

ఘనతను సాధించారు.

**ప్రశ్నాపత్రాల లీకేజీ**


బిహార్‌కి చెందిన ఒక ముఠా ఒక్కో విద్యార్థి నుంచి రూ.30 లక్షల నుంచి రూ. 35 లక్షల వరకూ తీసుకుని పరీక్షకు ఒక రోజు ముందుగానే నీట్ ప్రశ్నాపత్రాలను లీకేజీ చేసిందన్న వార్తలొచ్చాయి. దీనిపై బిహార్ ఆర్థిక నియంత్రణ విభాగం 14 మందిని అరెస్టు చేసి వివరాలను రాబట్టింది. అది వాస్తవమేనన్న విషయం ఇప్పుడు రుజువయ్యింది. ఈ ముఠా టెలిగ్రామ్ ఛానల్ ద్వారా దేశంలోని వివిధ ప్రాంతాలకు ప్రశ్నాపత్రాలను లీక్ చేసిందన్న వార్తలపైన కూడా దర్యాప్తు సాగుతోంది. గుజరాత్‌లోని గోద్రాలో ఒక కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు పరీక్ష కేంద్రం నిర్వాహకునితో చేతులు కలిపి అక్రమాలకు పాల్పడ్డాడు. వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు ఇక్కడ పరీక్ష కేంద్రాన్ని ఎంచుకున్నారు. మాస్ కాపీయింగ్‌కు ఇక్కడ పక్కా ఏర్పాట్లు చేశారని, దీని వెనక రూ.12 కోట్ల లావాదేవీలు సాగాయని ఆరోపణ లొచ్చాయి. 'మీకు తెలిసిన ప్రశ్నలు మాత్రమే రాయండి. మిగిలిన వాటి కోసం తగిన ఏర్పాట్లు ఉన్నాయి' అని అక్కడ పరీక్ష రాసే విద్యార్థులకు చెప్పినట్టుగా సమాచారం.

**ఓఎంఆర్ షీట్లు**

పరీక్ష ఫలితాలను ప్రకటించకముందు నిర్వాహకులు ఓఎంఆర్ షీట్లను విడుదల చేశారు. దీని ప్రకారం విద్యార్థులు తాము పరీక్షలో రాసిన సమాధానాలను పోల్చుకుని తమకు ఎన్ని మార్కులు వస్తాయనేది అంచనా వేసుకున్నారు. కానీ తుది ఫలితాలు విడుదలయిన తర్వాత చాలా మంది విద్యార్థులకు పొంతన లేకుండా చాలా తక్కువ మార్కులు వచ్చాయి. కొందరికి దాదాపు 80 మార్కులు వరకూ తేడా వచ్చిన విషయాన్ని జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ వెలుగులోకి తెచ్చింది. ఒకరిద్దరి విషయంలో కాకుండా చాలా మంది విషయంలో పరిస్థితి ఇలాగే ఉండటాన్ని బట్టి చూస్తుంటే అవతవకలు తేటతెల్లమవుతాయని, నీట్ పరీక్షను రద్దు చేయాలని అసోసియేషన్ కోరుతోంది.

**తప్పుల తడకగా ఎన్టీఏ తీరు**

దేశంలోని అన్ని మెడికల్, డెంటల్, ఆయుష్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష నీట్. గతంలో



**డాక్టర్ పార్థసారథి చిరువోలు**
సీనియర్ జర్నలిస్ట్



ఆల్ ఇండియా ప్రీ మెడికల్ టెస్ట్ (ఏఐపీఎంటీ) ఉండేది. దానితో పాటు ఆయా రాష్ట్రాల మెడికల్ కాలేజీలు కూడా పరీక్షలు నిర్వహించేవి. 2013లో నీట్ ను ప్రవేశపెట్టారు. మొదట్లో కర్ణాటక, గుజరాత్, పశ్చిమబెంగాల్, తమిళనాడు వంటి రాష్ట్రాలు దానిని వ్యతిరేకించాయి. దాంతో చాలా సంవత్సరాలు పట్టింది. 2016లో మొదటిసారిగా నీట్ పరీక్ష నిర్వహించారు. మూడేళ్ల పాటు ఈ బాధ్యతలను సీబీఎస్ఈ నిర్వహించింది. 2019 తర్వాత పరీక్షల నిర్వహణ బాధ్యతను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ)కి అప్పగించారు. వాస్తవానికి ఈ స్వతంత్ర సంస్థను నవంబరు 2017, కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. పరీక్షలను పారదర్శకంగా నిర్వహిస్తూ తన స్వతంత్రతను కాపాడుకుంటుందని అందరూ భావించారు. కానీ నీట్ విషయంలో ఆ సంస్థ తమ అభిప్రాయం తల్లకిందులు చేసిందని అంతా విమర్శిస్తున్నారు.

పరీక్ష నిర్వహణకు ముందు నుంచి వివాదాలు మొదలయ్యాయి. ఈ పరీక్ష కోసం ఫిబ్రవరి9, 2024న ఎన్టీఏ రిజిస్ట్రేషన్ ను ప్రారంభించింది. సాధారణంగా ఈ గడువు నెలరోజులు ఉంటుంది. ఆ గడువు ముగిసే మార్చి 9న మరో వారం గడువు పెంచింది. కానీ అనూహ్యంగా ఏప్రిల్ 9 నుంచి ఏప్రిల్ 10 వరకూ రిజిస్ట్రేషన్ లింక్ మళ్లీ తెరుచుకుంది. 'భాగస్వామ్య పక్షాల' విన్నపం మేరకు అని ప్రకటించారు. ఆ తర్వాత సవరణల విండోని అనుమతించారు. ఏప్రిల్ 11 నుంచి ఏప్రిల్ 15 వరకూ ఇది అందుబాటులో ఉంది.

ఇక ఫలితాలు ప్రకటించిన జూన్4 నుంచి అసలు వినోదం ప్రారంభమైంది. నీట్ పరీక్షలో 'బహుళ ఎంపిక ప్రశ్నలు (ఎంసీక్యూ) విధానాన్ని అనుసరిస్తుంది. భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రం, వృక్షశాస్త్రం, జంతుశాస్త్రం అన్న నాలుగు సబ్జక్టుల్లో విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షిస్తారు. ప్రతి సబ్జక్టులో 50 ప్రశ్నలుంటాయి. అందులో 45 ప్రశ్నలను ప్రయత్నించాలి. అంటే మొత్తం 200 ప్రశ్నల్లో 180 ప్రశ్నలకు సమాధానాలు రాయవలసి ఉంటుంది. ప్రతి సరైన సమాధానానికి నాలుగు మార్కులు వస్తే, తప్పు రాస్తే ఒక మార్కు కోత పడుతుంది. మొత్తం 3గంటల 20 నిమిషాల సమయం ఇస్తారు. విద్యార్థులు సాధించగలిగిన అత్యధిక మార్కులు 720. పరీక్షల ఫలితాల్లో 67 మంది విద్యార్థులు ఈ మార్కులను సంపాదించారు. అంటే అందరికీ ఫస్ట్ ర్యాంక్. అంతకు ముందెప్పుడూ ఇది సాధ్యం కానిది ఇప్పుడే ఎలా? అని అందరినీ ఆశ్చర్యానికి లోను చేసిన ప్రశ్న. దీనికి ఎన్టీఏ అధికారులు విచిత్రమైన సమాధానం ఇచ్చారు. ఈ ఏడాది ప్రశ్నపత్రం చాలా సులువుగా ఉందని, అందుకే ఎక్కువ మందికి పూర్తి మార్కులొచ్చాయని చెప్పుకొచ్చారు. ఈ పరీక్ష ఫలితాల ప్రకటనకు ముందు ప్రశ్నపత్రం కఠినంగా ఉందని నిపుణులు, విద్యార్థులు చెప్పటమే కాదు. ఈసారి నగటు స్కోరు బాగా తగ్గుతుందని పేర్కొన్నారు.

ఈ సంవత్సరం ఎక్కువ మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని, అధిక విద్యార్థులు ఉంటంతో స్కోరు కూడా అధికమైందని ఎన్టీఏ అంటోంది. గత ఏడాదితో పోలిస్తే 3 లక్షల మంది అధికంగా పరీక్షకొచ్చారని పేర్కొంది. ఎన్టీఏ చెప్పిన మూడో అంశం ఇంకా ఆసక్తికరం. ఇందులో ఎక్కువ మందికి ఆల్ ఇండియా ర్యాంకు 1 రావటానికి కారణాన్ని వెల్లడించింది. "ఈ 67మందిలో 50 మందికి గ్రేస్ మార్కులిచ్చాం. అందులో 44 మంది సమాధాన పత్రాల్లో వ్యత్యాసం ఉండటం వల్ల వారికి గ్రేస్ మార్కులివ్వవలసి వచ్చింది. మిగిలిన ఆరుగురికి సమయానికి సంబంధించిన అంశంలో గ్రేస్ మార్కులిచ్చాం. పోతే ఫిజిక్స్‌కి సంబంధించిన ప్రశ్నల్లో ఒక దానికి రెండు సరైన సమాధానాలు ఉన్నాయి. ఎన్సీఈఆర్టీ పాత, కొత్త పుస్తకాల్లో ఈ ప్రశ్నకి రెండూ భిన్నమైన సమాధానాలు ఉంటాయి. అందుకే రెండు ఐచ్ఛికాలను సరైనవిగా పరిగణనలోకి తీసుకోవాలని నిపుణులు సూచించారు" అని చెప్పుకొచ్చింది. ఎలాంటి ప్రశ్నలు ఇచ్చామనేది పరిశీలించుకోకుండా జాతీయ స్థాయి పరీక్షలను నిర్వహించటం ఏమిటని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. గ్రేస్ మార్కులు పొంది 75శాతం మంది టాపర్లు పూర్తి మార్కులు సాధించటం హాస్యాస్పదం కాదా అని నిలదీస్తున్నారు.

ఎన్టీఏ ప్రస్తావించిన ఈ మూడు కారణాలు అసంబద్ధంగా, లొసుగులతో కూడినవిగా ఉన్నాయి. తర్వాత ప్రశ్న సమయం సరిపోవటం వల్ల గ్రేస్ మార్కులు పొందిన 6గురు విద్యార్థులు మాటేమిటి? ఈ ఆర్గురు ఒకే పరీక్ష కేంద్రంలోని వారా? అందుకు అవకాశం ఉంది. సమయం కోల్పోవటం వల్ల అదనంగా గ్రేస్ మార్కులు పొందిన 1563 మందిలో ఈ ఆర్గురు టాపర్లు. మిగిలిన వారిలో కొందరు 720కి 718, 719 మార్కులు తెచ్చుకున్నారు.

సాంకేతికంగా ఇది అసాధ్యం. ఎందుకంటే మీరు సరైన సమాధానం రాస్తే నాలుగు మార్కులు పొందుతారు. తప్పు చేస్తే ఒక మార్కు కోల్పోతారు. దాంతో సాధారణ పరిస్థితుల్లో ఒక విద్యార్థి 720 సాధిస్తారు లేకపోతే 716 గానీ 715 గానీ తెచ్చుకుంటారు. అంతే తప్ప 718, 719 సాధ్యమయ్యే పని కాదు. ఈ మార్కులు సాధించిన ఇద్దరు విద్యార్థులు కూడా ఆర్గురు టాపర్లు ఉన్న పరీక్ష కేంద్రానికి చెందిన వాళ్లే. గ్రేస్ మార్కులు ఇవ్వటానికి కారణం గురించి ప్రశ్నించినప్పుడు, నీట్ విద్యార్థులు కొందరు పంజాబ్, హరియాణా హైకోర్టుల్లో పిటీషన్లు వేశారని.. పరీక్ష సమయం తగ్గిపోవటంతో తాము ఇబ్బందులను ఎదుర్కొన్నామని విద్యార్థులు ఫిర్యాదుచేశారని ఎన్టీఏ చెప్పుకొచ్చింది. తాము కోల్పోయిన సమయానికి ఎంత గ్రేస్ మార్కులివ్వాలో ఆలోచించి నిర్ణయం తీసుకున్నట్టు చెప్పింది. 2018లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఆధారంగా గ్రేసు మార్కులు ఇచ్చామని తెలిపింది. "ప్రామాణిక పద్ధతిని సాధారణీకరించాలి. అందరికీ సమాన అవకాశం దక్కాలి" అని ఆ తీర్పు చెబుతోంది. నిజానికి ఈ తీర్పు లా ప్రవేశాలకి సంబంధించిన 'క్లాట్' పరీక్షకు చెందినది. మెడికల్, ఇంజనీరింగ్ ఇతర విద్యాసంస్థల ప్రవేశానికి ఇది వర్తించదని అందులో స్పష్టంగా పేర్కొన్నారు. అలాంటిది ఎన్టీఏ దానిని నీట్ కు ఎలా వర్తింపచేసిందనేది ఇక్కడ ప్రశ్న. అలాగే ఎన్ని గ్రేస్ మార్కులు కలిపారు? ఏ పద్ధతిని అనుసరించారు అనేది బాహ్యప్రపంచానికి తెలియదు. ఒకవేళ పరీక్ష ఆలస్యమయితే దానికి తగ్గట్టుగా ఇంకో 10-20 నిముషాలు అదనపు సమయం ఇవ్వవచ్చు కదా? గ్రేస్ మార్కులపైన ఆధారపడటం ఎందుకు? అన్న ప్రశ్నలు ఉత్పన్న మవుతున్నాయి. ఇక్కడే అవినీతికి బీజం పడిందనే విమర్శలు వస్తున్నాయి. ప్రశ్నపత్రాల లీకేజీ పైన కూడా ఎన్టీఏ విచిత్రంగా స్పందించింది. బిహార్‌లో ప్రశ్నపత్రాలు లీకయ్యాయన్న విమర్శలకు సమాధానంగా.. పేపరు లీకయి ఉంటే అక్కడ నుంచి ఎక్కువ మంది టాపర్లు ఉండాలి కదా అని అడ్డగోలు ప్రశ్నలు వేస్తోంది. 'బిహార్ నుంచి ఒక్కరే టాపర్ ఉన్నారు. ఆ రాష్ట్రం నుంచి అర్హత సాధించిన వాళ్లు కూడా జాతీయ సగటు కంటే తక్కువ' అని ఎన్టీఏ అధికారి ఒకరు వాదించారు. పాత పరీక్షను రద్దు చేసి కొత్తగా నిర్వహించాలని, నిర్వహణ బాధ్యతలను వేరొకరికి అప్పగించాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా వివిధ ప్రధాన నగరాల్లో విద్యార్థులు ఆందోళన నిర్వహించారు.

## సుప్రీం డైరక్షన్

'నీట్ పరీక్ష నిర్వహణకు సంబంధించిన పవిత్రత దెబ్బతింది. కనుక మాకు సమాధానాలు కావాలి" అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. నీట్‌లో అక్రమాలు, పేపరు లీక్ పై సీబీఐ దర్యాప్తు చేయాలని కోరుతూ మొత్తం ఏడు రిట్ పిటీషన్లు దాఖలయ్యాయి. ఈ పిటీషన్లను వినటానికి సుప్రీంకోర్టు అంగీకరించింది. అదే సమయంలో నీట్ కౌన్సిలింగ్ వాయిదా వేయటానికి నిరాకరించింది. జస్టిస్ విక్రమనాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం ఈ పిటీషన్లపై విచారణ నిర్వహించింది. ఇందులో ప్రధానంగా ఒడిశా, కర్ణాటక, ఝార్ఖండ్ రాష్ట్రాలకు చెందిన 16 మంది విద్యార్థులు పరీక్ష రాయటానికి గుజరాత్‌లోని గోద్రా కేంద్రాన్ని ఎంచుకున్నారని, మంచి మార్కుల కోసం ఒక్కొక్కరు రూ.10 లక్షల వంతున చెల్లించారని పిటీషనర్ ఆరోపించారు. సుప్రీం తదుపరి విచారణ జులై 8వ తేదీన చేపడుతోంది.

## ప్రభుత్వం సీరియస్

నీట్ పరీక్షల్లో అవకతవకల నేపథ్యంలో, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) డైరక్టర్ జనరల్ సుబోధ్ కుమార్ సింగ్ పై ప్రభుత్వం వేటు వేసింది. ఆయన స్థానంలో ఇండియా ట్రేడ్ ప్రమోషన్ ఆర్గనైజేషన్ ఛైర్మన్ అయిన రిటైర్డు ఐఏఎస్ అధికారి ప్రదీప్ సింగ్ కరోలాకు ఎన్టీఏ అదనపు బాధ్యతలు అప్పగించారు. సుబోధ్ కుమార్ సింగ్ దాదాపు 1500 విద్యార్థులకు గ్రేస్ మార్కులిచ్చి ఈ విషయంలో వివాదాలకు తెరతీశారు. నీట్‌తో పాటు యూజీసీ నెట్ ప్రశ్న పత్రాలు లీక్ కావటంతో జూన్ 23న జరగవలసిన నీట్-పీజీ ప్రవేశపరీక్షను వాయిదా వేశారు. దాంతో పాటు ఎన్టీఏ పరీక్షల నిర్వహణ సామర్థ్యాన్ని అంచనా వేయాలని నిర్ణయించారు. ఇస్రో మాజీ ఛైర్మన్ కె.రాధాకృష్ణ నేతృత్వంలో ఉన్నత స్థాయి నిపుణుల కమిటీని నియమించారు. రెండు నెలల్లో ఈ కమిటీ అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తుంది. ఇందులో యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ వీసీ బీజేరావు, ఢిల్లీ ఎయిమ్స్ మాజీ డైరక్టర్ రణదీప్ గులేరియా, ఐఐటీ మద్రాస్‌కు చెందిన ప్రొఫెసర్ రమణమూర్తి, ఢిల్లీ ఐఐటీకి చెందిన ప్రొఫెసర్ ఆదిత్య వి.మిట్టల్ విద్యాశాఖ సంయుక్త కార్యదర్శి గోవింద్ జైశ్వాల్, కె.పంకజ్ బన్సాల్ కూడా ఉన్నారు. పరీక్షల నిర్వహణ సామర్థ్యాన్ని మెరుగుపరచటంలో ఇది తొలిఅడుగు అని కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు. మొత్తం వ్యవస్థను ప్రక్షాళన చేస్తున్నామని, ఇక లొసుగులకు ఎలాంటి ఆస్కారం ఉండదని ఆయన పేర్కొన్నారు.

మరో వైపు ప్రశ్నపత్రాల లీకేజీ కేసులో దర్యాప్తు చురుగ్గా సాగుతోంది. నీట్ ప్రశ్న పత్రం లీకేజీలో కీలకంగా వ్యవహరించిన రవి అత్రిని ఉత్తరప్రదేశ్ స్పెషల్ టాస్క్ ఫోర్సు పోలీసులు అరెస్టు చేశారు. లీకేజీ కుట్రదారు సంజీవ్ ముఖియాకు అత్రి సన్నిహితుడు. నోయిడాకు చెందిన అత్రి తాజా కేసులో మధ్యవర్తిగా వ్యవహరించాడని, గతంలోనూ పేపర్ లీకేజీలో అరెస్టయ్యాడని పోలీసులు చెప్పుకొచ్చారు. ముఖియా కోసం పోలీసులు వెతుకుతున్నారు. బిహార్‌లో తీగలాగితే నీట్ డొంక కదిలింది. అక్కడ ఆర్థికనేరాల నియంత్రణ విభాగం దీనిని సీరియస్‌గా తీసుకుంది. ప్రశ్నపత్రాలను లీక్ చేశారన్న ఆరోపణపై 13 మందిని అరెస్టు చేసి కీలకమైన అంశాలను రాబట్టింది. పక్కా ప్లాన్ ప్రకారం బిహార్ ముఠా నీట్ ప్రశ్నాపత్రాన్ని లీక్ చేసిందని స్పష్టం చేసింది. బిహార్ ప్రభుత్వంలో విద్యుత్ శాఖ జూనియర్ ఇంజనీర్ సికిందర్ కుమార్ ఈ అక్రమాలకు సూత్రధారిగా భావిస్తున్నారు. ఈ బృందంలో ఒకరయిన నితీష్ కుమార్ బిహార్ టీచర్ల నియామక పరీక్షలో అక్రమాలకు పాల్పడి జైలుకు వెళ్లొచ్చాడు. అమిత్ ఆనంద్ కన్సల్టెన్సీ నిర్వహిస్తున్నారు. కోచింగ్ సెంటర్ల ముసుగులో సికిందర్, నితీష్ వ్యవహారం నడిపినట్టుగా తెలుస్తోంది.

'బిహార్ నుంచి ఒక్కరే టాపర్ ఉన్నారు. ఆ రాష్ట్రం నుంచి అర్హత సాధించిన వాళ్లు కూడా జాతీయ సగటు కంటే తక్కువ' అని ఎన్టీఏ అధికారి ఒకరు వాదించారు. పాత పరీక్షను రద్దు చేసి కొత్తగా నిర్వహించాలని, నిర్వహణ బాధ్యతలను వేరొకరికి అప్పగించాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా వివిధ ప్రధాన నగరాల్లో విద్యార్థులు ఆందోళన నిర్వహించారు.




ఇకపోతే గ్రేస్ మార్కులను ఉపసంహరించాలని నిర్ణయించటంతో అదనంగా మార్కులు కలిపిన 1563 మందికి జూన్ 23వ తేదీన పరీక్ష నిర్వహించారు. అందులో కేవలం 813 మంది మాత్రమే పరీక్షకు హాజరయ్యారు. వారికి కొత్తగా వచ్చిన మార్కులను పరిగణనలోకి తీసుకుంటారు. మిగిలిన విద్యార్థులకు గ్రేస్ మార్కులను మినహాయించి వచ్చిన మార్కులను లెక్కలోకి తీసుకుంటారు. ఈ ఫలితాలు జూన్ 30వ తేదీన విడుదలవుతాయి. అనంతరం ఎంబీబీఎస్, బీడీఎస్, ఇతర కోర్సులకు కౌన్సిలింగ్ జులై 6వ తేదీన ప్రారంభమవుతుంది. ★

# ఆరోగ్య దే




**జల, తేజ, వాయు, ఆకాశ, పృథ్వి**

ఈ ఐదూ కీలక మూలకాలు. ప్రథమ స్థాయి, ప్రధాన పాత్ర నిండిన 'పంచభూతాలు' అని మనందరికీ తెలుసు. ఇవే విశ్వసృష్టికి మూలాధారాలు. ప్రాణశక్తి నిస్తుంది నీరు. ఉద్దీపన రగిలిస్తుంది అగ్నితేజం. మహాచలన ఉత్తేజం గాలి. 'ఉన్నది ఏదో అది'గా గోచరిస్తుంది గగనం. భౌతిక పదార్థ మూలస్థానం నేల. సమస్తానికీ మొదలూ తుదీ ఇవే. సర్వవ్యవస్థకీ గురురూపాలు.

మనకు ఆరోగ్యం, ఆనందం ఈ ఐదింటిలోనే. అందుకే 'ఆరోగ్య ఆలయం'లోని ఐదు భవంతులకూ ఇవే పేర్లు!

ఆహారంతోనే ఆరోగ్య భాగ్యం. సహజ ఆరోగ్యం మన సొంతం. చక్కని ఆరోగ్య అలవాట్లు అంటూ ఉంటే, మన రోజువారీ పనులను వీటితో మాత్రమే సమన్వయం చేసుకుంటే ప్రతీ ఒక్కరం భాగ్య వంతులమే అంటుంది మంతెన సత్యనారాయణరాజు మార్గదర్శకత్వంలోని ఈ ప్రకృతి సుందర స్థలం.

సరికొత్తగా మందులు వాడాల్సిన అవసరం లేకుండా చేస్తుందీ కేంద్రం, ప్రకృతి జీవనాన్ని, అదే రీతి వైద్య విధానాన్ని మేళవించే ఆ డాక్టరు గారు, సహజయోగ పద్ధతిని సాధకులకు అలవరచడం ద్వారా ఆయన శ్రీమతి డాక్టర్ విశాల దశాబ్దాల సేవలందిస్తున్నారు. 'ఆరోగ్య అభిలాషులారా!' అని ఆదరంగా పిలుస్తూ, ఆరోగ్య యోగభాగ్య సాధకులుగా తీర్చిదిద్దుతోంది దేహాలయం.



మంతెన

ప్రకృతి ఒక శబ్ద స్వరూపం. అంతకుమించి నిత్య చైతన్య స్వభావ భరితం, ధర్మం, భావం, సత్యం, గుణం, అందం, చందం అన్నీ ఇందులోనివే, శాస్త్రంగా, విద్యగా, వైద్యరీతిగా తరతరాల చరిత కలిగి ఉంది. ధార్మిక సంస్థ నిర్వహణలోని ఇది క్రమానుగతంగా ఆరోగ్య రహస్యాల పరిశోధననూ కొనసాగిస్తూ వస్తోంది. నవ్య జీవన సూత్రాలను విశదీకరిస్తూ, ఆచరణకు తెచ్చి మంచి ఫలితాలను కనబరుస్తూ, మేలిమి ఆశ్రమంగా ప్రభావాన్ని విస్తరిస్తోంది.

తెలుగునాట గుంటూరు ప్రాంతాన, వెంకట పాలెం సమీపాన, అమరావతి కరకట్ట రోడ్డున ఉన్న ఇది 'విజయవాడ ఆరోగ్యాలయం'గా ప్రశస్తం. పదిహేను రోజుల / నెలరోజుల / అంతకుమించిన రోజుల పరంపరలో ప్రత్యక్ష అనుభవం పొందిన వారికి నవీన అనుభూతిని కలిగిస్తుందనడం అక్షర సత్యం. ఆహార, ఆరోగ్య తీరు తెన్నులు ఎవరికి వారికే అనుభవైక వేద్యాలు.

ఏ మనిషైనా మొట్టమొదట కోరుకునేదేమిటి? ఆరోగ్యంగా ఉండాలని, దీనికి ఒక క్రమబద్ధ దినచర్య అవసరమన్నదీ ప్రకృతి ఆశ్రమ నినాద విధానం. నిత్యమూ యోగాసనాలు, వ్యాయామాలు, జీవనశైలి తరగతుల హాజరీ ఎంత అత్యవసరమో ఇక్కడే తేట తెల్లమవుతుంది. ఎవరు ఎక్కడి నుంచి అయినా ఫోన్ చేసి వైద్య సూచనలను ఉచితంగా పొందవచ్చనేది సంస్థ సేవానిరతికి అసలు సిసలైన ఉదాహరణం. రోజూ ఉదయం ఏడు గంటల నుంచి రాత్రి తొమ్మిది వరకూ సమాచారం (98480 21122) తెలుసుకో వచ్చని ప్రకటించడంలో, ఆచరణలో సైతం అంతే ప్రపత్తి ప్రతి ఫలిస్తుంది.

ఈ ఆరోగ్య ఆశ్రమ ప్రాంగణంలోకి చేరుకోగానే:

**చెడు కనకు, అనకు, వినకు**




అనే మూడు బొమ్మ సందేశాలు కనిపిస్తాయి. వాటి పై భాగంలో ఉంటుంది మరింత ముఖ్య హితవచనం 'చెడు తినకు' అని.

మనం తినే ప్రతీ ఆహారపదార్థం 1. తేలికగా అరిగేలా ఉండాలి. 2. త్వరగానూ అరిగిపోవాలి, 3. ఆ ఆహారంలో ఎక్కువగా పోషక పదార్థాలు నిండాలి. 4. ఎక్కడైనా తినడానికి అనువుగా ఉండటం మరీ ముఖ్యం. ఇవన్నీ కలిగి ఉండేవి పండ్లు మాత్రమే కదా.

'తింటే కూరలు ఎక్కువ; వ్యాధులు రావడం తక్కువ' అనేది ఇంకో ప్రధాన సూత్రం. కూరగాయల్లో విటమిన్లు, పీచు పదార్థాలు, ఖనిజ లవణాలు ఎక్కు ఉంటాయని అందరికీ తెలిసినా, నిత్యమూ క్రమ బద్ధంగా అనుసరించే వారు ఎందరు? కూరల్లోని క్యాలరీస్ (శక్తి) తక్కువ కావడంవల్ల, ఆ కూరలను పొట్ట నిండా తిన్నా బరువు పెరగం అని ఎంత మందికి తెలుసు? నోరు మొదలు దిగువ వరకు ఉండే పేగులను కూర పదార్థాలే శుభ్రపరుస్తా యని తెలిసి కూడా అంతగా ఆచరించని వారికి ఇంకెలా చెప్పాలి? ఉప్పు, నూనె, ఘాటు మసాలాలు లేనప్పుడే కూరను ఎక్కువగా తినగలమని తెలిసి కూడా పెద్దగా

# హాలయం

పట్టించుకోని వారిని మనమేం చేయగలం?

ఇవన్నీ తెలియనివారెవరూ లేరు. తెలిసి పద్ధతిగా ఆచరించేవారు ఎక్కువగా కనిపించరు, తెలిసీ తెలియని తత్వమే పలు తరహాల అనారోగ్యాలకు దారి తీస్తుందని... ఆస్పత్రుల్లో కిటకిట చూస్తే అర్థమవుతుంది.

వ్యాధులు నివారణకన్నా నిరోధకం అన్ని విధాలా మిన్న. ముందు జాగ్రత్తలు తీసుకుంటే – 'చేతులు కాలిన తర్వాత...' అనే పరిస్థితి తలెత్తదు. కొన్ని వ్యాధులు 'చాపకింద'... తీరున దాపురిస్తాయి. వాటి నుంచి బయట పడటం కనాకష్టం. అసలు వ్యాధి నిరోధక శక్తి అంటే ఏమిటో, అది పెరగాలంటే ముందుగానే మనం ఏం చేయాలో సూచించే సచిత్ర బోర్డులు ప్రాంగణంలో పలుచోట్ల కనిపిస్తుంటాయి. ప్రతీ భవంతిలోనూ, గదులన్నింటిలోనూ, గోడల మీద చిత్రఫలకాలు అప్రమత్తం చేస్తూనే ఉంటాయి. ప్రతి నిత్యమూ, నిర్ణీతంగా మంచినీరు తాగితే ఎంత ఉత్తమమో తెలిపే ఫలకాలూ అనేకం ఉన్నాయక్కడ. నిల్వపచ్చళ్లు, నూనెలో దేలిన పదార్థాలు ఇంకెంత హాని కలిగిస్తాయో హెచ్చరించే ఏర్పాట్లూ ఉన్నాయి.

మన శరీరానికి సహకరించాల్సింది మనమే. అప్పుడే అది మనల్ని కాపాడుతుంది. కాదూ కూడదంటూ ఇష్టాను సారం వ్యవహరిస్తే రాపాడు తుంది అనేది ఆరోగ్యాలయంలో కనిపించే మరో హెచ్చరిక.

ఇక ఉత్తేజం కలిగిస్తాయన్న భ్రమతో మనం సేవించే పానీయాలు (శీతలం, ఉష్ణం.. రెండూ) అష్టకష్టాలకూ కారకాలవుతాయి. పొట్ట పేగుల్లోని రాజగురు ఉత్పత్తిని ఆ పదార్థాలు తగ్గించివేయడంతో, వ్యాధులూ, బాధలూ చుట్టు ముడుతాయన్నదీ హెచ్చరికే! ఆకలిని చంపేసే, నిద్రపట్ట కుండా చేసేవాటి జోలికి పోవద్దు. అటువంటి వాటిని తక్షణం మానివేయడమే ముద్దు అనీ నచ్చచెప్తుందీ ఆశ్రమం.

ఇదే ఆవరణలో పాంచభౌతిక చికిత్సలనూ నిర్వర్తిస్తారు. శరీరాన్ని చల్లబరిచే మట్టి స్నానం, చర్మసంబంధ ఇబ్బందులను తగ్గించే వేపపదార్థ స్నానం, సహజ సిద్ధ ఆవిరి స్నానం (అరటి ఆకు వినియోగంతో), ఎముకలకు పటుత్వం ఇచ్చే విటమిన్ డీ చికిత్స... ఇందులో కొన్ని. రక్త ప్రసరణకు దోహదపడే ఇసుక స్నానం, అదే కోవలో మానసిక ఒత్తిడిని నియంత్రించగలిగే, సూర్యరశ్మితో శరీర అవయవాలకు సత్తువనిచ్చే, నిద్రలేమిని అదుపుచేసే, ముఖాన్ని కాంతివంతం చేసేందుకు ఉపకరించే స్నానచికిత్సలనూ సాధకులకు అందిస్తున్నారిక్కడ. వీటితో ఎంత ఉపశమనం కలుగుతుందన్నది ఎవరికి వారికి త్వరలోనే అనుభవానికి వస్తుంది. ఇదంతా ఆరోగ్య సేవా ప్రక్రియ.

వయసుకు మించిన బరువు పెరగడమన్నది మరొక విషమ సమస్య. ఇందుకు చిన్నవీ, పెద్దవీ ఎన్నో కారణాలున్నాయి. సరిదిద్దుకుని బరువు తగ్గించుకోగలగడం అనేది మన చేతుల్లోనే ఉంటుం దంటుంది వైద్యశాస్త్రం. ఈ ప్రకృతి చికిత్స నిలయం లోని సూచక ఫలకం ప్రకారం 'వ్యాయామం చేస్తే కొవ్వు కరుగు' ఆరోగ్యమే ఆనందం, మీ ఆరోగ్యం మీ చేతుల్లో, ఆరోగ్య సప్తపది, శరీరాన్ని లోపల శుభ్రపరచడం ఎలా? ఆహారం – ఆలోచన, పరిపూర్ణ ఆరోగ్యానికి సంపూర్ణ ఆహారం, ఆసనాలు ఆరోగ్యానికి శాసనాలు, ప్రకృతి విధానం – మధుమేహ నిదానం, రోగాలురాని రుచులు... ఇలా డాక్టర్ మంతెన వెలువరించిన పుస్తకాలనేకం ఇప్పటికే ఎంతో ప్రాచుర్యంలో ఉన్నాయి. ఇప్పటికీ ఉంటున్నాయి.

అధిక బరువును ఆరోగ్యకరంగా తగ్గించటం ఎలా? పొద్దుపోయి తినడంవల్ల అనర్థాలు, రోగం రాని ఆహారం, ఆరోగ్యం ఎలా వస్తుంది? ఆరోగ్యానికి మంచి అలవాట్లు, పరిపూర్ణ ఆరోగ్యానికి ప్రకృతి జీవన విధానం, ఉపవాస ధర్మం, నీరు – మీరు, జబ్బులను తగ్గించే వంటలు, లంఖణం పరమౌషధం,



సాధారణ సమస్యలు–చక్కని చిట్కాలు, ఏది అపోహ, ఏది నిజం? ప్రాణాయామం–సుఖజీవన యానం... ఈ అన్నింటితోపాటు 'సుఖజీవన సోపానాలు' అంటూ అనేక పుస్తకాలను ముద్రించి ప్రజలందరికీ అందజేస్తూ ఆరోగ్య అవగాహన కలిగిస్తున్నారు మంతెనవారు.

ఆశ్రమ సంబంధంగా ఛారిటబుల్ ట్రస్టు స్థాపించి రెండు దశాబ్దాలు దాటింది. ప్రాంగణమంతా చెట్లు, పండ్లు, ఆహ్లాదకర వాతావరణంతో నిండి ఉంటుంది. 'సంపూర్ణ ఆరోగ్యాన్ని సంరక్షించండి' అంటూనే 'సర్వదా ఆరోగ్య ఐశ్వర్యాన్ని అనుభవించండి' అనే భరోసానూ ఇక్కడ కల్పిస్తున్నారు. సూక్ష్మీకరిస్తే –

1. సిరిసంపదలు ఎన్ని ఉన్నా ఆరోగ్యమే మిన్న ఆ అన్నింటికన్నా.
2. సంప్రదాయంలోని మంచిని ఎంచు– ఆధునికతను దానికి సమన్వయించు.
3. నిత్యకృత్యాలతో ఇమిడిన వ్యాయామం – జీవితమంతా ఆరోగ్యమయం




**జంధ్యాల శరత్‌బాబు**

సీనియర్ జర్నలిస్ట్


4. శ్రమకు తగిన తిండి తిను – తిండికి తగిన విధంగా శ్రమించు.
5. అవసరాలకు, కోరికలకు అంతరం – తెలిసి మసలుకోవాలి అందరం.
6. ఆరోగ్యవంతులే మహాభాగ్యశాలురు.
7. ప్రకృతి ఒడిలో నేర్చుకొనేదే విద్య – ప్రకృతితో మమేకమైనదే వైద్యం.

వైద్య విధానాల్లో దేని విలువ దానిదే. దేని ధర్మం దానికి ఉంది, ఉంటుంది. అవి ఒకదానికి మరొకటి పరిపూరకాలు.

సృష్టిలోని సమాహార స్వరూపాన్ని చూడగలిగే శక్తియుక్తులు మనలో నిండాలి. ఏదైనా అనారోగ్యం కలిగితే, మనకు నచ్చిన వైద్య విధానాన్ని కాదు; మనకు అవసరమైన విధానాన్ని అనుసరించాలన్నది ప్రకృతి వైద్యశాస్త్ర సూత్రీకరణ.

యోగసాధన ఎంతైనా అవసరం. తెల్లవారక ముందే నిద్రలేవడం, పొద్దుపోకముందే నిద్రించడం ఆశ్రమ సాధకులకు నిత్యకృత్యం. కృష్ణానదీ తీరాన పరమ ప్రశాంత పరిసరాల్లో ఉదయాన్నే వ్యాయామాలు చేస్తారు. పండ్లు, ఇతర ఆహారాలకు ప్రాధాన్యమిస్తారు. ఇక్కడి నిర్వాహకుల్లో ముఖ్యులైన డాక్టర్ ఖైరి శ్రీనివాస్ పలు రచనలు చేశారు, చేస్తున్నారు. కీళ్ల వ్యాధులకు నివారణ మార్గాలు, సుఖనిద్ర, మరెన్నో వెలువరించాయన. 'ఆలోచన రహస్యం' పేరిట నూతన పుస్తకాన్ని త్వరలో వెలువరిస్తున్నారు.

ఏడాది పొడవునా కొనసాగే ఆరోగ్య సాధన కార్యక్రమాలు నిర్వహణతోపాటు ప్రతీ నిత్యమూ సహజ రాజయోగ ప్రసంగాలు శారీరక, మానసిక, భావోద్వేగ నియంత్రణల సమతుల్యతను సాధించగలుగుతున్నాయి. ఆశ్రమ నిర్మాణం, పాలనా నిర్వాహకత్వం, సిబ్బంది సేవానిరతి ఎంతో ప్రత్యేకంగా అనిపిస్తుంది ఎవరికైనా.

అప్పట్లో ఊరూరా పర్యటిస్తూ తమ అనుభవాలను ప్రజలకు వివరిస్తూ యోగా – ప్రకృతి వైద్య అధ్యయనాన్ని పరిపూర్ణంగా చేసిన అనుభవం నిర్వాహక ప్రముఖులది. అందుకే 'ఆరోగ్య ఆలయం' నిరంతర సేవలతో, పరిశోధన ఫలితాల అమలుతో పేరు సార్థకం చేసుకుంటోంది.

ఆ ఆశ్రమ పెద్దలన్నట్లు 'ఎవరి ఆరోగ్యం వారి చేతుల్లోనే'. ★



# కాలాతీత వ్యూహాలను రూపొందించిన యోధుడు ఛత్రపతి

**పాలించే రాజుకు శౌర్య, సాహసాలే కాదు మేధోపరమైన పరిణతి ఉన్నప్పుడు వారు చరిత్రలో శాశ్వతంగా మిగిలిపోతారనేందుకు ఉదాహరణ ఛత్రపతి శివాజీ. ఆయన పేరు మనసులోకి రాగానే, మనకు మొదటగా గుర్తుకు వచ్చేది ఆయన శౌర్యం, యుద్ధ వ్యూహాలే. అయితే, ఆయన చేపట్టిన విధానాలు మరాఠా సామ్రాజ్యవ్యాప్తంగా సమాజాన్ని పెనుమార్పుకు లోను చేశాయి. ముఖ్యంగా వ్యవసాయ, సాంస్కృతిక విప్లవాలు సమాజంలో చోటు చేసుకున్నాయి.**



**వినయ్ సహస్రబుద్ధే**

దార్శనికుడు, శౌర్యానికి, అసాధారణమైన పాలనా సామర్థ్యాలు, లోతైన వ్యూహాలకు ప్రాచుర్యం పొందిన **ఛత్రపతి శివాజీ మహారాజు పట్టాభిషేక మహోత్సవం జూన్ 6న జరిగింది. ఆయన సింహాసనాన్ని అధిష్టించిన 350వ సంవత్సరమిది.** అనేక మంది స్వాతంత్య్ర సమరయోధులకు స్ఫూర్తిగా నిలవడమే కాదు, విస్తృత స్థాయిలో చూసినప్పుడు దేశ తొలి స్వాతంత్య్ర సమరయోధులలో ఒకరిగా నిలిచిన శివాజీ గొప్పతనాన్ని బ్రిటిష్‌కాలంలో వలస పాలకులు కావాలనే విస్మరించడం ఒక విషాదం. స్వాతంత్య్రానంతరం కూడా, రాజకీయాల కోసం ఛత్రపతి వారసత్వం పట్ల అదే అలసత్వాన్ని చూపారు.

శివాజీ చేసిన సేవలు విస్మరించలేనంత గొప్పవన్న నిర్వివాదమైన వాస్తవాన్ని పక్కన పెడితే, మనం ఆయనను అనేక కారణాల వల్ల గుర్తుంచుకోవాలి. దూరదృష్టి, సమ్మిళితత్వంపై అవధారణ, పదునైన మేధస్సుతో పాటుగా వ్యూహాత్మక ఆలోచన, దౌత్యపరమైన పద్ధతులను అనుసరించిన ఆదర్శ నాయకుడు.

ఆయన ఎదుర్కొన్న సంఘర్షణ ప్రభావం చారిత్రికంగా కేవలం మహారాష్ట్రకే పరిమితం కాలేదు. కేవలం ఒక శతాబ్దానికే మితం కాలేదు. ఆ ప్రభావం శతాబ్దాల తరబడి కొనసాగింది, రానున్న కాలంలోనూ కొనసాగనుంది. సాధారణంగా ఛత్రపతి శివాజీని ఆయన శౌర్య, సాహసాలకు మాత్రమే గుర్తు చేసుకుంటుంటారు. కానీ, వీటి ఆవల ఆయన తన జీవితకాలంలో 17వ శతాబ్దపు సమాజాన్ని అనేక పరివర్తనలకు లోనుచేసిన విషయాన్ని కూడా మనం తెలుసుకోవాలి. అనేకమంది చరిత్రకారులు ఆయనను ఐదు ప్రధాన విప్లవాలకు నాంది పలికిన ఒక విప్లవ నాయకుడిగా అభివర్ణిస్తారు. వాటిని మనం అర్థం చేసుకోవడం అవసరం. వీటిలో వ్యవసాయ విప్లవం, ఆర్థిక విప్లవం, సామాజిక విప్లవం, సైనిక విప్లవంతోపాటుగా అత్యంత కీలకమైన సాంస్కృతికమైన విప్లవం ఉంది.

శివాజీ మహారాజు, రాజమాత జీజాబాయి పూణె వచ్చిన సమయానికి ఆ ప్రాంతమంతా ఆదిల్‌షాహీ పాలనలో తీవ్ర వినాశనాన్ని ఎదుర్కొని ఉంది. యువ శివాజీని తీసుకుని, రాజమాత అక్కడకు వచ్చిన తర్వాత, ఆమె పుణె, ఆ చుట్టుపక్కల ప్రాంతాలను ప్రతీకాత్మకంగా బంగారు నాగలితో దున్నించింది. ఇది కేవలం ఒక సూచన కాదు. వారిరువురూ కలిసి రైతులకు, వ్యవసాయదారులకు తమ భూమిని ఎటువంటి భయాలు లేదా ఆందోళనలు లేకుండా సాగు చేసుకోమనే సందేశాన్ని సంకేతాత్మకంగా ఇచ్చారు. శాపగ్రస్తమైన భూమిగా పరిగణించిన భూమిలో, ఆకాంక్షించడాన్ని మర్చిపోయిన సమాజంలో శివాజీ బంగారు నాగలితో వారిలోని నిస్సహాయతను తొలగించి, ఆ భూమి సారాన్ని పునరుజ్జీవింపచేశాడు. దీని ద్వారా ఆయన తన దేశపౌరులకు, "ఇప్పుడు భయపడాల్సిన అవసరం లేదు. మీ కోసం నేనున్నాను," అనే సందేశాన్ని అందించారు. విశేషంగా కీలకమైన ఈ చర్య, వారిలో ఆశ, ఆత్మవిశ్వాసం, దృఢనిశ్చయమనే విత్తనాలను నాటింది.

ఇది అత్యంత ముఖ్యమైన చర్య. ఎందుకంటే, ఆదిల్‌షాహీల పాలనలో రైతులు 60శాతం పన్ను కట్టవలసి వచ్చేది. ఇది వారిని తీవ్ర ఇబ్బందులకు లోను చేసింది. వీటికి తోడుగా సహజ, మానవ నిర్మిత విపత్తుల చెప్పలేని కాఠిన్యం, రైతులు తమ భూమిని తాము సాగు చేసుకునేందుకు సాహసించలేక పోయేలా చేసింది. చరిత్ర రికార్డుల ప్రకారం కేవలం 30 నుంచి 40 శాతం భూమి మాత్రమే సాగులో ఉండేది. వ్యవసాయదారులకు రాయితీలు ఇచ్చి, ప్రోత్సహించేందుకు ఛత్రపతి శివాజీ పాలనా యంత్రాంగం సాగు చేసుకునే ప్రతి రైతుకు ఉచితంగా కొంత ఆహారధాన్యాలతో పాటుగా ఉచితంగా విత్తనాలను, వ్యవసాయ పనిముట్లను ఇవ్వడం ప్రారంభించింది. మొదటి ఐదేళ్ల పాటు ఆయన పన్నును రద్దు చేశాడు. ఐదేళ్లలో పరిస్థితి ఎంతగా మెరుగుపడిందంటే, నూటికి నూరుశాతం వ్యవసాయ భూమిని సాగులోకి తెచ్చారు. ఆరవ సంవత్సరం నుంచి ఆయన వారు ఉత్పత్తి చేసిన ధాన్యంలో 33శాతం ప్రభుత్వ ధాన్యాగారంలో జమచేసేలా పన్నును నిర్ణయించాడు. ఆయన సృజనాత్మక ఆలోచన, సున్నితమైన పద్ధతి కారణంగా

వ్యవసాయం చేయడం ఆకర్షణీయంగా మారడమే కాదు, రైతులు సంపన్నులయ్యారు.

రైతుల సంపన్నత పర్యవసాన ప్రభావాన్ని చూపింది. అది, నేడు మనం సంప్రదాయ చేతివృత్తి పనివారు, హస్తకళాకారులుగా చెప్పుకునే నాటి '12 బలుతేదార్ల' ఆర్థిక శ్రేయస్సుకు దారి తీసింది. వ్యవసాయకంగా ఆర్థిక సుస్థిరతను సాధించిన తర్వాత వ్యవసాయ సాధనాలు, పరికరాలు, పనిముట్ల కోసం నిరంతర డిమాండ్ గ్రామీణ ప్రాంతాలలో ఉత్పత్తిని ప్రేరేపించింది. దీనిద్వారా కమ్మరి, వడ్రంగి, చెప్పులు కుట్టేవారు సహా పలు వృత్తుల వారికి పనిని లభ్యమైంది. అనేక ఉపాధి అవకాశాలకు ద్వారాలు తెరిచిన ఆర్థిక విప్లవం వంటిది ఇది అని చెప్పవచ్చు. ఇది ఒకరకమైన సామాజిక విప్లవానికి కూడా మార్గాన్ని సుగమం చేసింది. సాధారణంగా, అనేక కులాలు, వర్గ సమూహాలుగా చీలిపోయి ఉన్న సమాజం, ఛత్రపతి శివాజీ మహారాజ్ పాలనపై నిర్భయంగా ఆధారపడవచ్చని, మెరుగైన జీవితాన్ని ఆకాంక్షించవచ్చని గుర్తించింది. శాంతి, భద్రతల హామీ ప్రభుత్వంపై ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించింది. వ్యవసాయ ఆధారిత కార్మిక, చేతిపనులకి చెందిన 18 భిన్న కులాలు సంపదను, ఆత్మగౌరవాన్ని సాధించేందుకు అధికారాన్ని పొందినట్టు భావించాయి. ఇదే, నిబద్ధత, అంకితభావం గల సైనికులతో సామాజికంగా సమీకృత సైన్యమైన 'మవాలాస్' (శివాజీ సైనికులు) ఏర్పాటుకు దారి తీసింది. ఎటువంటి అధికారిక నియామకాలు లేకుండా, ఎల్లవేళలా సంసిద్ధంగా ఉండే ఈ సైన్యం స్వచ్ఛందంగానే పని చేసినప్పటికీ, అది సంఘటితంగా ఉండేది. ఏదైనా యుద్ధం జరుగబోతోందన్నప్పుడు, అందరూ తమ పనిని వదిలేసి, కర్తవ్యభావంతో ఛత్రపతి శివాజీ మహారాజ్ పిలుపునకు స్పందించేవారు. ఇది అసమానమైనది.

ఛత్రపతి శివాజీ లెక్కలేనన్ని, అసమానమైన యుద్ధాలు చేయవలసి వచ్చింది. సాహసవంతులైన కొన్ని వందలమంది సైనికులతో కూడిన అతడి సైన్యం ఎప్పుడూ వేల సంఖ్యలో సైనికులు గల బలమైన మొగలు సైన్యాన్ని ఎదుర్కొనవలసివచ్చేది. ఒక తెలివైన సేనాధిపతిగా, శివాజీ తరచుగా గెరిల్లా యుద్ధ వ్యూహాలను (మరాఠాలో గనిమి కవా అనే) అనుసరించేవాడు. నేర్పుగల యుక్తిపరుడైన అతడు, అనంతరం శత్రువుపై మరింత బలంగా దాడి చేసేందుకు వ్యూహాత్మకంగా కొంతకాలం పాటు తిరోగమించడానికి ఎప్పుడూ సందేహించలేదు. అతడు అనేక యుద్ధాలు చేశాడు, వాటిలో ఎక్కువగా తనకు అనుకూలమైన షరతులతో, తాను ఎంపిక చేసుకున్న ప్రదేశంలో చేశాడు. అందుకు మంచి ఉదాహరణ ప్రతాప్‌గఢ్ యుద్ధమే. ఆ యుద్ధంలో అతడు ప్రదేశాన్ని, యుద్ధ సమయాన్ని కూడా ఎంపిక చేశాడు. అతడి యుద్ధ తంత్రంలో దీనిని అత్యుత్తమమైనదిగా చెప్పవచ్చు.

ఛత్రపతి శివాజీ మహారాజ్‌కు స్వరాజ్ అన్న భావన స్వీయ పాలనకు మాత్రమే పరిమితమైనది కాదు. ఇందులో స్వ-ధర్మ (వ్యక్తి తన విధుల పట్ల స్వీయచైతన్యంతో ఉండడం), స్వ-భాష (మాతృభాష) అన్న భావనలు కూడా మిళితమై ఉంటాయి. ప్రాచుర్యం పొందిన వలస భావనల నుంచి వారిని విముక్తం చేసేందుకు అతడికి మార్గదర్శనం చేసిన ప్రాథమిక సూత్రాలు ఇవి. ఆ రోజుల్లో, మరాఠీ సహా దేశీయ భాషల్లోకి అనేక పర్షియన్, అరబిక్ పదాలను చొప్పించారు. అతడి పాలనా కాలంలో వాటికి పర్యాయంగా దేశీయ పదాలను రూపొందించి, ప్రవేశపెట్టిన ఘనతను ఛత్రపతి శివాజీ మహారాజ్‌కు ఇవ్వవలసిందే. నిజానికి, 'మరాఠీ రాజ్య వ్యవహార్ కోశ్' పేరుతో మరాఠీ పదాల డిక్షనరీ (నిఘంటువు)ని సృష్టించడం అన్నది అతడు అందించిన ముఖ్య సేవలలో ఒకటిగా చెప్పవచ్చు. ఇది అతడు మలచిన సాంస్కృతిక విప్లవం.

అత్యంత అనూహ్యమైన, అస్థిరమైన రాజకీయ వాతావరణంలో, ప్రతిదానిని ప్రారంభించేందుకు అతడు రిస్కు తీసుకొని, తన అసమానమైన దార్శనికతతో న్యాయం, ఆత్మగౌరవం, నిబద్ధత, త్యాగం, సౌభ్రాత్రం, సమానత్వం, మహిళల పట్ల గౌరవం, న్యాయపాలన వంటి విలువలను స్థాపించాడు. ఛత్రపతి శివాజీ ముందు కాలంలో ఆక్రమణదారులు మనను తేలికగా పరాజితులను చేసేవారు. ఒక సమాజంగా మనం పదే పదే పరాజయం పాలవడానికి అలవాటుపడ్డాం. పరాజయం, భ్రష్టత, ఆత్మగౌరవం లేకపోవడమనే విషాన్ని మౌనంగా మింగడం అన్నది మన జాతీయ అలవాటుగా మారింది. ఈ పరాజయ మనస్తత్వాన్ని సవాలు చేసేందుకు సాహసించి, స్థిరంగా ఎవరైనా 17వ శతాబ్దంలో నిలబడ్డారంటే అతడు ఛత్రపతి శివాజీ మహారాజ్ తప్ప మరొకరు కాదు.

– *(ఇండియన్ ఎక్స్‌ప్రెస్/ 19.06.2024)*

# ఎండకు 1300 మంది హజ్ యాత్రికుల మృతి

**హ**జ్ యాత్ర కోసం సౌదీ అరేబియా వెళ్లి, తీవ్ర ఎండలకు కన్నుమూస్తున్న వారి సంఖ్య పెరుగుతూనే ఉంది. జూన్ 23 వరకు అందిన సమాచారం ప్రకారం 1300 మంది చనిపోయారు. సౌదీ అరేబియా అధికారుల సమాచారం మేరకు అసోసియేటెడ్ ప్రెస్ ఈ వివరాలు వెల్లడించింది. 50 డిగ్రీలకు పైగా ఎండ వేడిమిలో వారు నడుస్తున్నారు. ఇక్కడ సౌదీ ఆరోగ్యమంత్రి ఫహద్ బిన్ అబ్దుర్రహమాన్ అల్ జలాజెల్ ఇచ్చిన వివరణ గమనించదగినది. మృతులలో 83 శాతం అనధికారికంగా వివిధ నడక మార్గాల ద్వారా మక్కాకు వస్తున్నవారేనని ఆయన చెప్పారు. ఎండదెబ్బ తగిలిన 95 శాతం యాత్రికులకు వివిధ ఆసుపత్రులలో వైద్యం అందిస్తున్నారు. అవసరమైన వారిని విమానం ద్వారా రియాద్



ఆసుపత్రులకు కూడా తరలించామని ఆయన చెప్పారు. మృతులలో చాలామందిని సరైన ధ్రువీకరణపత్రాలు లేనందున గుర్తించడం సాధ్యం కావడం లేదు. ఈజిప్ట్ అధికారికంగా 50,000 మందికి అనుమతి ఇచ్చింది. కానీ చాలామంది అనధికారికంగా రావడానికి ప్రయత్నించినా అధికారులు వెనక్కి పంపేశారు. అయినా కొందరు తప్పించుకుని సౌదీ లోని పవిత్ర ఇస్లామిక్ క్షేత్రాలకు వచ్చారు. వీరిలో చాలామంది కాలినడకన వచ్చారు.

ఐదురోజుల పాటు సాగే మక్కా యాత్రలో యాత్రికులు చనిపోవడం కొత్త కాదు. ఆ ఐదు రోజులలోనే 20 లక్షల మంది వస్తారు. చరిత్రలో తొక్కిసలాట వల్ల పెద్ద సంఖ్యలో మరణించిన సందర్భాలు ఉన్నాయి. అయితే ఈ ఏడాది సంభవించిన మరణాల తీరు వేరు. 2015లో మినా అనేచోట జరిగిన తొక్కిసలాట వల్ల 2400 మంది చనిపోయారు. దీనినే పెద్ద ప్రమాదంగా పరిగణిస్తారు. అయితే మృతులు వాస్తవంగా ఎందరో సౌదీ ఏనాడు చెప్పలేదు. అదే సంవత్సరం మక్కా వద్ద ఒక భారీ క్రేన్ పడిపోవడంతో 111 మంది చనిపోయారు. 1990లో సంభవించిన తొక్కిసలాట రెండో పెద్ద ప్రమాదం. అప్పుడు 1426 మంది చనిపోయారు.

ఈ హజ్‌యాత్రలో జూన్ 24వ తేదీకి అందిన సమాచారం మేరకు చనిపోయిన భారతీయులు 98.

★



బంకించంద్ర

# దేశభక్తి ప్రదీప్తమైన బంకించంద్ర

పేరుప్రతిష్టల కోసమో, సాహిత్యరంగంలో తనదైన స్థానం కోసమో పాకులాడకుండా, ప్రకృతి ఎంత సహజంగా, నిశ్శబ్దంగా తన పని తాను చేసుకు వెళుతుందో బంకించంద్రుడు కూడా తన పని మీద మమకారంతో అలాగే చేశారు. ఆయన తన కోసమంటూ ఏ లక్ష్యమూ పెట్టుకోకుండా, తాను ఎంత మంచి సాహిత్యం ఇవ్వగలరో అంత మంచి సాహిత్య సృష్టికి శ్రమించారు. ఆయన తనదైన భాషను, సాహిత్యాన్ని సృష్టించారు. అలాగే ఒక దేశాన్ని కూడా నిర్మించారు' అన్నారు అరవింద్ ఘోష్. నిజమే, బంకించంద్ర చటర్జీ అద్భుత గేయం 'వందేమాతరం' భారత స్వరాజ్య సమరాన్ని విజయపథంలో నడిపి స్వతంత్ర భారతదేశాన్ని నిర్మించింది. ఆ విధంగా అరవిందులు బంకించంద్రుని కేవలం సాహిత్య నిర్మాతగానే కాదు, ఒక దేశ లేదా స్వతంత్ర జాతి నిర్మాతగా కూడా చరిత్ర పుటలలో నిలిపే మహోన్నత ప్రయత్నం చేశారు. ఆధునిక భారతీయ సాహిత్య స్రష్టలలో, పునరుజ్జీవనోద్యమంలో బంకించంద్ర (1838–1894) అగ్రగణ్యులు. పందొమ్మిదో శతాబ్ది పూర్వార్థంలో బెంగాలీ సాహిత్యాన్నే కాక, భారతీయ భాషా సాహిత్యాలన్నింటినీ గొప్పగా ప్రభావితం చేశారు.

బంకించంద్ర బెంగాల్‌లో సంప్రదాయ కుటుంబంలో జన్మించాడు. తండ్రి యాదవచంద్ర ఛటోపాధ్యాయ బ్రిటిష్ ప్రభుత్వంలో 'మిద్నపూర్'లో డిప్యూటీ కలెక్టర్. తల్లి దుర్గాదేవి, సనాతన సదాచార గృహిణి. బంకింబాబు ముగ్గురన్నదమ్ముల్లో చివరివాడు. విద్యాభ్యాసం హుగ్లీ జిల్లా మిషన్ కళాశాలలో, కలకత్తా ప్రెసిడెన్సీ కళాశాలలో సాగింది. 1857 తరువాత ఆంగ్లేయులు కలకత్తాలో స్థాపించిన విశ్వవిద్యాలయం నుంచి వచ్చిన తొలి పట్టభద్రుడు బంకించంద్ర. తర్వాత న్యాయశాస్త్ర పట్టభద్రుడయ్యాడు. ఆయన తండ్రిలాగా 'జెస్సూర్'లో డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగంలో చేరాడు. ఉద్యోగ నిర్వహణలో బ్రిటీషువారికి పరమ విధేయుడనిపించుకోకుండా, తన స్వతంత్రతకు భంగం కలుగకుండా, అవసరమైన చోట్ల వారిని ఎదిరించి ఉద్యోగ విధులు నిర్వర్తించాడు. అయినా ఆయన మరణించేముందు భారతదేశంలో అత్యున్నతమైన సి.ఐ.ఇ బిరుదుతో ఇంగ్లీషు ప్రభుత్వం ఆయనను సత్కరించింది.

**రచనా వ్యాసంగం - రచనలు**

ఆయన సాహిత్యకృషి కవితా రచనతో ప్రారంభమైంది. 'ఈశ్వరచంద్ర గుప్తా' స్ఫూర్తితో రచనలు చేశాడు. ఆధునిక విద్యావంతులను ఆకర్షించేందుకు కవిత్వం కంటే నవలా ప్రక్రియ ఉత్తమమని భావించారు. ఆయన ఊహ నిజమైంది. ఆయన బెంగాలీ భాషలో 14 నవలలు, ఇంగ్లీషులో ఒక నవల రాశాడు. 1865లో ఆయన రాసిన 'దుర్గేశ నందిని' ప్రణయ శృంగారాత్మక నవల. దీన్ని తొలి బెంగాలీ నవలగా విమర్శకులు నిర్ధారించారు. ఆయన నవలల్లో 'కపాలకుండలి', 'మృణాళిని', విషవృక్షం, 'కృష్ణకాంతుడి వీలునామా', 'చంద్రశేఖర్', 'రాజసింహ' వంటివి ప్రసిద్ధాలు. ఆయన 'ఆనంద మఠం' భారతీయ సాహిత్యంలో సంచలనాత్మక నవలగా ప్రసిద్ధి పొందింది. భారతీయ భాషలన్నింటిలో అది అనువదించబడింది.

**ఆనందమఠం నవల-రచనా నేపథ్యం**

భారతీయ పురాణాలు, ఆర్షధర్మం స్త్రీను దేవతగా ఆరాధిస్తాయి. తల్లిగా, సోదరిగా ఆమెను ప్రతి కుటుంబం ఎంతో గౌరవిస్తుంది. కానీ బంకించంద్ర దేశాన్ని మాతృమూర్తిగా భారతీయుల హృదయాల మీద చిత్రించారు. వందేమాతర గేయం సారాంశం, తాత్త్వికత, భావం ఇదే. మాతృభూమి అంటే ఆరాధ్యదేవతగా ఆవిష్కరించారాయన. బంకించంద్ర తన సృజనాత్మక రచనలకు ప్రాచుర్యం కల్పించుకొనే వేదికగా 'వంగదర్శన్' అనే పత్రికను 1872 ఏప్రిల్ నెలలో ప్రారంభించాడు. ప్రారంభ సంచిక పూర్తిగా ఆయన రచనలకే పరిమితమైంది. అందులో ధారావాహిక నవలలు, కథలూ, వ్యాసాలూ, కవితా ఖండికలూ, సాహిత్య విమర్శ, పుస్తక సమీక్షలకు ప్రాధాన్యం ఉండేది. ఆయనకు విశ్వవ్యాప్తంగా పేరు తెచ్చిన నవల 'ఆనందమఠం' 1882లో వంగదర్శన్ పత్రికలో ధారావాహికంగా ప్రచురితమైంది. ఈ నవలా రచనకు ప్రేరణ కలిగించిన 'వందేమాతరం' గీతం ప్రస్తావన నవల్లో అనేకసార్లు వస్తుంది. ఈ గీతాన్ని 'వంగదర్శన్' పత్రికలో ఖాళీ పేజీని పూరించేందుకు యాదృచ్ఛికంగా రాశాడు. ఆ గీతాన్ని రవీంద్రనాథ్ గొప్పగా స్వరపరచాడు. ఆ గీతం స్వాతంత్ర్య సమర శంఖా నినాదమై బ్రిటీషువారి గుండెలవిసేలా ప్రతిధ్వనించింది. కోట్లాది భారతీయుల హృదయాల్లో దేశభక్తి ప్రదీప్తగీతంగా మార్మోగింది.

ఈ నవలా రచనకు మూలం భారతదేశంలో జరిగిన సన్యాసుల తిరుగుబాటు. దీనితో పాటు 1770 నాటి ఘోరమైన బెంగాల్ కరవును ఈ నవలకు నేపథ్యంగా ఉంటుంది. ఉత్తర భారత దేశంలో 1773లో కొందరు సన్యాసులు ఈస్టిండియా కంపెనీ ప్రభుత్వాన్ని కులద్రోయడానికి పూనుకున్న సంఘటన, అలాగే స్వాతంత్ర్య సమర చరిత్రలో ప్రథమ స్వాతంత్ర్య సమరంగా నిలిచిన 1857 నాటి సిపాయా



డా॥పి.వి.సుబ్బారావు
9849177594,
విశ్రాంత అధ్యాపకుడు

తెలుగు నవలా సాహిత్యంపై 'ఆనందమఠం'

# ఛటర్జీ 'ఆనందమఠం'



బంకించంద్ర గీసిన
భారత మాతా పెయింటింగ్

కలహం ప్రేరణ కలిగించాయి. ఈ ప్రేరణల ప్రభావాలతో అప్పటి బ్రిటీషు అధికారుల పన్నుల పీడింపు, కరువు కాటకాల్లో ప్రజలు ఆక్రందనలతో చలించి ఈ నవలా రచనకు పూనుకున్నాడు బంకించంద్ర.

భారత స్వాతంత్ర్యోద్యమ సమయంలో ఈ నవల భారతీయుల హృదయాల్లో సుస్థిరస్థానాన్ని పొందింది. భారతీయ భాషలన్నింటితోపాటు, తెలుగులో కూడా అనూదితమైంది. తెలుగుభాషలో మొట్టమొదటి సారిగా జి.వి.యస్. దొరస్వామయ్య అనువాదం (1907) చేశాడు. తర్వాత వేంకటపార్వతీశ్వరకవులు, తల్లాప్రగడ సూర్యనారాయణ, చాగంటి శేషయ్య వంటి ప్రముఖులు అనువదించారు. రమేష్ 1950 ప్రాంతాల్లో బెంగాలీ, హిందీప్రతుల ఆధారంగా చేసిన అనువాదం మూలానికి దగ్గరగా ఉందన్న ప్రసిద్ధి పొందింది. ప్రముఖ కథా, నవలా రచయిత, పరిశోధకుడు డా॥ అక్కిరాజు రమాపతి రావు ఆకర్షణీయమైన శైలిలో అనువదించి ఆరునెలల పాటు ఆంధ్రప్రభ దినపత్రికలో ధారావాహికంగా ప్రచురించి పాఠకుల ప్రశంసలందుకున్నారు.

**పాత్రచిత్రణ**


నవలకు పాత్ర చిత్రణ ప్రధానం. బంకించంద్ర పాత్ర చిత్రణ విషయంలో ఉదాత్త శిఖరాలను అధిరోహించాడనటంలో అతిశయోక్తి లేదు. ఉదాత్తాశయాలు, ఉజ్జ్వల భావాలు, ధీరోదాత్త సాహసం, మానవాతీతమైన మహోన్నత త్యాగం ఆనందమఠం నవల్లో ఆయన చిత్రించిన పాత్రల్లో సాక్షాత్కరిస్తుంది. ఆయన స్త్రీ పాత్రలు కూడా ధీరలు, త్యాగధనులు, దేశభక్తి పరాయణులు. సన్యాసులకూ, సంక్షుభిత సమాజానికీ ఉన్న బంధం ఏమిటో ఈ నవలలో ఆవిష్కరించారు రచయిత. సమాజం తనదైన లక్షణాలను, నాగరికతను, ధర్మాన్ని కోల్పోతున్నప్పుడు ముక్కు మూసుకుని తపస్సు చేసుకోవడం సన్యాసులు చేయవలసినది కాదని ఈ నవలలో చెప్పారని అనిపిస్తుంది. సంతానుల ఉద్యమదీక్ష నాయకుడు సత్యానంద తపస్సంపన్నుడు. ఆయనలో సంయమనం, పరమత సహనం ప్రశంసనీయాలు. మాతృదేశ పరిరక్షణాచిత్తులై ఉద్యమంలో జీవనానంద, భవానంద, ధీరానందులు సర్వసంగ పరిత్యాగులై ఆయనకు బాసటగా నిలిచారు. విజయ కారకులయ్యారు. పదచిహ్నాలో సంపన్న కుటుంబీకుడైన మహేంద్రసింగ్ దీక్షా నియమబద్ధుడై విజయా నంతరం స్వామి మెప్పు పొందాడు. రచయిత, భవానందుడి పాత్రలో పరిణామాన్ని గొప్పగా చిత్రీకరించాడు. అతడు దీక్షా నియమ విరుద్ధంగా ప్రవర్తించి ప్రాయచిత్తంగా ప్రాణత్యాగం చేసుకున్నాడు.

స్త్రీ పాత్రల్లో 'శాంతిని' ధీరగా, బహుభాషా ప్రావీణ్యంగా, సాహసోపేతగా, త్యాగధనిగా తీర్చిదిద్దాడు. కల్యాణిని ఉదాత్త త్యాగ తత్పరగా, పతిభక్తి పరాయణగా, భర్త ఆశయ సిద్ధికి అసువులు బాసేందుకు సిద్ధమైన త్యాగమూర్తిగా చిత్రించాడు.

బంకించంద్ర ఆనందమఠం నవలను ఉత్తమ పురుష, ప్రథమ పురుష కథనాలతో, నాటకీయ సంవిధానంతో ఆకర్షణీయమైన శైలిలో రాశాడు.

**ప్రభావం**

బంకించంద్ర ఛటర్జీ ప్రభావం 20వ శతాబ్ది మొదటి దశాబ్దిలో తెలుగు రచయితలపై ప్రగాఢంగా ఉంది. విజ్ఞాన చంద్రికామండలి 1901లో చారిత్రక నవలలు పోటీ నిర్వహించింది. ఆ సందర్భంగా వచ్చిన వేంకట




పార్వతీశ్వర కవుల 'మాతృ మందిరం'పై ఆనందమఠం ప్రభావం ఉంది. భోగరాజు నారాయణమూర్తి రాసిన 'విమలాదేవి', 'అంగరాజ్యం' నవలలపై గాఢంగా ఉంది. విశ్వనాథ వారి 'వేయిపడగలు' నవలలో బంకిచంద్ స్ఫూర్తితో పరభాష, పరప్రభుత్వ, పర సంస్కృతుల మోజు ఏ విధంగా సంప్రదాయ విచ్ఛిన్నతకు దారి తీస్తుందో వివరించి, వాటిని నిరసించాడు. ఉన్నవ వారి మాలపల్లిలో (1922) బంకించంద్రుని అనుస రించిన సంఘటనలున్నాయి.

ఆనందమఠంలోని 'వందేమాతరం' గీత ప్రభావం జాతీయోద్యమ గీతాలపై గొప్పగా ఉంది. రాయప్రోలు వారి "నమస్తే మంగళమహి శ్రీ మహా మాతృభూమే" ఆంధ్ర భారతి (1910), కృష్ణశాస్త్రిగారి 'జయ జయ ప్రియభారత జనయిత్రీ (1930) వంటి గీతాలు 'వందేమాతరం' స్ఫూర్తితో వచ్చాయి.

'వందేమాతరం' గీతంతో ప్రభావితుడు కాని తెలుగు రచయిత లేడంటే అతిశయోక్తి కాదు. బంకించంద్రుని ఆనందమఠం ప్రతి ఒక్కరూ విధిగా చదవదగిన గొప్ప నవల. ★

**గ్లోబలీకరణతో అతలాకుతలమైన గ్రామీణ భారతాన్ని, విచ్ఛిన్నమైన చేతివృత్తులు, వ్యవస్థలను ఒక్కొక్కటిగా పునరుద్ధరించ డంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి పెట్టింది. గ్రామీణ ప్రాంతాల చేతివృత్తి పనివారు, హస్తకళాకారులు కూడా అంతర్జాతీయ మార్కెట్‌ను అందుకునేందుకు అవసరమైన జాగృతిని, సాధనాలను అందిస్తూ సమ్మిళిత వృద్ధి సాధించే దిశగా దేశాన్ని నడిపిస్తున్నారు ప్రధాని మోదీ. వికసిత భారతాన్ని సాధించే దిశగా వడివడిగా అడుగులు వేసేందుకు వీలుగా రూపొందించి, అమలు చేస్తున్న పథకాలు మరికొన్ని ఈ వారం తెలుసుకుందాం.**


# సమ్మిళిత వృద్ధి దిశగా

గ్రామాలకు నాణ్యమైన, నిలకడైన విద్యుత్ సరఫరా చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామ జ్యోతి యోజన (డిడియుజిజెవై) అనే సమగ్ర విద్యుత్ పంపిణీ పథకాన్ని 2014లోనే ప్రారంభించింది. ఈ పథకం అమలుకు నోడల్ ఏజెన్సీగా రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ వ్యవహరిస్తోంది. వ్యవసాయ, వ్యవసాయేతర ఫీడర్లను వేరు చేయడం ద్వారా గృహ వినియోగదారులకు, వ్యవసాయ వినియోగదారులకు నిరంతర, నాణ్యమైన విద్యుత్తును అందచేస్తున్నారు. నిర్దేశిత మైలురాళ్లను సాధించిన వారికి ఈ పథకం కింద 60శాతం ప్రాజెక్టు విలువ (ప్రత్యేక రాష్ట్రాలకు 85శాతం)ను భారత ప్రభుత్వం గ్రాంట్ రూపంలో అంద చేస్తుండగా, 15శాతం వరకు (ప్రత్యేక రాష్ట్రాలకు 5శాతం అదనంగా) నిధులను రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తాయి. ప్రత్యేక కేటగిరీ రాష్ట్రాలలో అన్ని ఈశాన్య రాష్ట్రాలు, జమ్ముకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ ఉన్నాయి. దేశాభివృద్ధి కోసం అదనంగా పునరావృత ఇంధనాలతో పని చేసే విద్యుత్ కేంద్రాల స్థాపనకు పూనుకోవడమే కాదు, ప్రస్తుతం గ్రామీణ ఆవాసాలకు 23 గంటలపైన విద్యుత్ సరఫరా చేస్తోంది.

**పీఎం కిసాన్ సమ్మాన్ నిధి, మాన్‌ధన్ యోజన, రైతు ఉత్పత్తిదారు సంస్థలు**

మోదీ 2014లో అధికారం చేపట్టినప్పటి నుంచీ 'రైతు ఆదాయం పెంపు, సాగు వ్యయం తగ్గింపు, విత్తు నుంచి విపణి దాకా అన్నదాతకు ఆధునిక సౌకర్యాల కల్పన' అన్నవి ప్రభుత్వ ప్రాధాన్యాలుగా పలు చర్యలు చేపట్టారు. రైతుల ఆదాయం రెట్టింపు చేయడం కోసం కిసాన్ క్రెడిట్ కార్డ్, పిఎం పంటల బీమా, పీఎం కిసాన్ సమ్మాన్‌నిధి సహా అనేక పథకాలు, సంస్థలు ప్రారంభమయ్యాయి. పీఎం కిసాన్ యోజన ప్రపంచంలోనే అత్యంత భారీ డీబీటీ పథకాలలో ఒకటి. ఇది భూ యజమానులకు మాత్రమే వర్తిస్తుంది.

ప్రధానమంత్రి పంటల బీమా పథకం కింద 55.49 కోట్ల మంది రైతులు నమోదు కాగా, రూ.1.50 లక్షల కోట్లు రైతుల అభ్యర్థన కింద చెల్లించిన పరిహారం సొమ్ము. రైతులకు 24 కోట్ల భూసార కార్డులను సూక్ష్మ పోషకాల సద్వినియోగం లక్ష్యంతో 2014-15 నుంచి అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా దేశంలో 11.27 కోట్లమంది రైతులకు 15 విడతలుగా 2.81 లక్షల కోట్లను చెల్లించారు. అరవై ఏళ్లు నిండిన రైతులకు పెన్షన్ ఇచ్చే లక్ష్యంతో ప్రారంభమైన పిఎం మాన్‌ధన్ యోజన కింద 23.38 లక్షల మంది నమోదు చేసుకున్నారు. 2019లో ప్రారంభించిన ఈ పథకం కింద రైతుకు నెలకు రూ.3,000 పింఛను ఇస్తున్నారు.



**నమో డ్రోన్ దీదీ**

వినూత్నమైన ఈ పథకం కింద 2024-25లో ఎంపిక చేసిన, 14,500 మంది మహిళా స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం డ్రోన్లను పంపిణీ చేస్తుంది. వీటికి గరిష్ఠంగా 80శాతం మేర కేంద్రం చేయూతనిస్తుంది. మిగిలిన మొత్తాన్ని సాముదాయిక స్థాయి సమాఖ్య రుణాల ద్వారా సమకూరుస్తుంది. ఇది రైతు సామర్థ్యం సహా పంట దిగుబడి పెంపు, నిర్వహణ ఖర్చుల తగ్గింపులో తోడ్పడనుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కంపెనీలు తమ సొంత వనరులతో 500 డ్రోన్ చోదిత ఎరువులను కొనుగోలు చేసి, ఆయా స్వయం సహాయక సంఘాలకు అందిస్తాయి. వీటిని అద్దెకు ఇచ్చే సదుపాయం కూడా కల్పిస్తున్నారు.

**స్వయం సమృద్ధ భారత్**

ఈ పథకం కింద రూ.1 లక్షల కోట్లతో వ్యవసాయ మౌలిక సదుపాయాల నిధి ప్రారంభ మైంది. దీనికింద రూ. 32వేల కోట్ల విలువైన 42వేలకు పైగా ప్రాజెక్టులకు ఆమోదముద్రపడింది.

**ఇ-నామ్**

వినూత్న పంటల విక్రయ పథకమైన ఇ-నామ్ కింద వెయ్యి మండీలతో రెండు కోట్ల మంది రైతులను అనుసంధించారు. అటుపైన 2021-33లో కనీస మద్దతు ధర కింద రికార్డు స్థాయిలో రూ. 2.75 కోట్ల విలువైన కొనుగోళ్లు నమోదయ్యాయి,

**ప్రత్యామ్నాయ ఇంధనాల వృద్ధిలో గణనీయమైన విజయాలు**

పర్యావరణ మార్పులను దృష్టిలో పెట్టుకుని, వాటి దుష్పరిణామాలను తగ్గించేందుకు పర్యావరణ అనుకూల ఉత్పత్తులను తయారు చేసేందుకు హరిత ఇంధనంపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఇప్పటి వరకూ, శిలాజేతర ఇంధన ఆధారిత ఇంధన సామర్థ్యం 81 గిగావాట్ల నుంచి 188 గిగావాట్లకు పెరిగింది. ఇదే సమయంలో సౌర విద్యుత్ సామర్థ్యం 26 రెట్లు పెరగగా, పవన విద్యుత్ సామర్థ్యం రెట్టింపు అయింది. పునరుత్పాదక ఇంధన స్థాపిత సామర్థ్యంతో ప్రపంచంలోనే నాలుగవ స్థానానికి చేరుకోవడం విశేషం.

2030 నాటికి శిలాజేతర ఇంధనాల నుంచి 50 శాతం విద్యుత్ స్థాపిత సామర్థ్యాన్ని సాధించాలనే లక్ష్యం దిశగా ప్రభుత్వం పని చేస్తోంది. గత దశాబ్దంలో 11 సోలార్ పార్కులను నిర్మించగా, మరొక 9 పార్కుల పనులు సాగుతున్నాయి. అలాగే

# భారత్ ప్రయాణం

సోలార్ రూఫ్ టాప్ వ్యవస్థాపనల కోసం నూతన పథకానికి శ్రీకారం చుట్టారు. ఈ పథకం కింద కోటి కుటుంబాలకు సాయం అందించనున్నారు. దీనివల్ల ప్రజల విద్యుత్ బిల్లులు తగ్గడమే కాదు, మిగులు విద్యుత్‌ను కొనుగోలు చేయనున్నారు. కొత్తగా 10 అణు ఇంధన కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదించింది. ఉదజని ఇంధన రంగంలో భారత్ శరవేగంగా పురోగ మిస్తోంది. నేటివరకూ లద్దాఖ్, డామన్, దయ్యూలో రెండు ప్రాజెక్టులను ప్రారంభించారు.

ఇథనాల్ రంగంలో మా ప్రభుత్వం అపూర్వమైన కృషి చేసింది. దేశం 12 శాతం ఇథనాల్ బ్లెండింగ్ లక్ష్యాన్ని సాధించింది. 20 శాతం ఇథనాల్ బ్లెండింగ్ లక్ష్యాన్ని కూడా త్వరలోనే పూర్తి చేయనున్నారు. ఇది రైతుల ఆదాయాన్ని పెంచుతుంది. నేటివరకు ప్రభుత్వ కంపెనీలు లక్ష కోట్లకు పైగా విలువైన ఇథనాల్‌ను కొనుగోలు చేశాయి. ఈ చర్యలన్నీ ఇంధనం కోసం మనం విదేశాలపై ఆధారపడటం తగ్గించి, విదేశీ మారక నిల్వలను పెంచుతాయి.

**పన్నుల వ్యవస్థ సంస్కరణ - జీఎస్టీ (వస్తు సేవల పన్ను)**

జీఎస్టీ ప్రవేశపెట్టడానికి ముందు దేశంలో 440కిపైగా వివిధ శాతాలతో రకరకాల పన్నులు, సుంకాలు అమలవుతూ ఉండేవి. ఫలితంగా భారత అంతర్గత వాణిజ్యంలో స్వేచ్ఛ, ఐక్యత ఉండేవి కావు. జీఎస్టీ రూపేణా పన్నుల సంస్కరణ అమలుతో 29 రాష్ట్రాలు/ 7 కేంద్రపాలిత ప్రాంతాలు ఈ వ్యవస్థలో ఏకీకృతం చేశారు. దీనిద్వారా రాజకీయ ఏకాభిప్రాయ సాధన, ఉమ్మడి స్వతంత్ర అధికారం గల వస్తు సేవల పన్నుమండలి (జీఎస్టీ కౌన్సిల్) ఏర్పాటుతో కొత్త పన్ను వ్యవస్థ రూపొందింది.

కొవిడ్ -19 మహమ్మారి సమయంలో పన్ను శాతాలు తగ్గడంతోపాటు విస్తృత ఉపశమన చర్యలు చేపట్టినప్పటికీ 10.9 శాతం మేరకు పెరుగుదల నమోదైంది. దేశంలోని కుటుంబాలకు 2017 డిసెంబర్ నుంచి 2023 మార్చి మధ్య నెలకు దాదాపు రూ. 45,000 కోట్లు కావడంలో జీఎస్టీ తోడ్పడిందని గణాంకాలు పేర్కొంటున్నాయి. జీఎస్టీ ద్వారా నెలవారీ సగటు రాబడి 2018లో 90వేల కోట్లు కాగా, 2023-2024లో రూ.1.7 లక్షల కోట్లకు పెరిగింది.

ఈ పన్నులను రెండు యంత్రాంగాల ద్వారా రాష్ట్రాలకు నిధుల బదలీ చేయడం జరుగుతోంది. ఈ వ్యవస్థ సహకారాత్మక సమాఖ్య తత్వాన్ని ప్రోత్సహించడమే కాక సరళం, పారదర్శకం కావడంతో అవినీతిని, పన్ను ఎగవేతను నిరోధిస్తుంది.

**స్టార్ట్-అప్ ఇండియా (అంకుర భారత్)**

దేశంలో ఆవిష్కరణలు, అంకుర సంస్థలు, పెట్టుబడులను ప్రోత్సహించే బలమైన పర్యావరణ వ్యవస్థ సృష్టి లక్ష్యంగా 2016 జనవరి 16న స్టార్ట్-అప్ ఇండియా పథకాన్ని ప్రారంభించారు. భారతదేశ యువత కేవలం ఉద్యోగార్థులు కాకుండా ఉద్యోగ సృష్టికర్తలుగా రూపొందాలన్న లక్ష్యంతో దీనిని ప్రారంభించారు. కేవలం ఐదుగురికి ఉపాధి కల్పించగలది కూడా అంకుర సంస్థే, ఆ విధంగా దేశానికి అది ఎంతో గొప్ప సేవ అవుతుందంటూ ప్రధాని మోదీ పథకాన్ని ప్రారంభిస్తున్న సమయంలో వ్యాఖ్యానించారు.







ఈ క్రమంలో 2023 డిసెంబర్ వరకూ గుర్తింపు పొందిన 1.16 లక్షల అంకుర సంస్థలతో ప్రపంచంలో మూడో అతిపెద్ద అంకుర పర్యావరణ వ్యవస్థగా భారత్ ఆవిర్భవించింది. ఈ కార్యక్రమం ప్రారంభమైన తర్వాత 10 లక్షల ఉద్యోగాలు సృష్టి అయ్యాయి. నాస్కామ్ అధ్యయనం ప్రకారం, 2017-2021 మధ్య సాంకేతిక అంకుర సంస్థలు సృష్టించిన ప్రత్యక్ష -పరోక్ష ఉద్యోగాల సంఖ్య 23 లక్షలుగా ఉండడం గమనార్హం. దేశంలో నేడు యూనికార్న్‌ల సంఖ్య 115కు చేరగా, వీటి విలువ 350 బిలియన్ డాలర్లకు పైగా నమోదైంది. ప్రపంచంలోని ప్రతి 10 యూనికార్న్‌లలో ఒకటి భారత్‌లోనే రూపొందుతోంది. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) తొలిసారి ఒక ప్రైవేట్ రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించడం దేశంలోని ఉదారవాద అంకుర విధానానికి నిదర్శనం.

**ఆయుష్మాన్ భారత్**

రాంచీలో 2018 సెప్టెంబర్ 23న ప్రారంభమైన ఈ ప్రతిష్ఠాత్మక పథక లక్ష్యం సమాజంలోని చిట్టచివరి వ్యక్తి, కటిక పేదలు అనారోగ్యం పాలైతే తగిన చికిత్స పొందగలగడంతోపాటు అందరికీ మెరుగైన ఆరోగ్య సౌకర్యాలు లభింపచేయడం. గతంలో ప్రతి ఏటా 6-7 కోట్లమంది ప్రజలు చికిత్సకు భారీ ఖర్చు ఫలితంగా దారిద్ర్య రేఖ దిగువకు జారిపోయే దుస్థితి ఉండేది. అయితే, ప్రపంచంలోనే అత్యంత భారీ పథకం కింద నేడు రూ. 5లక్షల వరకూ ప్రభుత్వం ఉచిత ఆరోగ్య బీమా కల్పిస్తోంది. ప్రపంచంలో ఎక్కడా ఇలాంటి పథకాన్ని ప్రభుత్వ నిధులతో అమలు చేస్తున్న దాఖలాలు లేవు.

ఈ పథకం కింద కేన్సర్, గుండె జబ్బులు, మూత్రపిండ-కాలేయ వ్యాధులు, మధుమేహం సహా పలు వ్యాధులకు చికిత్స లభిస్తుంది. గ్రామీణ

ప్రాంతాల్లో 1.60 లక్షలకు పైగా ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య – శ్రేయో కేంద్రాలు నిర్మించారు. అలాగే దేశవ్యాప్తంగా 10వేల జన ఔషధి కేంద్రాలు ఏర్పాటు, వీటిద్వారా 90 శాతం మందులు చౌకగా లభిస్తాయి. ఈ విధంగా మందులు కొనుగోలు ద్వారా 3 కోట్ల మందికి నెలవారీ ఖర్చు ఆదా అయింది.

మిషన్ ఇంద్రధనుష్ ద్వారా 5.65 కోట్లమందికి పైగా తల్లులు –పిల్లలు టీకా రక్షణ పొందారు. కొవిడ్ సమయంలో దేశవ్యాప్తంగా 220 మిలియన్లకు పైగా కొవిడ్ టీకాలు ఇచ్చారు. దేశంలో 15 కొత్త ఎయిమ్స్ ఆసుపత్రులతో పాటు దాదాపు 300 కొత్త వైద్య కళాశాలలు ఏర్పాటవుతున్నాయి. 3.7 కోట్లకు పైగా డిజిటల్ ఆరోగ్య గుర్తింపు కార్డులు సృష్టించారు. ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ ద్వారా ఆరోగ్య రికార్డుల డిజిటలీకరణతో 25 కోట్లకు పైగా ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య ఖాతాలు జోడించారు.

దాదాపు 55 కోట్ల మంది పేదలు ఏటా రూ. 5 లక్షల దాకా ఉచిత చికిత్స పొందుతుండగా, ఆయుష్మాన్ భారత్ – ప్రధానమంత్రి జనారోగ్య యోజన కింద 28.3 కోట్ల ఆయుష్మాన్ కార్డులు జారీ అయ్యాయి. సుమారు 27,592 ఆసుపత్రులు ఈ పథకం కింద నమోదు కాగా, ఇప్పటివరకూ 6 కోట్లమంది ఈ పథకం ద్వారా చికిత్స పొందారు. ఈ పథకం లబ్ధికి అర్హతపై సమాచారమిచ్చే ఉచిత ఫోన్ నెంబర్ 14555.

**ప్రధానమంత్రి ఉజ్జ్వల యోజన**

కట్టెల పొయ్యిమీద వంట చేసే ఒక పేద తల్లి శరీరంలోకి ఒక రోజులో 400 సిగరెట్లు కాల్చినంత పొగ చేరుతుందని, ఇంట్లో ఉన్న పిల్లలు కూడా దీని బారిన పడతారని శాస్త్రవేత్తలు చెప్పిన మాటలను పరిగణనలోకి తీసుకుని, నిరుపేద మహిళలను ఈ బాధాకర జీవితం నుంచి విముక్తం చేయాల్సిన




బాధ్యత తన మీద ఉంది కనుక ఈ ఉజ్జ్వల పథకాన్ని చేపడుతున్నామంటూ మే1, 2016 న ప్రారంభిస్తూ ప్రధాని మోదీ ఇచ్చిన మాటను నిలుపుకున్నారు. దేశంలో 1955 నుంచి 2014వరకు14.52 కోట్లుగా ఉన్న గ్యాస్ కనెక్షన్లు ఉజ్జ్వల పథకం అమలులోకి వచ్చిన ఎనిమిదేళ్లలోపే 31.40 కోట్లకు పెరిగాయి. పొగరహిత వంటిల్లుపై కేంద్ర ప్రభుత్వ హామీ దాదాపు సంతృప్తి స్థాయికి చేరింది. సుమారు 10 కోట్ల కుటుంబాలకు గ్యాస్ కనెక్షన్లు కొత్తగా లభించాయి. దీనితో మహిళల స్వావలంబనకు, కుటుంబాల్లో విద్యకు తగినంత సమయం లభించింది. వంట చేసేందుకు బొగ్గు వినియోగం కారణంగా వచ్చే శ్వాసకోశ వ్యాధుల కేసులు 20 శాతం తగ్గాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థతో పాటు అంతర్జాతీయ ఇంధన సంస్థ నుంచి కూడా ఈ పథకం ప్రశంసలు అందుకుంది. అనేకదేశాలు భారత్ విజయం ఆదర్శంగా ఈ పథకాన్ని తమ దేశాల్లో అమలు చేశారు.




**బేటీ బచావో బేటీ పఢావో**

దేశంలో పరివర్తనకు తోడ్పడేలా బాలికల కోసం ఈ పథకాన్ని ప్రారంభించారు. ప్రసవం నుంచి పోషకాహారం, పాఠశాల, విద్య, ఉద్యోగం, సైన్యంలో ప్రవేశం, సేవ, వ్యవస్థాపన, కుటుంబ భద్రత వంటి అన్నింటిలోనూ మహిళలు పరిష్కారాలను కనుగొన్న సంగతి తెలిసిందే. దేశంలో 1876 నాటి తొలి జాతీయ జనగణన తర్వాత తొలిసారిగా ప్రతి 1,000 మంది పురుషులకు ప్రస్తుతం 1020 మహిళలు ఉన్నారని జాతీయ కుటుంబ ఆరోగ్య సంస్థ తేల్చింది.

బాలికల సామాజిక భద్రత కల్పన కోసం 2015లో 'సుకన్య సమృద్ధి యోజన' ప్రారంభమైంది.

ఉజ్జ్వల కొళాయి ద్వారా నీరు, స్వచ్ఛ భారత్, సౌభాగ్య వంటి సామాజిక భద్రత పథకాల ద్వారా మహిళల దైనందిన జీవిత కష్టాల నుంచి విముక్తి లభించింది. జమ్ము కశ్మీర్‌లో '35ఎ' ఆర్టికల్ రద్దుతో మహిళలకు ఆస్తి హక్కు కూడా లభించింది. ఇక త్రిపుల్ తలాక్ రద్దు వారి ఆత్మాభిమానాన్ని కాపాడింది. లోక్‌సభ శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే మహిళా రిజర్వేషన్ల చట్టానికి ఆమోద ముద్ర పడింది.

**సుకన్య సమృద్ధి యోజన**
**ఖాతాల సంఖ్య - 4 కోట్లు**

బేటీ బచావో బేటీ పఢావో – అమలుతో పాఠశాలల్లో 10 ఏళ్లు ఆ పై వయసున్న బాలికల సంఖ్య 15 శాతం పెరుగుదల.

2021–22లో ప్రాథమిక నుంచి ఉన్నత మాధ్యమిక విద్య దాక నమోదైన బాలికల సంఖ్య – 12.28 కోట్లు.

ఉన్నత విద్యకు నమోదైన బాలికల సంఖ్య 2.01 కోట్లు.


**ప్రధానమంత్రి ఆవాస్ యోజన**

దేశంలోని ప్రతి పేద పౌరుడూ ఆత్మగౌరవంతో తనదైన ఇంట్లో నివాసించాలనే లక్ష్యంతో ప్రధానమంత్రి ఆవాస్ యోజన ప్రవేశపెట్టారు. ఈ పథకం లబ్ధిదారులలో 70 శాతం మహిళలే.

**ప్రధానమంత్రి ముద్ర యోజన**

చిన్నపాటి వ్యాపారాలను చేసుకునేందుకు ఔత్సాహిక వ్యాపారులకు రూ.10 లక్షల వరకూ రుణాన్ని మంజూరు చేసేందుకు ఉద్దేశించిన ప్రధానమంత్రి ముద్ర యోజనలో రుణాన్ని పొందిన సంస్థలలో 68 శాతం మహిళలు నిర్వహించేవే ఉన్నాయి. దాదాపు 27 కోట్లమందికి పైగా మహిళలకు ముద్ర రుణం లభించింది. దేశవ్యాప్తంగా మహిళల యాజమాన్యంలోని సూక్ష్మం–చిన్న – మధ్య తరహా పరిశ్రమల సంఖ్య 84.07 లక్షలకు పెరిగింది. అంకుర సంస్థలను ప్రోత్సహించే మహానిధి (ఫండ్ ఆఫ్ ఫండ్స్) లోని మూలనిధి మొత్తంలో 10 శాతం మహిళలు నడిపే అంకురాలకు కేటాయించారు. ★

జూలై 7న జగన్నాథ రథయాత్ర



పురుషోత్తమ పురాధీశుడు జగన్నాథస్వామికి ఏటా ఆషాఢ శుద్ధ విదియ నాడు నిర్వహించే రథయాత్ర విశ్వవేడుక. వేటగాడి బాణప్రయోగంతో శ్రీకృష్ణ భగవానుడు అవతారసమాప్తి చేశాక, ఆయన ఆత్మస్వరూపమైన బ్రహ్మ పదార్థాన్ని ఇంద్రద్యుమ్నుడనే రాజు దారువిగ్రహంలో నిక్షిప్తం చేసి ప్రతిష్ఠించాడని, అలా జగన్నాథుడిని 'దారుబ్రహ్మ' అంటారని పురాణ కథనం. మోక్షదాయక క్షేత్రాలలో ఒకటిగా చెప్పే పూరి ప్రస్తావన విష్ణు, మత్స్య, వామన, స్కంద పురాణాలలో కనిపిస్తుంది. శ్రీక్షేత్రం, శంఖు, నీలాద్రి క్షేత్రాలు, పురుషోత్తమపురం, జగన్నాథపురం పేర్లతో ప్రసిద్ధమైన ఈ పుణ్యస్థలి బ్రిటిష్ పాలకుల హయాంలో 'పూరి'గా ప్రచారంలోకి వచ్చింది.

# జగన్నాయక జగన్నాథా! జయహో..

శతాబ్దాల క్రితం సముద్రంలో కొట్టుకు వచ్చిన దారువులతో ఇంద్రద్యుమ్న మహారాజు, బలభద్ర, సుభద్ర జగన్నాథ విగ్రహాలను తయారు చేయించారు. దేవశిల్పి విశ్వకర్మ మా(నవ)రు రూపంలో వచ్చి వాటిని రూపొందించి బ్రహ్మ పదార్థాన్ని నిక్షిప్తం చేశాడు. శ్రీకృష్ణుడి దివ్యదేహం దహనమప్పుడు అగ్ని సంస్కారం కాని నాభిని సముద్ర జలాల్లో వేయగా, అది నీలపు రాయిగా మారిందని, దానిని బ్రహ్మ పదార్థం అంటారని పురాణ కథనం.

జగన్నాథ ఆలయ ప్రధాన ద్వారానికి రెండు వైపులా రాతి సింహాలు ఉంటాయి. అక్కడి మూడు మండపాలను భోగ, నాట్య, జగన్మోహన మండ పాలుగా వ్యవహరిస్తారు. గర్భాలయాన్ని జగ్ మోహన్ అంటారు. జగన్నాథుడు అన్నాచెల్లెళ్లతో విప్పారిన కళ్లతో దర్శనమిస్తాడు. బలభద్రుడి విగ్రహం అయిదడుగుల అయిదంగుళాల ఎత్తుతో శ్వేత వర్ణంలో, సుభద్ర విగ్రహం అయిదడుగుల ఎత్తుతో పసుపురంగులో, జగన్నాథుని విగ్రహం అయి దడుగుల ఏడంగుళాల ఎత్తుతో నలుపురంగులో ప్రకాశిస్తుంటాయి. జగన్నాథుడు చక్రాల వంటి కళ్లతో కరుణను కురిపిస్తూ, ఆదరంతో అక్కున చేర్చుకునేలా చాచిన రెండు చేతులతో భరోసా ఇచ్చే భంగిమలో దర్శనమిస్తాడు. రథయాత్రకు రెండు రోజుల ముందు ఇచ్చే దర్శనాన్ని 'నవయవ్వన వేష' అంటారు. ఆషాఢ శుద్ధ ఏకాదశి నాడు రథంపై కొలువైన జగన్నాథ త్రయాన్ని విశేష నగలతో అలంకరించడాన్ని 'సునావేష' అంటారు. ఏ ఇతర క్షేత్రంలోనైనా స్వామివారి ఊరేగింపునకు శాశ్వత ప్రాతిపదికపై రథాలు వినియోగిస్తే పూరీలో అందుకు భిన్నంగా ఏటా కొత్తవి తయారవుతాయి.


బలభద్ర,సుభద్ర, జగన్నాథుల కోసం వరుసగా, ఎరుపుపై నీలం రంగు, ఎరుపుపై నలుపు రంగు, ఎరుపుపై పసుపు రంగుతో భాసిల్లేలా రథాలు సిద్ధం చేస్తారు. బలభద్రుని రథం (తాళధ్వజ) 44 అడుగుల ఎత్తుతో 14 చక్రాలు, సుభద్రాదేవి రథం (పద్మధ్వజ) 43 అడుగుల ఎత్తులో 12 చక్రాలు, జగన్నాథుడి రథం (నందిఘోష్) 45 అడుగుల ఎత్తుతో 16 చక్రాలు గలిగి ఉంటాయి.

ఏటా జరిగే డోలయాత్ర,ఝూలన్ యాత్ర, దమనక ఉత్సవం, పవిత్రోత్సవం తదితర 13 ఉత్సవాలలో ఆషాఢ (శుద్ధ విదియ) మాసంలో నిర్వహించే రథోత్సవం అత్యంత విశిష్టం, ప్రపంచం లోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైనది. ఆరోజు ఆ మూర్తిత్రయానికి ప్రత్యేకంగా ప్రభాత పూజలు నిర్వహించి, రథంపై చేరుస్తారు. ఈ ప్రక్రియను 'పహండీ' అంటారు. సవరతెగ రాజు విశ్వావసు వారసులు మాత్రమే ఈ విగ్రహాలను రథాలపైకి చేరుస్తారు. ఇంద్ర్యుమ్న మహారాజుకు ముందే విశ్వావసు రాజు జగన్నాథుడిని నీలమాధవస్వామి రూపంలో అర్చించాడని ఐతిహ్యం. పూరి మహారాజు తలపై కిరీటాన్ని తీసి నేలపై ఉంచి బంగారు చీపురుతో రథాలను శుభ్రపరచి మంచిగంధం నీటితో కడిగి, పూజాదికాలు నిర్వహించి, రథం తాడు (శంఖచూడనాథుడు) లాగడం ద్వారా యాత్రను ప్రారంభిస్తారు. రథాన్ని లాగేందుకు భక్తజన సందోహం పోటీ పడుతుంది. రథాన్ని లాగడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తారు. రథం తాడును స్పృశించినా, పాపాలు హరించి మోక్ష ప్రాప్తి కలుగుతుందని వారి విశ్వాసం. ఈ మూడు రథాలు సాయంత్రానికి గుడించా మందిరానికి చేరతాయి. 'యాత్ర'లో బలభద్రుని రథం ముందు భాగంలో, దాని వెంట సోదరి సుభద్ర రథం వెళుతుంటే జగన్నాథుడి తేరు వాటిని అనుసరిస్తుంది. ఇది. చెల్లెలిని సు'భద్రం'గా చూసుకోవాలన్న తత్వాన్ని బోధిస్తున్నట్లుంటుంది. గుడించా మందిరంలో పంచమినాడు జరిపే 'హోరా' (పంచమి) వేడుక చూసేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు వస్తారు. తొమ్మిది రోజుల తరువాత తిరుగు ప్రయాణం (బహుదాయాత్ర) ఘనంగా ఉంటుంది. జగన్నాత రథయాత్ర విశ్వవ్యాప్తమైంది. తొలిసారిగా 1967లో అమెరికాలోని శాన్ ఫ్రాన్సిస్కోలో జగన్నాథ రథయాత్ర జరిగింది. వందకు పైగా ప్రపంచ సుప్రసిద్ధ నగరాలలో ఏటా రథయాత్రలు కొనగసాగు తున్నాయి. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో పూరీ క్షేత్ర నమూనాలో జగన్నాథ ఆలయం కొలువుదీరింది.

**విశిష్ట ప్రసాదం**

పురుషోత్తమ క్షేత్రంలో ప్రసాదం సాక్షాత్తు శ్రీ మహాలక్ష్మీదేవి ఆధ్వర్యంలో తయారవుతుందని విశ్వాసం. జగన్నాథుడు నైవేద్య ప్రియుడు. నిత్యం 64 రకాల పిండివంటలను కట్టెలపొయ్యిల మీద మట్టి కుండలలోనే తయారు చేస్తారు. ఒకసారి వాడిని పాత్రను మరోసారి ఉపయోగించరు. కుండమీద కుండపెట్టి అన్నం వండడం, అన్ని పాత్రలలోని పదార్థం ఒకేలా ఉడకడం విశేషమే. అన్న పసాదాన్ని 'ఒబడా' అంటారు. దీనితో పాటు'శుష్క' ప్రసాదాన్ని చేస్తారు. దైవదర్శనానికి వచ్చే వారు అక్కడ స్వీకరించేది 'అన్న ప్రసాదం'కాగా, ఇళ్లకు తీసుకు వెళ్లేది శుష్క ప్రసాదం. దీనిని వితరణ చేసే ప్రదేశాన్ని 'ఆనంద్ బజార్'అంటారు. మహా ప్రసాద స్వీకరణలో అంటూ సొంటూ, 'ఎంగిలి' ప్రసక్తే ఉండదు. 'సర్వం జగన్నాథం' మాట అలానే పుట్టిందంటారు.

**'జగన్నాథస్వామి నయనపథగామి భవతు మే'**



డా॥ ఆరవల్లి జగన్నాథస్వామి
సీనియర్ జర్నలిస్ట్



అయోధ్యలో రామమందిరం నిర్మాణం, ప్రాణప్రతిష్ఠ, వేలాది భక్తులు తరలి వెళుతూ ఉండడం.. ఇవన్నీ చూస్తే నేనొక దివ్య స్వప్నాన్ని వీక్షించినట్టే ఉంది. ఇందుకు దేశంలో చాలామంది సంతోషించారు. అందులో నేనూ ఉన్నాను. కరసేవలో పాల్గొన్న నేను, ఆ వివాదాస్పద కట్టడం కూలడం కళ్లారా చూశాను. ఇప్పుడు ఆ స్థానంలో భవ్య మందిరం వెలియడం కూడా ఈ కళ్లతోనే చూసే అవకాశం నాకు వచ్చింది. ఆ విధంగా నేను ధన్యుడిని. ఈ సందర్భంలో ఆనాటి నా అనుభవం 'జాగృతి' పాఠకులతో పంచుకోవాలని ఈ నాలుగు మాటలు రాస్తున్నాను. నా పేరు చంద్రశేఖర్ వి.కె., సింహాద్రిపురం. పులివెందుల (కడప జిల్లా) స్వయం సేవకుడను. వీహెచ్‌పీ ద్వారా 'రామశిల', 'రామజ్యోతి' కార్యక్రమాల ద్వారా అయోధ్య చరిత్ర, ఘనత, ప్రాశస్త్యం భారతదేశంలోని గ్రామాలకు బాగా తెలిసింది. ఆ నేపథ్యంలోనే 1989లో కరసేవకు పిలుపు వచ్చినప్పుడు మా గ్రామం సింహాద్రిపురం నుండి 40 మందిని ప్రోత్సహించి, అందరితో కరసేవకు వెళ్లాను. దారంతా నిర్బంధమే. అయినా రాముడి పేరు తలుచుకుని ముందుకు అడుగువేశాం.

# అతడు 'ఆగ్రహించిన హిందువు'

పోలీసులు మమ్మల్ని కుహాజా జైలులో 14 రోజులు ఉంచారు. పోలీసుల చేతిలో, ఆ చలికాలంలో తిన్న దెబ్బలు చాలా ఘోరమైనవి. ఇక కర్ఫ్యూతో ఎదుర్కొన్న ఇక్కట్లు చెప్పనలవి కాదు. అయినా మళ్లీ 1992లో రెండవసారి కరసేవకు ఉద్యుక్తులమయ్యాం. 10 నెలలు గ్రామ గ్రామం తిరిగి సంఘ శాఖ ద్వారా రాత్రి వేళల్లో రైతులను యువకులను సంఘటితపరచి, ధైర్యం నింపి వెనుకడుగు వేయకూడదని నిశ్చయంతో నవంబరు 24న తిరుపతి నుండి రైలులో బయలుదేరాం. డిసెంబరు 6 కంటే 10 రోజుల ముందుగానే కరసేవకులు చేరి, అక్కడ పరిస్థితులను అంతా గమనించి పథక రచన చేశారు. ఉమాభారతి, సాధ్వి రితుంబర, ఎల్‌కె అద్వాని, వినయకటియార్ ఆయా సందర్భాలలో ఇచ్చిన ప్రసంగాలు ఎంతో ఉత్తేజకరంగా సాగాయి.

లాఠీచార్జిలు, కాల్పులు, హాహాకారాల నడుమ మాలో ఏదో తెలియని ఉద్వేగం నిండిపోయింది. ఆ క్షణంలోనే నా బనియన్ మీద 'ఐయామ్ యాంగ్రీ హిందూ' అని రాసుకున్నాను. అది పత్రికల వారిని బాగా ఆకర్షించింది. వారితో ముఖాముఖి సమావేశం జరిగింది. నా ఫోటో అన్ని పత్రికలలో, అంతర్జాతీయంగా ప్రచురితమైంది. అది నా జీవితంలో మరచిపోలేను. బాబరు కట్టడం ముందు నిలబడి తీయించుకున్న ఫోటో. కాబట్టి బాగా చర్చకు వచ్చింది. ఎందుకు హిందువు ఆగ్రహించవలసి వచ్చింది? అని. హిందూ సమాజంలో వచ్చిన మార్పునకు, చింతనలో కనిపించిన దూకుడుకు నిదర్శనంగా చాలా మంది వ్యాఖ్యానించారు.

ఇది చెప్పి ఆగిపోతే, ఆనాటి నా అయోధ్య యాత్ర పరిపూర్ణం కాదు. ఆ సమయంలో గ్రామస్తులు డిసెంబర్ 6న ఉదయం 9 గంటలకే కరసేవ మొదలుపెట్టారు. మధ్యాహ్నం 2 గంటలకు దిగ్విజయంగా పూర్తిచేశారు. అర్ధరాత్రి కట్టడం భూమి కింది భాగంలో తవ్వారు. అక్కడ ఒక గంట మొదలైన వస్తువులు దొరికాయి. నేను మరో నలుగురు గ్రామస్థులు లోపలనున్న రామలల్లాను స్వయంగా బయటకు తీసుకొచ్చాం. కరసేవకు పరాకాష్ఠ అనదగిన ఈ తవ్వకాన్ని నిర్వహించిన 17మంది కరసేవకుల చిత్రాలు హిందీ పత్రికల్లో వెలువడినాయి. తర్వాత రోజు కరసేవకులందరం కాశీ, మథుర, ఢిల్లీలలోని ఆర్ఎస్ఎస్ కార్యాలయాలను దర్శించి క్షేమంగా స్వగ్రామం చేరాం. మా గ్రామ ప్రజలు కూడా ఘనంగా సన్మానించారు.

2024 ఎన్నికల తరువాత అయోధ్య గురించి ఏవేవో వార్తలు వస్తున్నాయి. వాటిని నిజమని చెప్పడం సాధ్యం కాదు. ఒకటి వాస్తవం. ఇప్పుడు కరసేవకులు, గ్రామ ప్రజలు 30 సంవత్సరాల క్రితం జరిగిన ఆ చారిత్రక ఘట్టాన్ని కళ్లముందు కదులుతున్నదే అంటున్నారు. హిందువులు, నిజం చెప్పాలంటే ఆగ్రహించిన హిందువుల వీరత్వం ఎలాంటిదో మన తరం చూసిందని అనుకుంటున్నారు. ఒకటి మాత్రం నిజం. అయోధ్య హిందువును చైతన్య పరిచింది. మథుర శ్రీకృష్ణ 'కరసేవ', కాశీ శివ 'కరసేవ' ఎప్పుడని మా గ్రామ ప్రజలు ఎదురు చూడడానికి కారణం అదే. ఆ కరసేవలు కూడా తమ జీవితకాలంలోనే జరగాలని ఎదురు చూస్తున్నారు. వెయ్యి ఏండ్ల బానిసత్వం నుండి, మన పూర్వికులు చేసిన తప్పుల నుండి విముక్తమయితేనే భావితరాలకు, హిందూజాతికి మంచి జరుగుతుందని భావిస్తున్నాను. ఇంకా కాలం వృథా చేయరాదు. ఆ కరసేవకు యోచన చేయాలి. ★



చంద్రశేఖర్, 8088903668

# 'విదేశీ' హిజా

అది 90 శాతం ముస్లింలే ఉన్న దేశం. పేరు తజకిస్తాన్. చాలాకాలంగా అక్కడ అనధికారికంగా నిషేధంలో ఉన్న హిజాబ్ ధారణని ఆ దేశ పార్లమెంట్ కొద్దిరోజుల క్రితమే 'విదేశీ' అని ప్రకటిస్తూ చట్టం చేసింది. పార్లమెంట్ దిగువ సభ (మజ్లిసి నావోయాండగోన్) మే 8, 2024న, ఎగువ సభ (మజ్లిసి మిల్లి) జూన్ 19, 2024న హిజాబ్ ధారణని నిషేధిస్తూ తీసుకు వచ్చిన చట్టానికి ఆమోద ముద్ర వేశాయి. అంటే బక్రీద్ పండుగ ముగిసిన వెంటనే ఈ చర్య తీసుకున్నారు. తజికిస్తాన్ అధ్యక్షుడు ఎమోమాలీ రహమాన్ చిరకాలంగా వాదిస్తున్నట్టు హిజాబ్ ఇక అధికారికంగా విదేశీ వస్త్రధారణ. నిజానికి ఇంతవరకు అక్కడ అమలులో ఉన్న సెలవులు, ఉత్సవాల క్రమబద్ధీకరణ చట్టానికి సవరణే ఈ కొత్త చట్టం. పాత చట్టం జాతీయ సంస్కృతికి భిన్నమైన వస్త్రధారణని, అలాంటి వస్తువులను కొనడాన్ని నిషేధించింది. ఇప్పుడు హిజాబ్‌ను



ఏదైనా విపత్తును చావులతో తూకం వేసి చెబితే బాగా అర్థమవుతుంది. ఉదాహరణకి వాయు కాలుష్యం. ఈ కాలుష్యం 2021 సంవత్సరంలో ఎంత మంది

# బ్‌కు వీడ్కోలు

విదేశీ వస్త్రధారణగా చట్టం మేరకు చెప్పవచ్చు.

అలనాటి సోవియెట్ రష్యాలోని తజకిస్తాన్ ముస్లింలు అధికంగా ఉండే ప్రాంతం. ఎంతో వివాదాస్పదమంటూ మీడియా, అక్కడి కొన్ని మత ఛాందస సంస్థలు ఆరోపిస్తున్నప్పటికి ఆ దేశ పార్లమెంట్ హిజాబ్ ధారణను నిషేధించింది. ఆ చట్టం ప్రకారం అక్కడ హిజాబ్ ధారణతో పాటు సంప్రదాయ ముస్లిం వస్త్రధారణ కూడా రద్దు కాబోతున్నాయి. తజకిస్తాన్ ప్రస్తుతం తాలిబన్



పాలనలో ఉన్న అఫ్ఘానిస్తాన్ సరిహద్దు దేశమే. దేశంలో మత సంస్థల కారణంగానా లేదా, అఫ్ఘానిస్తాన్ కారణంగానా అంటే చెప్పలేం కానీ, ఈ తాజా బిల్లు అక్కడ కొంత అల్లకల్లోలం సృష్టించక మానదని విశ్లేషకులు అప్పుడే అంచనాకు వచ్చేశారు. 2015లో హిజాబ్‌కు వ్యతిరేకంగా, ముస్లిం సంప్రదాయ దుస్తులకు వ్యతిరేకంగా మొదలైన ఉద్యమానికి ఇది పరాకాష్ట. ఆనాడే, ఉద్యోగం చేసే మహిళలు పనిచేసే ప్రదేశాలలో హిజాబ్ ధరించరాదని ఆదేశాలు ఇచ్చారు. నిజానికి 2007లోనే విద్య మంత్రిత్వ శాఖ హిజాబ్ ధారణను అదుపు చేయాలని చూసింది. మొదట విద్యార్థినులకు ఈ నిబంధన వర్తింప చేశారు. తరువాత ఆ నిబంధన పరిధిలోకి ఉద్యోగినులను తెచ్చారు.

ఈద్ ఉల్ ఫిత్ర్, ఈద్ ఉల్ అధా సమయంలో పిల్లల వస్త్రధారణ, ఉత్సవాలను తజకిస్తాన్ పార్లమెంటు నిషేధించింది. ఈ చట్టాన్ని ఆ దేశ పార్లమెంట్ ఆమోదించిందని రేడియో యూరప్ కూడా ప్రకటించింది. పిల్లలకు ఇచ్చే సెలవుల మీద నిషేధం విధించడానికి కారణం సరైన విద్య, సంరక్షణ కోసమేనని అధికారుల వివరణను ఉటంకిస్తూ రేడియో ఒజోడి నివేదించింది. పార్లమెంట్ 18వ సమావేశాలలో అధ్యక్షుడు రహమాన్ ఇమోమెయిల్ నాయకత్వంలో సాంస్కృతిక ఆచారాలలో మార్పులు సూచిస్తూ చట్టంలో ఈ మార్పులు తెచ్చారు. ఇందులో పిల్లల పెంపకంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నిర్వహించవలసిన పాత్ర గురించి కూడా సూచనలు ఉన్నాయి. ఈ చట్టాన్ని ఉల్లంఘిస్తే పెద్ద మొత్తంలో జరిమానా విధిస్తారు. చట్టం ఉల్లంఘనతో ప్రమేయం ఉన్న మత గురువులైతే మరింత ఎక్కువ జరిమానా చెల్లించవలసి ఉంటుంది. ప్రభుత్వం అంచనా వేసినట్టుగానే ఈ చట్టం గురించి పెద్ద ఎత్తున చర్చ ఆరంభమైంది. కొందరు ఇస్లామిక్ పండితులు దీనిని ఖండించగా, అఫ్ఘాన్‌కు చెందిన కొందరు మత గురువులు దీనిపై జిహాద్‌కు పిలుపునిచ్చారు. తజకిస్తాన్ ఇటీవల కాలంలోనే స్థానీయత కలిగిన వస్త్రధారణను ప్రోత్సహిస్తున్నది. దీనిని జాతీయ వస్త్ర ధారణ అని కూడా పేర్కొంటున్నారు.

తజకిస్తాన్‌లో ఏర్పడిన సెక్యులర్ ప్రభుత్వ



రహమాన్

అధిపతి, అధ్యక్షుడు రహమాన్ ఆ దిశగా తీసుకుంటున్న చర్యలలో హిజాబ్ నిషేధం ఒకటి. తజకి సంస్కృతి పునరుద్ధరణ, బహిరంగ ప్రదేశాలలో మత చిహ్నాలు తక్కువగా కనిపించేటట్టు చేయడం ఆయన ఉద్దేశం. రహమాన్ పాలకుడిగా రికార్డు సృష్టించారు. మధ్య ఆసియాలోని తజకిస్తాన్ అధ్యక్షునిగా ఆయన మూడు దశాబ్దాలుగా పనిచేస్తున్నారు. మతం ఆధారంగా పనిచేసే రాజకీయ పక్షాలు అధికంగా ఉన్న ఆ ప్రాంతంలో ఒక పాలకుడు సెక్యులరిస్టు పాలన ఆధారంగా ఇంతకాలం కొనసాగడం ఇదే మొదటిసారి. రహమాన్ సోవియెట్ రష్యాలోనే తజకిస్తాన్ రిపబ్లిక్ డిప్యూటీగా పని చేశారు. 1991లో సోవియెట్ రష్యా పతనం తరువాత అంతర్యుద్ధం జరిగింది. అందులో సోవియెట్ సానుభూతిపరులు విజయం సాధించారు. ఈ వర్గానికి నాయకుడు రహమాన్. 1994 నుంచి అధికారంలో ఉన్నారు. 2016లో విశ్వాసం ఆధారంగా పనిచేసే పార్టీలను రాజ్యాంగ సవరణ ద్వారా ఆయన నిషేధించాడు. ★

# వాయు కాలుష్యంతో....



ఉసురు తీసిందో తెలిస్తే గుండెలు అవిసి పోతాయి. అక్షరాలా 81 లక్షల మందిని మింగింది. యునిసెఫ్ సాయంతో పనిచేసే హెల్త్ ఎఫెక్ట్స్ ఇనిస్టిట్యూట్ (అమెరికా) ఈ వివరాలు జూన్ 19న ప్రపంచం ముందు పెట్టింది. అత్యధిక జనాభా కలిగిన భారత్, చైనాల వాటా కూడా ఇందులో చాలా పెద్దది. ఆ కాలుష్యం బారినపడిన భారత్‌లో 21 లక్షలు, చైనాలో 23 లక్షల మంది చనిపోయారు. ఇది ప్రపంచంలో ఆ సంవత్సరం సంభవించిన మరణాలలో 12 శాతం.

వాయు కాలుష్యానికి గుర్తై భారత్‌లో మరణించిన ఐదేళ్లలోపు చిన్నారుల సంఖ్య 1,69,400. చిన్నారుల విషయంలో రెండోస్థానంలో ఉన్న దేశం నైజీరియా. అక్కడ 1,14,100 మంది వాయు కాలుష్యం బారిన పడ్డారు. పాకిస్తాన్‌లో 68,100, ఇథియోపియాలో 31,100, బంగ్లాదేశ్‌లో 19,100 మంది కూడా చనిపోయారు. వాయు కాలుష్యం ఐదేళ్ల లోపు పిల్లల మీద దారుణమైన ప్రభావాన్నే ఆ సంవత్సరం చూపించింది. పైన చెప్పిన సంఖ్య నేరుగా వాయు కాలుష్యంతో చనిపోయినవారు. అంతేకాదు, వాయు కాలుష్యంతో సంబంధం ఉన్న కారణాలతో ఏడు లక్షల మంది చనిపోయారు. వాయు కాలుష్యం తరువాత చిన్నారులను చంపుతున్నది పౌష్టికాహార లోపం. ఆ ఏడు లక్షల పిల్లలలో ఐదు లక్షల మంది ఇంటిలో మనకు తెలియకుండానే తయారయ్యే వాయు కాలుష్యానికి బలైనవారే. ఈ చావులు ఆఫ్రికా, ఆసియాలలోనే ఎక్కువ. అక్కడ వంటింట్లో నుంచి వచ్చే పొగ, కలుషిత ఇంధనం కారణమవుతున్నాయి.


ది స్టేట్ ఆఫ్ గ్లోబల్ ఎయిర్ 2024 ఇచ్చిన నివేదిక కలవరపెట్టేదే. దక్షిణ ఆసియాలో అధిక రక్తపోటు, ఆహార సమస్య, పొగాకుతో వ్యాధులతో చనిపోతున్న వారికంటే వాయు కాలుష్యంతో పోతున్నవారే ఎక్కువ. వాయు కాలుష్యం కారణంగా 2021లో సంభవించి నన్ని చావులు ఇంతకుముందెన్నడూ చరిత్ర చూడలేదు.

తమ మత విశ్వాసాలను భక్తిశ్రద్ధలతో పాటించడం సంగతి అటుంచి, ఆ విశ్వాసాల పేరుతో, వాటిని అడ్డం పెట్టుకుని మెజారిటీ ప్రజల మనోభావాలతో ఆటలాడడానికే మైనారిటీలు అధిక ప్రాముఖ్యం ఇస్తున్నట్టు భావించవలసిన పరిస్థితి దేశంలో ప్రబలింది. మైనారిటీలు తమ పండుగలను సంప్రదాయబద్ధంగా ఆనందోత్సాహాలతో జరుపుకోవడం కంటే, వాటి ద్వారా ఇతర మతాల వారితో కయ్యానికి కాలుదువ్వడానికి చూస్తున్న వాస్తవం, అందుకు రాజ్యాంగాన్ని ధిక్కరించడానికి కూడా వెనుకాడరన్న నిజం నానాటికీ బయటపడుతున్నది. తెలంగాణలోని మెదక్ పట్టణంలో  జూన్ 15న, అంటే బక్రీద్ పండుగకు రెండు రోజుల ముందు జరిగిన దుర్ఘటన, ఫలితంగా తరువాత రెండురోజులు కొనసాగిన ఉద్రిక్త వాతావరణం ఇందుకు రుజువుగా కనిపిస్తాయి. చిరకాలంగా బీఆర్ఎస్ ఆధిపత్యంలో ఉన్న మెదక్ లోక్‌సభ నియోజకవర్గం మొన్నటి ఎన్నికలలో బీజేపీ పరమైన తరువాతి పరిణామమిది. అందుకే అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఆ పరిణామాలతో మెదక్ పట్టణంలో 144 సెక్షన్ విధించవలసి వచ్చింది. హింసాత్మక ఘటనలు జరిగి 21 మందిని అరెస్టు చేయవలసి వచ్చింది. ఘటన జరగకుండా నిరోధించడంలో ఘోరంగా విఫలమైన స్థానిక పోలీసు యంత్రాంగం అరెస్టుల దగ్గర కూడా చట్టబద్ధంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించలేకపోయిందన్న విమర్శలు వెల్లువెత్తాయి. అయినా వీటి గురించి మీడియా వాస్తవాలు చెప్పకుండా ప్రజలను భ్రమలలో ఉంచుతున్నది.

# పండుగ మాటున మైనారి

మెదక్‌లో తలెత్తిన ఉద్రిక్తతలకు రెండు ఘటనలు కారణంగా కనిపిస్తున్నాయి. అవి– ఆ పట్టణంలోనే ఇంద్రపురి మిన్హాజ్ ఉల్ ఉలుమ్ మదర్సా దగ్గర జరిగిన ఘర్షణ, ఈ పట్టణ శివారు నర్సిఖేడ్‌లో అక్రమంగా తరలిస్తున్న గోవులను కసాయిల నుంచి రక్షించాలన్న ప్రయత్నంలో తలెత్తిన వివాదం. బక్రీద్ లేదా ఈద్ ఉల్ అధా కోసం గోసంతతిని బలి (ఖుర్బానీ) ఇచ్చేందుకు మైనారిటీలు, గోవును మాతగా పూజించే హిందువులు వాటిని విముక్తం చేయడానికి జరిపిన ప్రయత్నమే మెదక్ ఘర్షణకు మూలం. బక్రీద్‌కు ముందు రెండు రోజులు, తరువాత రెండు రోజులు మెదక్ పట్టణంలో జరిగిన పరిణామాలు ఆందోళన కలిగించేవే. ప్రస్తుతం అక్కడ ప్రశాంత వాతావరణం ఉన్నదని పోలీసులు, ప్రభుత్వం భావిస్తున్నప్పటికీ మైనారిటీ వర్గీయులు తమదైన వైఖరితో అశాంతికి బీజం వేసి పెట్టారనే చెప్పాలి. మెదక్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు నాయని ప్రసాద్‌లను పోలీసులు అరెస్టు చేయడం జనంలో ఆగ్రహావేశాలు వ్యక్తమయినాయి. ఎనిమిది మంది ముస్లింలను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

గడచిన రెండు దశాబ్దాలుగా మత ఘర్షణల జోలికి పోని మెదక్ ఇప్పుడు ఉద్రిక్త వాతావరణానికి గురైందని జిల్లా స్థాయి పోలీసు అధికారి ఒకరు చెప్పారు. అయితే ఇందుకు మూలం ఏమిటన్నదే అసలు ప్రశ్న. ఇన్ని అరెస్టులు, 144 సెక్షన్ విధింపు



సమాచారం ఎందుకు బయటకు రావడం లేదన్నదీ ప్రశ్నే. పోలీసుల నిర్లక్ష్యం, ఘర్షణ రేగిన తరువాత బుజ్జగింపు పార్టీలు ముస్లింల కొమ్ముకాయడం వంటి కారణాలతో వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. బక్రీద్ సందర్భంగా గోసంతతిని బలి చేయకుండా చూడాలని సాక్షాత్తు న్యాయస్థానాలు తాజాగా ఇచ్చిన ఆదేశాలను కూడా పోలీసులు, ముస్లింలు, రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం గాలికి వదిలేశాయి. పోలీసులు సకాలంలో కలగచేసుకుని ఉంటే ఓ హిందూ యువకుడికి కత్తిపోట్లు తప్పేవి. ఇంత జరిగినా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దీని గురించి ఎలాంటి ప్రత్యేక చర్యలు తీసుకోవడం లేదు.

మజ్లిస్ బచావో తెహ్రీక్ పార్టీ అధికార ప్రతినిధి అంజద్ ఉల్లాఖాన్ చేసిన ట్వీట్ మేరకు ఈ గొడవ 'బలి ఇవ్వడానికి పెద్ద సంఖ్యలో తెచ్చిన ఎద్దులను ఒక మదర్సాలో ఉంచగా, మధ్యాహ్నం (15వ తేదీ) మూడు గంటలకు ఆర్ఎస్ఎస్, బీజేపీ కార్యకర్తలు ఉద్రిక్త వాతావరణం సృష్టించా'రు. ఈ దాడికి అనుమతించిన పోలీసు యంత్రాంగం ఈ ఘర్షణకు బాధ్యత వహించాలని ఖాన్ ఆరోపించారు. ముఖ్యమంత్రిగా ఎనుముల రేవంత్ రెడ్డి పదవీ బాధ్యతలు స్వీకరించిన తరువాత మైనారిటీల మీద దాడులు చేయడానికి కొందరికి స్వేచ్ఛను కల్పించారని కూడా ఆరోపించారు. ఎడ్లను దాచిపెట్టారన్న ఆరోపణతో మదర్సా మీద దాడి చేసినప్పుడు, లేదా తరువాత ధర్నా చేసినప్పుడైనా ఆర్ఎస్ఎస్, బీజేపీ కార్యకర్తల మీద ఎందుకు చర్య తీసుకోలేదని ఖాన్ విమర్శించారు. ఆ సంస్థల కార్యకర్తలు ముస్లిం ఆస్తులను ధ్వంసం చేసి, ఏడుగురు ముస్లింలను గాయపరిచారని కూడా ఖాన్ చెబుతున్నారు. బక్రీద్ సందర్భంగా బలి ఇచ్చేందుకే మదర్సా యాజమాన్యం ఎద్దులను కొని తెచ్చిందని ఇండియా టుడే కూడా పేర్కొన్నది. ఈ వెబ్‌సైట్ ఇచ్చిన సమాచారం ప్రకారం బక్రీద్ సందర్భంగా చంపడానికి తెచ్చిన ఎద్దులను మదర్సాలో ఉంచడమే ఘర్షణకు దారి తీసిందని జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ బాలాస్వామి కూడా వెల్లడించారు. కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ ఈ అంశాన్ని మరింత స్పష్టంగానే వెల్లడించారు కూడా. ఇంద్రపురిలోని మిన్హాజ్ ఉల్ ఉలుమ్ మదర్సా ఖుర్బానీ ఏర్పాటు చేసిందని దీనిని ఆర్ఎస్ఎస్/హిందూ వాహిని ప్రతిఘటించిందనే అన్నారు. మరి గోవులను, గోసంతతిని చంపడం చట్ట విరుద్ధం అన్న అంశం గురించి, దానిని ఉల్లంఘించి మదర్సాలో గోసంతతిని దాచి ఉంచడం గురించి మజ్లిస్ బచావో తెహ్రీక్ పార్టీ అధికార ప్రతినిధి ఖాన్ ఎందుకు మాట్లాడరు? దాదాపు నలభయ్ ఎద్దులను మదర్సాలో ఉంచారని కొందరు చెబుతున్నారు. అన్ని ఒకేసారి అక్కడ ఎందుకు కనిపిస్తున్నాయని అంటే, మేత కోసమని యాజమాన్యం చెప్పడం హాస్యాస్పదమే. పైగా పచ్చి అబద్ధమని కూడా వెల్లడయింది. మెదక్ పట్టణ పోలీసు శాఖకు చెందిన ఒక ఉద్యోగి వివరణ ఇక్కడ గమనార్హం. ఆ వివరణ ప్రకారం: లోపల ఉన్న ఎద్దుల విడుదలకు మదర్సా ముందు మధ్యాహ్నం నిరసన మొదలయింది. నిరసనకారులు ప్రభుత్వ పశువైద్యుడిని తీసుకువచ్చి ఆయన ద్వారానే అక్కడ ఉన్నవన్నీ ఎద్దులని నిర్ధారణ చేయించుకున్నారు. అందులో ఎక్కువ ఎడ్ల వయసు రెండేళ్ల లోపు. అంటే చంపడానికి చట్టం అనుమతించని వయసులో ఉన్నాయి. వాటిని నిరసనకారులు తరలించారు. ఆ సాయంత్రమే మెదక్‌లోనే మరొకచోట ఇదే అంశం మీద ఘర్షణ జరిగింది.



# టీల ఉన్మాదం

ఆ సమయంలో మధ్యాహ్నం మదర్సా వద్ద జరిగిన ఘర్షణలో గాయపడిన నిర్వాహకులు, ఇతర ముస్లింలు కొందరు చికిత్స కోసం చేరిన ఆసుపత్రి మీద రాళ్ల దాడి చేశారు. ఈ ఘర్షణలో ఇద్దరు యువకులు కత్తిపోట్లకు గురయ్యారు. వీటన్నిటితో మరునాడు ఆదివారం బీజేపీ, ఇతర హిందూ సంస్థలు మెదక్ బంద్‌కు పిలుపునిచ్చాయి. ఇది విజయవంత మైంది.

కోడెలను గాని, దూడలను, గోవులను కాని చంపడం తెలంగాణలో 1977 నాటి చట్టం ప్రకారం నిషిద్ధం. ఈ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయడానికి చర్యలు తీసుకోవలసిందిగా జూన్, 2023 లోనే రాష్ట్ర హైకోర్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికీ, పోలీసు డైరెక్టర్ జనరల్‌ను ఆదేశించింది. కానీ కొందరు ఆరోపిస్తున్నట్టు తాము గోవులను చంపలేదని స్థానిక ముస్లింలు ఇప్పుడు వాదించారు.

మదర్సా ఘటన తరువాత మెదక్ శివారు నర్సిఖేడ్‌లో కూడా ఆవులను తరలిస్తున్నారన్న సమాచారంతో భారతీయ జనతా యువ మోర్చా అటు వెళ్లింది. గోవులను తరలించుకుపోతున్న వాహనాన్ని సభ్యులు నిలువరించడంతో గొడవ పెద్దదయింది. మొదట బాధ్యతా రహితంగా మాట్లాడినప్పటికీ తరువాత పరిస్థితి వేడెక్కడంతో పోలీసులు ఆవులను తమ అధీనంలోకి తీసుకున్నారు. ఈ దశలోనే యువమోర్చా సభ్యుడి మీద దాడి జరిగింది. దాడి చేసిన వారిపై చర్య చేయాలని కోరుతూ యువమోర్చా పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేసింది. దీనితో పట్టణంలోనే ఉద్రిక్త పరిస్థితులు తలెత్తి వ్యాపార సంస్థలన్నీ మూసివేశారు. రామదాస్ చౌరాస్తాలో 144వ సెక్షన్ విధించారు. పరిస్థితిని అదుపు చేయడానికి పోలీసులు లాఠీ చార్జి చేయవలసి వచ్చింది.

కాగా, ఈ ఘటనలో గాయపడిన ఇద్దరు యువకులను గోషామహల్ బీజేపీ శాసనసభ్యుడు రాజాసింగ్ పరామర్శించారు. సంగతి తెలిసి ముంబై నుంచి మెదక్ వస్తున్న రాజాసింగ్‌ను మొదట పోలీసులు అడ్డుకుని విమానాశ్రయం వద్దనే అరెస్టు చేయడం విశేషం. గోరక్షకుల మీద కొందరు మతోన్మాదులు కత్తులతో దాడి చేశారని ఆయన ఆరోపించారు.


హిందూ సంస్థలకు చెందిన స్థానికులు ఇచ్చిన వివరాలు కూడా పరిశీలించవలసి ఉంటుంది. చట్టాలను కాపాడాల్సిన బాధ్యత కలిగిన వారే నిర్లక్ష్యం వహించిన ఫలితంగానే మెదక్‌లో ఘర్షణ వాతావరణం నెలకొన్నదని వారి ఆరోపణ. మదర్సా ఘటన తరువాత జరిగిన పరిణామాలు ఇంకాస్త తీవ్రమైనవే అనుకోవాలి.

చట్టం ప్రకారం గోమాతలను వధించకూడదు, వాటిని కాపాడాలని పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోక పోగా 'మాకు ఇంకో పనేమీ లేదా' అంటూ బాధ్యతారహితంగా సమాధానం ఇవ్వడమే విచారకరం. ఈ సమాధానంతో గోరక్షకులు విస్తుపోయారు. ఇక చేసేదేమీ లేక గోరక్షకులే ప్రాణాలకు తెగించి కసాయిలు తరలిస్తున్న వాహనాల వద్దకు వెళ్లి నిబంధనల ప్రకారం వెళ్తున్నాయా లేదా అని నిలదీశారు. వెటర్నరీ డాక్టర్ ఇవ్వాల్సిన సర్టిఫికెట్ చూపమంటే, సరైన సమాధానం చెప్పకపోగా భౌతికదాడికి దిగింది కసాయి ముఠా. గోరక్షకులు ఆత్మరక్షణ చేసుకుంటూనే మళ్లీ పోలీసులకు విషయం అందించారు. తీరిగ్గా వచ్చిన పోలీసులు అప్పుడైనా చేసిందేమిటి? గోవులను కాపాడిన కార్యకర్తల పట్ల దురుసుగా ప్రవర్తించడం. లాఠీఛార్జి చెయ్యడం. కసాయి మూకలకే వత్తాసు పలకడం ఇంకా విచిత్రం. అటు పోలీసుల నుంచి ఇటు కసాయి మూకల నుంచి వచ్చిన ఎదురుదాడిని తట్టుకోవాల్సి వచ్చింది. కసాయిలను సమర్థించి నందుకు పోలీసులకు దక్కిన గౌరవం గురించి చెప్పుకోవాలి. అప్పటికే పట్టణంలో ఉన్న మరింతమంది కసాయిలను పోగు చేసి గోరక్షకుల మీద దాడి చెయ్యడమే కాకుండా పోలీసులనే దుర్భాషలాడారు. ఇదంతా వీడియోల సాక్షిగా ప్రపంచం చూసింది. అల్లరిమూక చేతిలో గాయపడ్డ గోరక్షక కార్యకర్తలను తోటి కార్యకర్తలే ఆసుపత్రిలో చేర్పించారు. ఆ వార్త సోషల్ మీడియాలో రావడంతో మెదక్ పట్టణంలోని గోమాత ప్రేమికులు పెద్ద ఎత్తున రావడంతో కసాయి మూక వెనుకడుగు వేసింది.

చట్ట ప్రకారం గోవులను, ఎద్దులను, దూడలను వధించకూడదని స్పష్టంగా ఉన్నా కూడా, దీనిపై ఫిర్యాదు చేసినా గోవులను పట్టపగలు విచ్చలవిడిగా తరలిస్తున్నా ఆపవల్సిన బాధ్యత కలిగిన పోలీసులు నిర్లక్ష్యం వహించారు. ఫలితంగా మెదక్ ప్రశాంతత కోల్పోయింది. కసాయి మూకలకు కొన్ని రాజకీయ పార్టీల అండదండలు వచ్చాయి. రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీ నాయకులు తెరవెనుక మద్దతుగా నిలపడ్డారు.

గాయపడ్డ కార్యకర్త అరుణ్‌ను మియాపూర్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రి చేర్చారు. మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్యే రాజాసింగ్ ఆయనను పరామర్శించి ధైర్యం చెప్పారు. అక్రమంగా అరెస్టయిన గోరక్షకులను జైలులో కలిసి సంఘీభావం ప్రకటించారు. ★

## కాంగ్రెస్ ఎమ్మెల్యే నిర్వాకం




కాంగ్రెస్ పార్టీలో ఉంటే, ఆ పార్టీ తరఫున శాసనసభ్యునిగా ఎన్నికైతే ఆ విషయాన్ని వెల్లడించడానికి కొన్ని పద్ధతులు ఉన్నాయా? ఆ పద్ధతులు హిందూ వ్యతిరేకమైనవే అయి ఉండాలా? తెలంగాణలో కాంగ్రెస్ ఎమ్మెల్యే ఒకరు చేసిన నిర్వాకం ఇలాంటి ప్రశ్నలకు తావిస్తున్నది. కాంగ్రెస్ ఎమ్మెల్యే కుంబం అనిల్‌కుమార్ రెడ్డి ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలియచేయడానికి వినూత్నమైన విధ్వంసకర పద్ధతిని అవలంబించారు. తరువాత ఆయన ఇందుకు క్షమాపణ చెప్పి ఉండవచ్చు. కానీ కాంగ్రెస్ నైజం హిందూ వ్యతిరేకత అన్నది మాత్రం ఇది తిరుగు లేకుండా రుజువు చేసింది. ఒక ఇస్లామిక్ కట్టడం నేపథ్యంగా ఉన్న బొమ్మలో ఆవును చిత్రించారు. నిజానికి అక్కడ గొర్రె ఉండాలి. కానీ ఆవును చిత్రించారు. ఇది పెద్ద ఎత్తున వివాదానికి దారి తీసింది. దీనితో ఎమ్మెల్యే వెంటనే సామాజిక మాధ్యమాల నుంచి దానిని తొలగించి, బేషరతుగా క్షమాపణ చెప్పారు. ఈ శుభాభినందనల పత్రం మీద కాంగ్రెస్ పెద్దల ఫోటోలు కూడా ఉన్నాయి. అయినా ఇంతవరకు దీని మీద స్పందన లేదు. ఖండన కూడా లేదు. ఈ గ్రీటింగ్ మీద రాజాసింగ్ తదితరులు మండిపడ్డారు. ★

**కథ**

"నీ కొడుకు అలకపాన్పు దిగాడా?" మధ్యాహ్నం డ్యూటీనుంచి వచ్చి షర్ట్ విప్పుతూ అడిగాడు రాఘవ. పశు సంవర్ధక శాఖలో పని చేస్తున్నాడు రాఘవ. "వాడ్నెందుకు సతాయిస్తారు?" అంది రజని.

"నీకూ నీ కొడుక్కీ సెంటిమెంట్స్ లేవా?" అన్నాడు నిరసనగా రాఘవ. "నా సెంటిమెంట్ నా కొడుకే.." అంది.

"బట్..నా సెంటిమెంట్ మా నాన్నే.." అన్నాడు.

"మీ నాన్నకేమయింది ఇప్పుడు? ఆయన పేరును మీరు నిలబెట్టారో లేదో కానీ వాడి తాత కామినేని వరదయ్య పేరు నిలబెట్టేది వాడే."అంది.

"ఇక్కడ ఉండి కూడా నిలబెట్టువచ్చు." అన్నాడు.

"ఏంటి నిలబెట్టేది? ఒక బోర్డు మీద మీ నాన్న పేరు రాసి నిలబెటితే చాలా?" అంది రజని.

"సర్లే.. ముందు వాడ్ని వచ్చి భోజనం చేయమను." అన్నాడు రాఘవ కొడుకు గదిలోకి చూస్తూ.

"ఎక్కడున్నాడు వాడు!? వాడి ఫ్రెండ్ సమీర్ వచ్చి తీసుకెళ్లాడు" చెప్పింది. లంచ్ చేశాక ఆఫీస్‌కు వెళ్లి వచ్చాడు. డిన్నర్ టైమ్ దాటాక కూడా రాలేదు వైష్ణవ్. రాఘవకి పక్క కుదరలేదు. భార్య మొబైల్ చేతికిస్తూ "ఎక్కడ తగలడ్డాడో వాడికి ఫోన్ చెయ్" అన్నాడు "మీ దగ్గర కూడా ఒక ఫోన్ ఉంది కదా చెయ్యండి.." అంది.

ఉడుక్కుంటూ చూశాడు. "చేశా.. వెధవ ఫోన్ లిఫ్ట్ చేయలేదు.." అన్నాడు. "మీ ఫోన్ లిఫ్ట్ చేయని వాడు నా ఫోన్ ఎందుకు చేస్తాడు?" అంది.

"ఇద్దరూ తోడు దొంగలే కదా" అన్నాడు.

"మమ్మల్ని నిందించడం మానేసి జరగాల్సింది చూడండి." అంది రజని. "ఏంటి చూసేది? మధ్యాహ్నం బ్యాంకికి వెళ్లాను. ఇంటి లోన్ వుంది కాబట్టి పది లక్షలకు మించి ఇవ్వలేను. అదీ హెడ్డాఫీస్ పర్మీషన్‌తోనే ఇవ్వాల్సి వస్తుందని మేనేజర్ చెప్పాడు." అన్నాడు.

"ఇది తెలిసే వాడు మీ నాన్నగారి భూమి అమ్మమనేది. వాడికి కావాల్సింది అరవై లక్షలు. అయినా మన తదనంతరం అది వాడికి దక్కాల్సిన ఆస్తే కదా. వాడి కెరీర్‌కు ఉపయోగపడితే మీకు అభ్యంతరం ఏంటి? "అంది రజని

"నా బాధ నీకు అర్థం కావడం లేదు రజనీ.." అన్నాడు. "సెంటిమెంట్స్ కడుపు నింపవండీ.." అంది.


"ఇంకా నాకు ఏడేళ్ల సర్వీస్ వుంది. రిటైరయ్యాక యాభై అరవై లక్షలకు పైగా వస్తుంది. ఆ డబ్బులన్నీ వాడికేగా" అన్నాడు రాఘవ.

"అయ్యోరు వచ్చేవరకూ అమావాస్య ఆగుతుందా? ఈ ఏడేళ్లపాటూ ఏదో ఒక పాతిక వేలతోనో, ముప్పై వేలతోనో వాడిని బతక మంటారా?" అంది కోపంగా. "ఉద్యోగం ఉన్న అమ్మాయిని చేసుకుంటే మరో పాతిక వేలు వస్తుంది. అవి చాలవా బతకడానికి" అన్నాడు. "పిచ్చిమా లోకం" గొణిగింది. ఆ రాత్రి వైష్ణవ్ ఇంటికి రాలేదు.

"మమ్మీ.. ఇంటికి రావాలని పించడం లేదు. సమీర్ రూంలోనే ఉన్నాను. నాలో నిమిష నిమిషానికి డిప్రెషన్ పెరిగి పోతుంది. నా కెరీర్ అగమ్య గోచరమైంది. మీరేమో పట్టించుకోరు."

కొడుకు పెట్టిన మెసేజ్ భర్తకు చూపించి "ఏదో ఒకటి చేయండి.." అంది. రాఘవకి నిద్రపట్టలేదు. కొడుకు మంకుపట్టు అతడిని అతలాకుతలం చేసింది. డ్యూటీకి సెలవు పెట్టి అక్కడికి సమీపంలో తన తండ్రి పొలం ఉన్న గ్రామానికి చేరుకున్నాడు. బైకుకు స్టాండ్ వేసి పొలంలో ఒక పక్కగా వేసి ఉన్న





# న్న పొలం

శరత్‌చంద్ర



చెప్టాపై కూర్చున్నాడు. కాస్త దూరంగా అమ్మా, నాన్న సమాధులు కనిపించాయి. చుట్టూ పచ్చటి పండ్లతోట. రమణే సాగుచేస్తున్నాడు. మధ్యలో కూరగాయల సాగు కూడా జరుగుతుంది. అప్రయత్నంగా ఏడుపు తన్నుకొచ్చింది. పసిపిల్లాడిలా ఏడవడం మొదలు పెట్టాడు. “నిన్ను పోగొట్టుకుంటున్నాను నాన్నా” పొలంలోని మట్టి పైకి తీసుకొని అంటున్నాడు. గాద్గదికమైంది రాఘవ స్వరం. వెనుక నుండి ఒక చెయ్యి అతని భుజంపై పడింది. ఎప్పుడొచ్చాడో రమణ.

‘‘ఏంటి రాఘవయ్యా ఏడుస్తున్నావ్’’ ఏమయింది? ఎప్పుడొచ్చావ్. ఫోన్ కూడా చెయ్యలేదే.” అడిగాడు ఆందోళనగా. అతడు వచ్చింది కూడా గమనించలేదు రాఘవ.

“ఏంలేదు రమణా..” అన్నాడు.

‘‘ఏంలేకుండానే ఎందుకు ఏడుస్తున్నావ్ చిన్నపిల్లాడిలా.” అడిగాడు. కాసేపు ఇద్దరి మధ్య మౌనం. మళ్లీ పొగిలి.. పొగిలి ఏడ్చాడు.

“మీ నాయన పోయినప్పుడు కూడా ఇంత ఏడవలేదబ్బా నువ్వు ఏం జరిగిందేంటి?” అడిగాడు.

“ఏం చెప్పాలి రమణా! ఈ భూమిలోనే మా నాన్నను చూసుకొని బతికేస్తుంటాను. ఇక ఇప్పుడు మా నాన్నకు నాకూ ‘బంధం’ శాశ్వతంగా తెగిపోతుంది.” చెప్పాడు. అర్థం కానట్టు చూశాడు రమణ. “మీ నాన్నతో బంధం పోవడం ఏంటి రాఘవయ్యా..?” అడిగాడు.

“నాకు మనసు ఎప్పుడు బాగో లేకున్నా ఈ పొలంలోకి వచ్చి కూర్చుంటే మనసు ప్రశాంతంగా ఉంటుంది కదా! ఇప్పుడు ఈ భూమి పరాధీనం అవుతుంది. అదిగో అమ్మానాన్న సమాధులను కూడా దున్ని పొలంలో కలిపేసుకుంటారేమో” అన్నాడు.

“అసలేమీ అర్థం కావడం లేదు రాఘవయ్యా..” అన్నాడు రమణ.

“మా నాన్న జ్ఞాపకాలకు ప్రతిరూపం ఈ భూమి. దీన్ని అమ్మేసి మా వాడ్ని విదేశాలకు పంపాలంట” చెప్పాడు రాఘవ

కాస్త అర్థం అయింది రమణకు. రాఘవ కొడుకు విదేశాల్లో చదవడం కోసం జి.ఆర్.ఎ. రాస్తున్న విషయం శ్రావణి ద్వారా తెలుసు రమణకి. “దానికి ఎందుకు రాఘవా అంత ఇదవుతున్నావు? అబ్బాయి విదేశాల్లో పైచదువులు చదివితే మంచిదేగా? అక్కడ మంచి జీతం వస్తుంది. జీవితం కూడా బాగుంటుంది కదా?” అన్నాడు రమణ.

“రమణా..నీకు గుర్తుందో లేదో! అప్పుడు మనం చిన్న పిల్లలం. ఈ పొలం ప్రభుత్వం నాన్నకిచ్చిన రోజు కొండలూ, గుట్టలు, పిచ్చిపొదలూ ఉండేవి. ఎందుకూ పనికి రాదనుకున్న ఈ నేలను చదును చేసేప్పుడు నాన్న చేతులు బొబ్బలు ఎక్కేవి. అమ్మే అన్నం కలిపి నాన్నకు పెట్టేది. అలాంటి ఈ పొలంలో నాన్న సిరులు పండించాడు. ఒక్కోసారి అతివృష్టి మరోసారి అనావృష్టి, ఫలసాయంతో సంబంధం లేకుండా నాన్న పొలాన్నే నమ్ముకున్నాడు. ఒడుదొడుకులతో సేద్యం నడిచేది. అయినా నాన్న సేద్యం వదలలేదు. ఆయన కష్టం ఆయన బిడ్డకు రాకూడదని నన్ను పట్నం పంపి చదివించాడు. ఏదో వానాకాలం చదువుతో గుమస్తా గిరి సాధించుకున్నాను. అమ్మ కాలం చేసింది. అమ్మ పొయ్యిందన్న దిగులుతో నాన్న మంచాన పడ్డాడు.

నాన్న కన్ను మూస్తూ “అరే రాఘవా.. ఎన్ని కష్టాలు వచ్చినా నీ కన్నతల్లి లాంటి ఈ భూమిని ఎప్పటికీ అమ్మవద్దు. నా ఆత్మ, మీ అమ్మ ఆత్మ ఈ భూమి చుట్టూనే తిరుగుతుంటుందని చెప్పాడు.

ఇప్పుడు ఈ భూమి అమ్మితే తప్ప వాడు విదేశాలకు వెళ్లడానికి నేను డబ్బు సమకూర్చలేను “చెప్పాడు.

రమణ ఏం మాట్లాడలేదు. రాఘవకొచ్చిన సంకట స్థితి కూడా అర్థమైంది. రాఘవ పొలం తన పొలంలో కలుపుకొని దారి వేసుకోవాలని సర్పంచి చెంగల్రాయుడి ఉద్దేశ్యం. రాఘవ ఇస్తే పక్కనే ఉన్న రమణ కూడా ఇస్తాడని పొంచులు వేసుకొని వున్నాడు.

చాలాసార్లు అడిగినా రాఘవ ఒప్పుకోలేదు. “మాకు ఈ పొలం సెంటిమెంట్ రాయుడుగారూ” అని తప్పుకొనేవాడు

చూస్తుండగానే పొలం ధర పెరిగింది. దగ్గర్లోనే కొత్తగా ఓడరేవు ఒకటి పడ్డంతో భూమి కోటి వరకు ధర పలుకుతుంది. ఇంకా పెరిగే అవకాశం కూడా ఉంది.

స్నేహితుడి భుజం మీద చెయ్యేసి “దిగులు పడకు రాఘవా? కావలిస్తే నా పొలం అమ్మి నీ కొడుకుని ఫారెన్ పంపుదాం.” చెప్పాడు. “నీ కూతురికి కట్నంగా ఇవ్వడానికేగా నీ పొలం అట్టిపెట్టుకున్నావ్..'' అన్నాడు. “పర్వాలేదు తీసుకో.. మీవాడు వెళ్లి సెటిల్ అయ్యాకే డబ్బు ఇవ్వు అన్నాడు.

“వద్దు రమణా.. త్యాగాలకు కూడా ఒక హద్దు ఉండాలి.” అన్నాడు. “రాఘవా.. నిజంగా నా పొలం మీద నాకే సెంటిమెంట్సూ లేవు. ఏదో ఉంది కదా అని నీ పొలంతో కలిపి సాగుచేస్తున్నాను. మీ నాయన నిన్ను బడిలోకి పంపితే మా నాయన నన్ను పొలం పనిలోకి పెట్టేసుకున్నాడు. అయినా అంతకు ముందున్న ఓపిక ఉండడం లేదు. మా అమ్మాయికి త్వరలో జాబ్ వస్తుంది. హైదరాబాద్ వెళ్లిపోవాలనుకుంటున్నాను. పిల్ల పెళ్లి సమయానికి ఉంటే డబ్బు సర్దు. వెంటనే ఇవ్వకపోయినా పర్వాలేదు. కట్నం తీసుకోని వ్యక్తినే అల్లుడిని చేసుకుంటాను.” చెప్పాడు.

“వద్దు రమణా. నీ పొలం కూడా మీ నాన్న జ్ఞాపకమే. నాకు బాగా గుర్తు. మీ నాన్నా మా నాన్న. ఇక్కడి బండల్ని చదును చేసి దుక్కి దున్ని నారు పోసి నీళ్లు పట్టారు. అందుబాటులో ట్రాక్టర్లు లేకపోయినా వాళ్లే కాడెద్దులుగా మారి పొలం దున్నారు. వాళ్ల చెలిమి చావు వరకూ సాగింది. మన చెలిమి కూడా ఈ భూమ్మీదే ఆధారపడివుంది. ఈ పొలం నువ్వు ఏ రాయుడుకో, రాజుగారికో అమ్మేస్తే ఇంత స్వేచ్ఛ పొలంలోకి రాలేవు.”చెప్పాడు

“వైష్ణవ్.. నీతో మాట్లాడాలి.” అంది శ్రావణి.

“చెప్పు..” అన్నాడు వైష్ణవ్.

"అరే! దద్యోజనం ఫోన్లో కాదు రా పర్సనల్గా కలుద్దాం." అంది శ్రావణి "నా బాధల్లో నేనున్నాను శ్రావణీ. నిన్ను కలిసే మూడ్‌లో నేను లేను.." అన్నాడు.

"నాకు అంతా తెలుసురా.. ఫారెన్‌లో పి.జి. చేయడానికి పొలం అమ్మి డబ్బులు ఇవ్వమన్నాటగా!" అడిగింది.

"ఓ సమాచారం చేరేశాడా! మా ఘనత వహించిన తండ్రిగారు.." అన్నాడు.

"పిచ్చోడా.. అయన్ని కామెంట్స్ చేసింది చాలు. ముందు ఒకసారి రా." అంది. కాదనలేక వెళ్లి కలిసాడు. ఇద్దరూ సిటీలోని ఒక కాఫీ హోటల్లో కలిసారు.

"నువ్వు అమ్మాలని కోరుకుంటున్న పొలం మీ నాన్న స్వార్జితం కాదు. అంటే మా తాత వరదయ్యది. మా నాన్న సాగుచేసే పొలం కూడా ఆయన స్వార్జితం కాదు అంటే మా తాత శంకరయ్యది. మీ నాన్నకు మీ తాతయ్య పొలం అమ్మడం ఇష్టం లేదని అర్థం అయ్యాక మా నాన్న పొలం అమ్మి డబ్బు నీకివ్వాలను కుంటున్నాడు?" అంది.

"మీ పొలం అమ్మి ఇవ్వడమేంటి? నాన్సెన్స్ కాకపోతే, తాతల ఆస్తులకు మనవళ్లే వారసులు. అమ్ముకోవడానికి నేను హక్కుదారుడిని కూడా.." అన్నాడు.

"నీది పిచ్చుక బ్రెయిన్ అని మరోసారి ప్రూవ్ అయ్యింది" అంది కోపంగా.

''సరే నాకు జ్ఞానాన్ని ఇవ్వు'' అన్నాడు వ్యంగ్యంగా.

"మీ నాన్నని నువ్వు అర్థం చేసుకున్నావో లేదో కానీ మా నాన్నని నేను బాగా అర్థం చేసుకున్నాను. మీ నాన్నకి గవర్నమెంట్ జాబ్ ఉంది. అది చాలు బతకడానికి. మా నాన్నకి ఏ జాబూ లేదు. తన పొలంతో పాటూ మీ పొలం కూడా కౌలుకి తీసుకొనే మా నాన్న వ్యవసాయం సాగించాడు. మీ నాన్నకున్న మరో సెంటిమెంట్ మరొకరికి కౌలుకివ్వకుండా మా నాన్నకే ఇవ్వడం. నాన్నకంటే ఎక్కువ కౌలు ఇస్తామన్నా రాఘవమామ ఒప్పుకోలేదు. "వద్దు. రమణ జీవనోపాధికి కూడా నా పొలం ఉపయోగ పడుతుంది. వాడు కౌలు సొమ్ము ఇవ్వకపోయినా ఫర్వాలేదు. నా భూమి రమణ సాగుబడిలోనే ఉంటుంది." అని తెగేసి ఊర్లో చాలా మందికి చెప్పాడట. మీ నాన్న స్నేహమాధుర్యం జీవితమంతా రుచి చూసిన నాన్న తాను ప్రాణంగా ప్రేమించిన భూమిని అమ్మి నిన్ను ఫారెన్ పంపించడానికి సిద్ధమయ్యాడు. నీకు తెలుసా.. రాఘవ మామ నీ కోసం పొలం అమ్మాలని డిసైడై పొలం చేజారి పోతుందన్న దుఃఖంతో మీ తాత సమాధి దగ్గర కూర్చుని పొగిలి పొగిలి ఏడ్చిన విషయాన్ని నాన్న అమ్మకు బాధ పడుతూ చెబుతుంటే విన్నాను. నాకే

"నువ్వు అమ్మాలని కోరుకుంటున్న పొలం మీ నాన్న స్వార్జితం కాదు. అంటే మీ తాత వరదయ్యది. మా నాన్న సాగుచేసే పొలం కూడా ఆయన స్వార్జితం కాదు అంటే మా తాత శంకరయ్యది. మీ నాన్నకు మీ తాతయ్య పొలం అమ్మడం ఇష్టం లేదని అర్థం అయ్యాక మా నాన్న పొలం అమ్మి డబ్బు నీకివ్వాలను కుంటున్నాడు ?"అంది. "మీ పొలం అమ్మి ఇవ్వడమేంటి? నాన్సెన్స్ కాకపోతే, తాతల ఆస్తులకు మనవళ్లే వారసులు. అమ్ముకోవడానికి నేను హక్కుదారుడిని కూడా.. "అన్నాడు.



కన్నీళ్లు ఆగలేదురా రాక్షసుడా?" అంది కోపంగా శ్రావణి.

వైష్ణవ్ శ్రావణిని అలాగే చూస్తుండిపోయాడు. "ఉన్న ఆ రెండు ఎకరాలు నాకు పసుపు కుంకాల కింద ఇవ్వాలని అనుకున్నాడు నాన్న. చూడు వైష్ణవ్! మా భూమి అమ్ముకొని నీ ఫిజియో థెరిఫీ కోర్సులో పి.జి చదువుకోవడానికి వెళ్లు. నా వెంటపడుతూ ఉంటావుగా నన్ను పెళ్లిచేసుకో నీ కోరిక కూడా తీరుతుంది. ఇన్నాళ్లు రిజక్ట్ చేసింది ఎందుకో తెలుసా? మన బతుకు తెరువులో వాళ్ల ఉప్పు కూడా ఉంది. మనం ఆ కుటుంబంకి బాధ కల్గించే పని చెయ్యవద్దు అని నాన్న చెప్పాడు. అందుకే నీకు దగ్గర కాలేదు.." చెప్పింది శ్రావణి.

వైష్ణవ్ నవ్వుతూ "అంతా ఒకే గానీ నిన్ను పెళ్లి చేసుకోమని ఆఫర్ ఇస్తున్నావ్ కదూ! అది బాగుంది. పిచ్చి మొద్దూ ఫారెన్ వెళ్లాలి అనుకుందే నిన్ను ఇంప్రెస్ చెయ్యడానికి, నువ్వు రెండు మూడుసార్లు అన్నావ్ కదా? నేను ఎన్.ఆర్.ఐ. సంబంధం చేసు కుంటానని. ఎన్.ఆర్.ఐ.గా మారి డబ్బు సంపాదించి నిన్ను ఇంప్రెస్ చెయ్యాలి అనుకున్నా. నాన్నకు ఈ భూమిపోతే ఇంకా మంచి భూమి మరో నాలుగు ఎకరాలు కొనివ్వాలి అనుకున్నా. నాన్నకు తాతయ్య పొలం పైన ఇంత ఎమోషనల్ అటాచ్‌మెంట్ ఉంది అనుకోలేదు. బట్ నువ్వు గ్రేట్. నీలా ఆలోచించలేని నా మరుగుజ్జు తనంపై నాకే జాలిగా వుంది శ్రావ్." అని పైకి లేస్తూ "వన్ కండీషన్ మన తాతయ్యల పొలం మనం ఎప్పటికీ అమ్మకూడదు. భవిష్యత్తులో మన పిల్లలకోసం కూడా" అన్నాడు వైష్ణవ్. అక్కడ జనం ఉన్నారని కూడా చూడలేదు శ్రావణి వైష్ణవిని హగ్ చేసుకుంది.

ప్రక్క రోజు బయట ఉన్న భర్తకి రజని ఫోన్ చేసింది "ఏమయ్యోయ్. వీడి కూడా మీకులాపిచ్చి మాలోకమే. పై చదువుల కోసం ఫారెన్ వెళ్లడట. బడుద్దాయ్ నిన్నటి వరకూ ప్రాణాలు తీశాడు." అంది కోపంగా, మళ్లీ తనే "ఇక్కడే ఫిజియో థెరపీ కోసం హాస్పెటల్ పెట్టి వైద్య సేవలు కూడా చేస్తాడట. అంతటితో ఆగకుండా, వ్యవసాయం కూడా చేస్తాడట. పైగా రమణ మామ భూమి కూడా మనదే కదా అంటున్నాడు. వీడేదేదో మాట్లాడుతున్నాడు దెయ్యం పట్టిందేమో మీరు రండి.." చెప్పింది రజని.

సరిగ్గా ఆ సమయంలో సర్పంచ్ రాయుడు ఇంట్లో ఉన్నారు రమణ, రాఘవ. "సారీ సర్పంచ్ గారూ.. మా రమణ భూమి అమ్మడం లేదు.." చెప్పాడు రాఘవ.

రాయుడు తెల్లమొఖం వేశాడు. ఆ రోజు ఉదయం తండ్రి దగ్గరకు వచ్చి "నేను శ్రావణిని పెళ్లి చేసుకుంటాను నాన్నా." అన్నాడు వైష్ణవ్.

ముందు రాఘవకు అర్థం కాలేదు అర్థమయ్యాక ఆ విషయం రమణకి చెప్పడం అతడు సంతోషంగా. "నా కూతురికేగా ఆ భూమి ఇచ్చేది అమ్మి నా అల్లుడ్ని నేనే ఫారెన్ పంపిస్తా.." చెప్పాడు.

రమణ భూమి అమ్మడం ఇష్టం లేకపోయినా అతడి బలవంతం మీదే సర్పంచి గడప తొక్కాడు రాఘవ. ఇప్పుడు భార్య రజని ఫోన్లో మాట్లాడిన విషయం రమణకు చెప్పాడు రాఘవ. వాళ్లు ఆలోచనల్లో ఉండగానే శ్రావణి ఫోన్ చేసింది.

"ఏంటమ్మా.. వైష్ణవ్ ఇక్కడే ప్రాక్టీస్ పెడుతాను అన్నాడట. ఇక్కడేం ప్రాక్టీస్ జరుగుతుంది" అడిగాడు రమణ.

"ఆ విషయం తర్వాత మాట్లాడదాం నాన్నా ముందు మీకో ముఖ్య విషయం చెప్పడానికే కాల్ చేశాను. సర్పంచ్ కూతురు రాగిణి నా క్లాస్‌మేట్. ఇప్పుడు తనే కాల్ చేసింది మీరు అక్కడ ఉన్నారట కదా? మీ కాబోయే అల్లుడు వైష్ణవ్ మీకో విషయం చెప్పమన్నాడు. "అంది. "ఏంటమ్మా.." అడిగాడు. "మన పూర్వికులైన తాతయ్యల భూమి ఎప్పటికీ అమ్మ కూడదు అని ఆంక్షలు పెట్టాడు. ఆ మేరకు మాకు మధ్య ఒప్పందం కూడా కుదిరింది" చెప్పింది.

రమణ ఫోన్ స్పీకర్ ఆన్ చేయడంతో అవాక్కై విన్నాడు రాఘవ.

వచ్చేవారం కథ..
**సమర్థ**
–సుజాతా ప్రసాద్





# 'స్ఫూర్తి'దాయకంగా సుకన్య సమృద్ధి యోజన కార్యక్రమం



**హైదరాబాద్:** తమ లక్ష్యాన్ని సాధించిన తర్వాత సమాజానికి తిరిగి ఇవ్వడం బాధ్యతగా భావించిన యూపీఎస్సీ-2024 పరీక్షలలో విజయం సాధించిన తెలుగు రాష్ట్రాల యువత తమకు సన్మానాల రూపంలో అందిన కానుకలను పేద, బలహీన వర్గాలకు చెందిన బాలికల భవిష్యత్తు కోసం వెచ్చించాలని నిర్ణయించారు. వంద మంది బాలికల పేరిట 'సుకన్య సమృద్ధి యోజన' ఖాతాలు తెరిచి తమ పెద్ద మనసును, నిబద్ధతను చాటుకున్నారు. హైదరాబాద్ పోస్ట్‌మాస్టర్ జనరల్ వారి ఉదాత్తతను అభినందిస్తూ, కొత్తగా ఎంపికైన సివిల్ సర్వెంట్ల ద్వారా ఉస్మానియా యూనివర్సిటీలోని తపాలా ప్రాంతీయ కార్యాలయంలో జూన్ 22న పేద బాలికలకు పాస్‌బుక్‌లను, క్యూఆర్ కార్డులను అందచేశారు.

'కొద్దిగా ఆదా చేయండి – భారీ కలలు కనండి – బాలికల శక్తిని పెంచిపోషించండి' అనే నినాదంతో 'స్ఫూర్తి' పేరిట నిర్వహించిన కార్యక్రమం జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైంది. పోస్ట్‌మాస్టర్ జనరల్ టి.ఎం. శ్రీలత స్వాగతోపన్యాసం చేస్తూ, ఆరోగ్యవంతమైన, సుస్థిర, వికసిత సమాజ స్థాపనలో మహిళల భాగస్వామ్యం కూడా సమానంగా ఉండాలన్నారు. ఆ లక్ష్యంతోనే కేంద్ర ప్రభుత్వం 'బేటీ బచావో, బేటీ పఢావో' అనే విస్తృత పథకం ప్రవేశపెట్టిందని, ఇందులో భాగంగా బాలికలకు సామాజిక భద్రత కల్పన కోసం 'సుకన్య సమృద్ధి యోజన' ను 2015లో ప్రారంభించిందని శ్రీలత వివరించారు. అతితక్కువ పొదుపుతో అత్యధిక వడ్డీ రేటును పొందేందుకు మార్గమిదేనని అన్నారు. బాలికకు 15 ఏళ్లు వచ్చే వరకు నెలకు వెయ్యి రూపాయలు ఆమె పేరుతో సుకన్య యోజన ఖాతాలో వేయడం ద్వారా మొత్తం ఎనిమిది లక్షల రూపాయలను పొందవచ్చుని, ఈ పథకం కేవలం ఆర్థిక భద్రతను కల్పించడమేకాక బాలికల ఆకాంక్షలను నెరవేర్చేందుకు తోడ్పడుతుందన్నారు. పోస్టల్ ఎల్ఐసి పాలసీని తీసుకోవడంలో గల ప్రయోజనాలను ఆమె వివరిస్తూ, దళారుల ప్రమేయం లేకపోవడం వల్ల రిటర్న్‌లు అధికంగా ఉంటాయని, కేవలం రూ.3,500 కట్టి కూడా పాలసీ తీసుకోవచ్చున్నారు.

ముఖ్య అతిథి, ఐఆర్ఎస్ అధికారి నరసింహారెడ్డి మాట్లాడుతూ ఇక్కడకు తమ పిల్లలను తీసుకువచ్చిన తల్లిదండ్రులకు, వారి ఆకాంక్షలను నెరవేర్చే అవకాశం ఉందంటూ, వారిని ఆకాంక్షల దిశగా ప్రోత్సహించాలని ఉద్బోధించారు.




సివిల్ సర్వీసెస్-2024లో మూడవ ర్యాంకు విజేత అనన్యారెడ్డి మాట్లాడుతూ ఎటువంటి ఆర్థిక ఇబ్బందులు ఎదురవకుండా ఒక ఆశాకిరణం ఈ సుకన్య సమృద్ధి యోజన అని అన్నారు. ఈ పథకం ఇంతై ఇంతింతై అన్నట్టుగా ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

మరొక ఐఆర్ఎస్ అధికారి చందన జాహ్నవి మాట్లాడుతూ సివిల్ సర్వెంట్‌లు తమ ఆకాంక్షలను నెరవేర్చుకోవడమే కాదు, ఇతరులు కూడా ఆశలను నెరవేర్చుకునేలా వారు ప్రేరణను ఇస్తారని ఆశిస్తున్నాని అన్నారు.

దేశవ్యాప్తంగా 1లక్ష 50వేలకు పైగా తపాలా కార్యాలయాలతో 150 సంవత్సరాలుగా సేవలను అందిస్తున్న తపాలా శాఖ సమాచార మంత్రిత్వ శాఖ పరిధిలో పని చేస్తుంది. కేవలం ఉత్తరాలను బట్వాడా చేయడమే కాక దేశ సామాజిక, ఆర్థికాభివృద్ధిలో ఆర్థిక సేవలు, రిటైల్ సేవలతో కీలక పాత్రను పోషిస్తుంది. ఇవే కాక పొదుపు ఖాతాలు, రికరింగ్ డిపాజిట్లు, ఫిక్సడ్ డిపాజిట్లు, పోస్టల్ జీవిత బీమా వంటి సేవలను గ్రామీణ, పట్టణ ప్రాంతాలలోని కోట్లాదిమందికి తపాలా శాఖ అందిస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా ఈ వివరాలన్నింటినీ తెలిపే క్లుప్త వీడియోషోలను ప్రదర్శించారు. వివిధ శాఖలకు, స్థాయిలకు చెందిన తపాలా విభాగం అధికారులు కూడా ఇందులో పాల్గొన్నారు. నూతనంగా ఎంపికైన ఐఆర్ఎస్ అధికారి ఎస్ కిరణ్ వందన సమర్పణ చేస్తూ అక్కడికి వచ్చిన బాలికలకు బంగారు భవిష్యత్తును ఆకాంక్షించారు. జాతీయ గీతాలాపనతో కార్యక్రమం ముగిసింది. ★

# ఉద్యోగాలు కాదు.. స్వయం ఉపాధి ముఖ్యం

**భాగ్యనగర్ :** కేవలం ప్రభుత్వ ఉద్యోగాలపైనే ఆధారపడకుండా, స్వయం ఉపాధి పథకాలపై దృష్టి సారించాలని, ఉద్యోగం చేసే స్థాయి నుంచి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని స్వదేశీ స్వావలంబి సభలో పలువురు ప్రముఖులు సూచించారు. యువత సామాజిక మాధ్యమాలకు అలవాటు పడి సమయాన్ని వృథా చేస్తున్నారని, ఈ తీరు మారాలని హితవు చెప్పారు.

హైదరాబాద్ నారాయణగూడలోని కేశవ మెమోరియల్ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో జూన్ 23న స్వదేశీ స్వావలంబి రాష్ట్ర సభ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలంగాణ ప్రాంత కార్యకారిణి సదస్యులు అన్నదానం సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, భారతదేశంలో స్వదేశీ జాగరణ మంచ్ ప్రాముఖ్యం తెలుపుతూ, స్వదేశీ పరిజ్ఞానంతో ప్రపంచంలో కొవిడ్ టీకా ఏ స్థాయికి వెళ్లిందో వివరించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి






మాట్లాడుతూ,ఎక్కువమందికి, ముఖ్యంగా గ్రామీణప్రాంతాలలో ఉపాధి అవకాశాలు మెరుగుపడేందుకు చిన్న తరహా, సూక్ష్మతరహా పరిశ్రమలు ఏర్పాటు కావలసి ఉందని, అందుకు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సినీరచయిత రాజ్యసభ సభ్యులు విజయేంద్రప్రసాద్ మాట్లాడుతూ, విద్యార్థి దశ నుంచే ఆర్జించే పద్ధతి అలవడాలని అన్నారు.

అఖిల భారత స్వదేశీ జాగరణ మంచ్ కన్వీనర్ ఆర్. సుందరం మాట్లాడుతూ , జపాన్, చైనాలకంటే ఉపాధి కల్పనా రంగంలో భారత్ ముందుందని మూడు సంవత్సరాల క్రితమే స్వదేశీ జాగరణ మంచ్ స్వావలంబ భారత్ అభియాన్ కార్యక్రమం తీసుకోవడమే అందుకు ఉదాహరణ అన్నారు. జనాభా పెరుగుదల అభివృద్ధి నిరోధం కాదని, జనాభా ఎక్కువ ఉన్నా ఉపాధికి కొదవ ఉండదనేందుకు ఆధారాలున్నాయని తెలిపారు. 1905లో స్వదేశీ విద్యపై సమాలోచనలు జరిగాయని, బాలగంగాధర్ తిలక్, వీర సావర్కర్ లాంటివారు స్వదేశీ ఉద్యమాలకు మూలకారకులని తెలిపారు. దీనదయాళ్ ఉపాధ్యాయ, దత్తోపంత్ ఠేంగ్డీ బాధ్యతలు తీసుకుని స్వదేశీ భావనను ముందుకు తీసుకెళ్లారన్నారు.

పద్మశ్రీ అవార్డు గ్రహీత, ఆసు యంత్రం సృష్టికర్త చింతకింది మల్లేశం మాట్లాడుతూ ఉద్యోగం పొందడం కంటే ఉపాధి చూపించే పారిశ్రామికవేత్తగా వ్యాపారస్తులుగా ఎదగడమే అసలైన ఆర్థిక స్వావలంబన అని అన్నారు. ఆ లక్ష్యంతోనే ఏడేళ్లు కష్టపడి చేనేతల కోసం 'ఆసు'యంత్రం తయారు చేసినట్లు చెప్పారు. తన తల్లి కష్టం చూడలేక 1992లో తయారు చేసిన ఈ యంత్రం ప్రస్తుతం ఎందరికో ఆలంబన అయిందని చెప్పారు.

అఖిల భారత సంఘర్షణవాహిని ప్రముఖ్ శంకర్ పాణిగ్రాహి తన ప్రసంగంలో, దేశ ఆర్థికసమృద్ధికి ఎందరో మహానుభావులు కృషి చేశారని అందులో శ్యామా ప్రసాద్‌ముఖర్జీ ముఖ్యులని తెలిపారు. ప్రస్తుతం స్వదేశీవ్యవస్థలో జిందాల్, రిలయన్స్, టాటాగ్రూప్స్‌ల సహకారంతో శక్తి ఉత్పాదనలో ఎంతో శక్తివంతంగా ఏర్పడ్డామని తెలిపారు. జపాన్ దేశం హిరోషిమా, నాగసాకిల దుర్ఘటనల తర్వాత మళ్లీ నిలదొక్కుకుందంటే కేవలం దేశభక్తితోనేనని దత్తపంత్ ఠేంగ్డీ ఆనాడే తెలిపా రన్నారు. లిజ్జత్‌పాపడ్ యాజమాన్యం రూ. 16వేల కోట్ల వార్షిక టర్నోవర్‌తో 60వేలమందికి ఉపాధిని కల్పించి అగ్రగామిగా నిలిచిందని, భాష, స్వదేశీ వస్తు వాడకం ద్వారానే దేశాభివృద్ధి జరుగుతుందని అన్నారు.

స్వదేశీ జాగరణ మంచ్ దక్షిణ మధ్య క్షేత్ర సంయోజక్ జగదీశ్ మాట్లాడుతూ, దేశంలో 3.2 కోట్ల ప్రభుత్వ ఉద్యోగులు, 4.5 కోట్ల ప్రైవేటు రంగ ఉద్యోగులు ఉన్నారని 45 శాతానికి పైగా వ్యవసాయ రంగంలో, 14 శాతం చిన్న చిన్న వ్యాపారాల్లో ఉన్నారని అన్నారు. నైపుణ్యం ఉంటే దేనిని సాధించవచ్చునని తెలియజేస్తూ ఇంటింటికి బట్టలమ్మిన ఎనిమిదో తరగతి విద్యార్థి ధీరుబాయ్ అంబానీ ఆ కుటుంబం దేశాభివృద్ధికి ఎలా కీలకమయ్యారోఉదాహరణగా చూడాలని అన్నారు.

సేవాభారతి డైరెక్టర్ (వైద్యం, స్కిల్ డెవలప్‌మెంట్) కుల్దీప్ సక్సేనా మాట్లాడుతూ, ఈ జీడీఏ ప్రోగ్రామ్ ద్వారా నర్సింగ్ అసిస్టెంట్స్‌గా అనేక కార్పొరేట్ ఆసుపత్రులలో వైద్యసేవలు అందించటంలో ప్రత్యేక శిక్షణ పొందారని చెప్పారు. ఇప్పటికే సుమారు 550 మంది మహిళలు ఉపాధి కూడా పొందారని వివరించారు. సేంద్రియ వ్యవసాయ విధానంలో ఒకే పంటతో కాకుండా పలు రకాల పంటలతో పండిస్తే వ్యవసాయరంగం బాగుపడుతుందని, గో ఆధారిత సేంద్రియ వ్యవసాయం అతిముఖ్యమైనదని అన్నారు.

అనంతరం స్వదేశీ కార్యకర్తలతో స్వావలంబి భారత్ అభియాన్ కార్యక్రమ సరళిపై ప్రశ్నోత్తరాలతో చర్చా కార్యక్రమాన్ని క్షేత్రప్రచారక్ భరత్‌కుమార్ నిర్వహించారు. భారతీయ మజ్దూర్‌సంఘ్, భారతీయ కిసాన్‌సంఘ్, అఖిల భారతీయ విద్యార్థిపరిషత్, సహకారభారతి, వనవాసికల్యాణాశ్రమ్, బి యస్ఎఫ్, లఘు ఉద్యోగభారతి, సేవికా సమితి, హిందూవాహిని, విశ్వహిందూపరిషత్, భారతీయ జనతాపార్టీ, కె.ఎమ్.ఐ.టి కళాశాల ఎన్.ఎస్.ఎస్. విద్యార్థులు పాలుగొన్నారని ఇంద్రసేనారెడ్డి తెలిపారు. ★



**నంద్యాల:** జూన్20 సక్షమ్ దివ్యాంగ సేవాసంస్థ స్థాపన దినోత్సవం సందర్భంగా క్రాంతినగర్ రామాలయం, చాపి రేవులమార్గంలో 120 మొక్కలను నాటారు. సక్షమ్ అధ్యక్షులు డా॥ నేట్ల మహేశ్వరరెడ్డి, సక్షమ్ ప్రముఖ్ సుబ్బారావు, 9 స్వచ్ఛంద సంస్థలకు చెందిన ప్రముఖులు, దివ్యాంగులు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.



టీ-20 ప్రపంచకప్ చరిత్రలో భారత కెప్టెన్ రోహిత్ శర్మ ప్రత్యేక స్థానం సాధించాడు. 2024 ప్రపంచకప్‌లో మూడు సరికొత్త రికార్డులు నెలకొల్పాడు. భారత్‌ను మరోసారి విశ్వవిజేతగా నిలపాలన్న పట్టుదలతో ఉన్నాడు. చండప్రచండ ఓపెనర్‌గా, సిక్సర్లలో సునామీ హిట్టర్‌గా 37 సంవత్సరాల వయసులోనూ దూకుడు కొనసాగిస్తున్నాడు. 50 ఓవర్ల వన్డే క్రికెట్, 20 ఓవర్ల ధూమ్ ధామ్ టీ-20 క్రికెట్లో సిక్సర్లు బాదడంలో తన తరువాతే ఎవరైనా అని మరోసారి చాటి చెప్పాడు. వన్డేలలోనే కాదు.. టీ-20 మ్యాచ్‌ల్లోనూ 200కు పైగా సిక్సర్లు బాదిన తొలి ఓపెనర్‌గా, బ్యాటర్‌గా నిలిచాడు.

# రికార్డుల 'హిట్టర్' రోహిత్ శర్మ!

2007 ప్రారంభ ఐసీసీ ప్రపంచకప్‌లో ధోనీ నాయకత్వంలో తొలిసారిగా విశ్వవిజేతగా నిలిచిన భారత్ మరో ప్రపంచకప్ కోసం ఎదురుచూస్తోంది. రోహిత్ శర్మ నాయకత్వంలో గతేడాది వన్డే ప్రపంచ కప్, టెస్టు లీగ్ ప్రపంచ టైటిల్స్‌ను చేజార్చుకొన్న భారత్ ప్రస్తుత 2024-ఐసీసీ టీ-20 ప్రపంచకప్‌లో విజేతగా నిలవాలన్న పట్టుదలతో ఉంది. రాహుల్ ద్రావిడ్ చీఫ్ కోచ్‌గా, రోహిత్ నాయకత్వంలో.. లీగ్ దశ నుంచి సూపర్-8 రౌండ్ వరకూ వరుస విజయాలతో ఐదోసారి సెమీఫైనల్లో చోటు సంపాదించింది. 2007 నుంచి-2024 ప్రపంచకప్ వరకూ భారత్ ఐదుసార్లు సెమీస్‌కు చేరడం ఓ రికార్డు. ఆస్ట్రేలియాతో జరిగిన సూపర్- 8 ఆఖరి రౌండ్ మ్యాచ్‌లో నెగ్గడం ద్వారా రోహిత్ శర్మ మూడు అరుదైన రికార్డులు నెలకొల్పాడు.

ఐదుజట్ల గ్రూపు- ఏ లీగ్‌లో ఐర్లాండ్, పాకిస్థాన్, అమెరికా జట్లను, సూపర్-8 దశలో అఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్, ఆస్ట్రేలియాజట్లను చిత్తు చేయడం ద్వారా భారత్ సెమీఫైనల్లో అడుగుపెట్టింది. ఫైనల్లో చోటు కోసం డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్‌తో తలపడటానికి అర్హత సాధించడంలో కెప్టెన్‌గా రోహిత్ కీలకపాత్ర పోషించాడు. సెయింట్ లూషియా ద్వీపంలోని డారెన్ సామీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వేదికగా 2వ ర్యాంకర్ ఆస్ట్రేలియాతో జరిగిన పోరులో రోహిత్ చెలరేగిపోయాడు. కేవలం 19 బంతుల్లోనే మెరుపు హాఫ్ సెంచరీ సాధించడంతో పాటు మూడు సరికొత్త ప్రపంచ రికార్డులు నమోదు చేయగలిగాడు.

**వన్డే క్రికెట్లో 300 సిక్సర్ల రోహిత్...**

వన్డే క్రికెట్లో సైతం 300కు పైగా సిక్సర్లు సాధించిన భారత తొలి ఏకైక బ్యాటర్ రోహిత్ శర్మ మాత్రమే. వన్డే క్రికెట్‌లో అత్యధిక సిక్సర్లు బాదిన బ్యాటర్ రికార్డు పాక్ మాజీ కెప్టెన్ షాహీద్ అఫ్రిదీ పేరుతో ఉంది. అఫ్రిదీ 351 సిక్సర్లతో అగ్రస్థానంలో ఉంటే.. 331 సిక్సర్లతో క్రిస్ గేల్ రెండోస్థానం, 302 సిక్సర్లతో రోహిత్ మూడో స్థానంలో ఉన్నాడు. భారత క్రికెట్ చరిత్రలో 300 సిక్సర్లు సాధించిన తొలి బ్యాటర్ రోహిత్ కాగా.. 329 సిక్సర్లతో మహేంద్ర సింగ్ ధోనీ రెండోస్థానంలో ఉన్నాడు.

**19 బంతుల్లోనే రోహిత్ మెరుపు హాఫ్ సెంచరీ..**


రోహిత్ శర్మ కేవలం 19 బంతుల్లోనే సునామీ హాఫ్ సెంచరీ సాధించడం ద్వారా భారత్ స్కోరు 205కు చేరడంలో ప్రధానపాత్ర వహించాడు. అతితక్కువ బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించిన బ్యాటర్‌గా రికార్డు నెలకొల్పాడు. రోహిత్ మొత్తం 41 బంతులు ఎదుర్కొని 7 ఫోర్లు, 8 సిక్సర్లతో 92 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో 8 సిక్సర్లు బాదడం ద్వారా రోహిత్ 200కు పైగా సిక్సర్ల మైలురాయిని చేరుకోగలిగాడు. కేవలం ఆస్ట్రేలియా ప్రత్యర్థిగానే 132 సిక్సర్లు బాదడం ద్వారా సరికొత్త రికార్డు నెలకొల్పాడు. వెస్టిండీస్ ప్రత్యర్థికి రోహిత్ కు 88 సిక్సర్లు బాదిన ఘనత సైతం ఉంది.

**టీ-20ల్లో అత్యధిక పరుగుల ప్రపంచ రికార్డు...**

టీ-20 ఫార్మాట్లో ఇప్పటి వరకూ అత్యధిక పరుగులు సాధించిన బ్యాటర్లుగా పాక్ కెప్టెన్ బాబర్ అజామ్, భారత మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీల పేరుతో ఉన్న రికార్డులను రోహిత్ తెరమరుగు చేశాడు. కేవలం 157 ఇన్నింగ్స్ లోనే 4165 పరుగులు సాధించడం ద్వారా బాబర్ అజామ్ 4145, విరాట్ కోహ్లీ (4103)లను మించిపోయాడు.అంతేకాదు.. భారత్‌కు అత్యధిక టీ-20 విజయాలు అందించిన కెప్టెన్‌గా కూడా రికార్డులకు ఎక్కాడు. 60 మ్యాచ్‌ల్లో భారత్‌కు నాయకత్వం వహించి 48 విజయాలతో అగ్రస్థానంలో నిలిచాడు. పాక్ కెప్టెన్‌గా బాబర్ అజామ్ 85 మ్యాచ్‌ల్లో సాధించిన 48 విజయాల రికార్డును అధిగమించడంతో పాటు భారత్‌కు అత్యధిక వరుస విజయాలు అందించిన కెప్టెన్‌గానూ నిలిచాడు. డిసెంబర్ 2023 -జూన్ 2024 మధ్య భారత్ వరుసగా12 విజయాలు సాధించగలిగింది.

**త్రీ-ఇన్-వన్..హిట్టర్ రోహిత్...!**

క్రికెట్ మూడు ఫార్మాట్ల (టెస్టు, వన్డే, టీ-20)లోనూ కలసి అత్యధిక సిక్సర్లు సాధించిన క్రిస్ గేల్ రికార్డు ను సైతం రోహిత్ అధిగమించాడు. 2023 వన్డే ప్రపంచకపు లో అఫ్ఘనిస్థాన్‌పై 5 సిక్సర్లు, పాకిస్థాన్ పై 6 సిక్సర్లతో కలిపి మొత్తం 561 సిక్సర్లతో గేల్ పేరుతో ఉన్న 553 సిక్సర్ల రికార్డును తెరమరుగు చేశాడు. గేల్ 483 మ్యాచ్ ల్లో 553 సిక్సర్లు బాదితే... రోహిత్ కేవలం 453 మ్యాచ్‌ల్లోనే ఆ రికార్డును అధిగమించాడు. ఆస్ట్రేలియాతో ముగిసిన టీ-20 ప్రపంచకప్ సూపర్ -8 రౌండ్ ఆఖరి మ్యాచ్ వరకూ రోహిత్ 460కి పైగా మ్యాచ్‌ల్లో 570కి పైగా సిక్సర్లు సాధించగలిగాడు. టీ-20 ప్రపంచకప్‌లో భారత్‌ను రెండోసారి విశ్వవిజేతగా రోహిత్ నిలుపగలిగితే.. ఆటగాడిగా, కెప్టెన్‌గా తన కెరియర్‌ను పరిపూర్ణం చేసుకోగలుగుతాడు. ★



**క్రీడా కృష్ణ, 84668 64969**
సీనియర్ జర్నలిస్ట్

# బాల జాగృతి

తెలుసుకుందాం

## స్థానేశ్వర్ మహాదేవ్ ఆలయం కురుక్షేత్ర



శివునికి అంకితం ఇచ్చిన ఈ ఆలయం హరియానలోని కురుక్షేత్ర జిల్లా కేంద్రంలో కొలువుదీరింది. పాండవులతో కలిసి కృష్ణుడు ఇక్కడ శివునికి అభిషేకం చేసి, మహాభారత యుద్ధంలో విజయం సాధించే వరం పొందాడని స్థానికుల విశ్వాసం. ఆలయానికి ఆనుకుని ఉన్న కోనేరులోని నీరు పవిత్రమైందని పురాణాలు చెబుతున్నాయి. ఇందులో నీరు కుష్టువ్యాధిని నయం చేస్తుందని స్థానికుల నమ్మకం.

## కథ | ఉపకారానికి ప్రత్యుపకారం!



ఒక రోజు పావురం ఒక చెట్టు కొమ్మమీద నిద్రపోతోంది.

మంచి నిద్ర మత్తులో ఉండగా దానికి 'రక్షించండి.. రక్షించండి' అన్న కేకలు వినబడ్డాయి.

ఎవరా? అని కిందికి చూడగా ఒక నీటి గుంటలో చీమ పడిపోయి ప్రమాదంలో ఉండటం గమనించింది.

చీమను ఎలాగైనా కాపాడాలనుకుంది పావురం. వెంటనే దానికి ఒక ఉపాయం వచ్చింది. ఒక ఆకును ఆ నీటి గుంటలో పడేసింది.

చీమ ఆ ఆకు మీదకు ఎక్కి ఒడ్డుకు చేరుకుంది. తన ప్రాణాల్ని కాపాడిన పావురానికి చీమ కృతజ్ఞతాభావం తెలిపి అక్కడి నుంచి వెళ్లిపోయింది.

## పద్యము

ఉరుకరుణాయుతుండు సమయోచిత మాత్మ దలంచి యుగ్ర వా
క్పరుషతజూపినన్ ఫలముకల్గుట తథ్యము గాదె యంబుదం
బురిమిన యంతనే కురియకుండునె వర్షము లోకరక్షణ
స్థిరతర పౌరుషంబున నశేష జనంబు లెఱుంగ భాస్కరా!

**భావం :** భాస్కరా! మేఘుడు ప్రాణంబున భయము గలుగునట్లు ఉరిమి వెంటనే జనులను రక్షించు పట్టుదలతో నానందము కలుగునట్లు వర్షించును. ఆ విధంగా మిక్కిలి దయగలవాడు సమయానుకూలంగా కఠిన వాక్యములు పల్కిననూ తదుపరి తప్పక మేలునే చేయును, కీడు మాత్రం చేయడు.

## శ్లోకము

'అనిసత్యాని శరీరాణి విభవో నైవ శాశ్వతః
నిత్యం సన్నిహితో మృత్యుః కర్తవ్యో ధర్మ సంగ్రహః'

**భావం :** ఈ శరీరాలు శాశ్వతం కావు. వైభవాలు,సంపదలూ అశాశ్వతాలే. మృత్యువు ఎల్లప్పుడు పొంచి ఉంటుంది. కనుక ధర్మాన్ని సంపాదించుకోవాలి/అలవరచుకోవాలి.

## జతపరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| క్లోరిన్ | రూథర్ ఫర్డ్ |
| ఎలక్ట్రాన్ | సింగర్ |
| కుట్టుమిషన్ | ప్రీస్ట్లీ |
| ఆక్సిజన్ | షీలే |
| అణుశక్తి | జె.జె. థాంప్సన్ |

సమాధానాలు : క్లోరిన్-షీలే; ఎలక్ట్రాన్-జె.జె. థాంప్సన్; కుట్టుమిషన్-సింగర్; ఆక్సిజన్-ప్రీస్ట్లీ; అణుశక్తి-రూథర్ ఫర్డ్.

## భారత స్వాతంత్ర్య సమరయోధులు

### శిరీశ్ కుమార్ మెహతా



మహారాష్ట్రకు చెందిన ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు. డిసెంబరు 28, 1926న నందుర్‌బార్ పట్టణంలో జన్మించారు. సెప్టెంబర్ 9, 1942న శిరీశ్ కుమార్ నాయకత్వంలో నందుర్‌బార్ పట్టణంలో క్విట్ ఇండియా ఉద్యమ ర్యాలీ నిర్వహిస్తున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు నిరసనకారులపై లాఠీ ఛార్జ్ చేశారు. చేతిలో జాతీయ జెండాతో 'వందేమాతరం' నినాదంతో శిరీష్ కుమార్ ముందుకు కదిలాడు. అతనితో పాటు అనేక మంది నిరసనకారులు పోలీసులకు ఎదురెళ్లారు. దీంతో పోలీసులు కాల్పులు జరుపగా శిరీశ్ కుమార్ అక్కడికక్కడే మరణించారు.



మరుసటి రోజు ఆ చీమకు కొంచెం దూరంలో ఆ పావురం కనబడింది.

పావురాన్ని పలకరిద్దామని పిలిచేలోపు ఒక వేటగాడు చేతిలో తుపాకీతో పావురాన్ని వేటాడేందుకు సిద్ధంగా ఉండటాన్ని చీమ గమనించింది.

తనను కాపాడిన పావురానికి ప్రత్యుపకారం చేయాలనుకుంది చీమ. వెంటనే దానికో ఆలోచన వచ్చింది.

ఆ వేటగాడు పావురానికి తుపాకీ గురి పెట్టగానే కాలుపైకి ఎక్కి గట్టిగా కుట్టింది. ఇంకేముంది.. వాడి గురి తప్పింది. ఆ శబ్దం విన్న పావురం అక్కడి నుంచి రివ్వున ఎగిరిపోయింది. ★

## జనరల్ నాలెడ్జ్

1. ఆంధ్రప్రదేశ్ నూతన ముఖ్యమంత్రిగా ఎవరు ప్రమాణస్వీకారం చేశారు?
2. ప్రధాని నరేంద్ర మోదీ ఏ నియోజక వర్గం నుంచి ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు?
3. కేంద్ర ప్రభుత్వం జాతీయ భద్రతా సలహాదారుగా ఎవరిని నియమించింది?

**సమాధానాలు :** 1. నారా చంద్రబాబు నాయుడు; 2. వారణాసి; 3. అజిత్ డోభాల్.

## మెదడుకు మేత



నీటిలో ఉంటే ఎగసి పడతాను. నేల మీదకి వస్తే కూలబడతాను.. నేనెవరిని?

**జవాబు :** సముద్ర కెరటం


## మంచిమాట

నేను చేయగలను అనుకోవడం విశ్వాసం.. నేను మాత్రమే చేయగలను అనుకోవడం ఆత్మవిశ్వాసం



# వారఫలాలు

01-07 జులై 2024



సింహంభట్ల సుబ్బారావు
6300674054

**మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం**

కొత్త పరిచయాలు. కార్యక్రమాలలో ఆటంకాలు తొలగుతాయి. వాహనాలు, భూములు కొనుగోలు చేస్తారు. సోదరులతో ఉత్సాహంగా గడుపుతారు. బంధువుల నుంచి కీలక సమాచారం నిరుద్యోగుల యత్నాలు కొలిక్కివస్తాయి. ఆదాయానికి లోటులేకుండా గడు స్తుంది. వ్యాపారులకు లాభాలు. పారిశ్రామిక వేత్తలకు ప్రగతి. రచయితలు, క్రీడా కారులకు శుభవార్తలు. 6,7 తేదీల్లో శారీరక రుగ్మతలు. హనుమాన్‌ఛాలీసా పఠించండి.

**వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు**

బంధువులతో ఉత్సాహంగా గడుపుతారు. కొన్ని సమస్యలు చాకచక్యంగా పరిష్కరించుకుంటారు. సోదరులతో వివాదాలను పరిష్కరించుకుంటారు. ఇంటి నిర్మాణయత్నాలు వేగవంతం చేస్తారు. ధార్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారులకు లాభాలు. ఉద్యోగులకు పరిస్థితులు అనుకూలిస్తాయి. రాజకీయ వేత్తలకు శుభవార్తలు. రచయితలు, క్రీడా కారులు ఉత్సాహవంతంగా సాగుతారు. 1,2తేదీలలో కుటుంబసమస్యలు. అంగారక స్తోత్రాలు పఠించండి.

**మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు**

కొత్త కార్యక్రమాలు ప్రారంభించి సమ యానికి పూర్తి చేస్తారు. ఆదాయం సంతృప్తినిస్తుంది. సమాజంలో ప్రతిష్ఠలు పెరుగుతాయి. కాంట్రాక్టర్లకు చిక్కులు తొలగుతాయి. ప్రముఖుల నుంచి ముఖ్య సమాచారం అందుతుంది. నిరుద్యోగులు అనుకున్నది సాధిస్తారు. వ్యాపారులకు కొత్త ఆశలు. కళాకారులు అవకాశాలు దక్కించుకుంటారు. క్రీడాకారులు, పరిశోధకులకు సమస్యలు తీరే సమయం. 3,4 తేదీల్లో ధనవ్యయం. సూర్యారాధన చేయండి.

**కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష**

కొత్త కార్యక్రమాలు సమయానికి పూర్తి చేస్తారు. రాబడి తృప్తినిస్తుంది. సన్నిహితులతో ఆనందంగా గడుపుతారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొం టారు. బంధువులతో కీలక విషయాలపై చర్చలు. ఆభరణాలు,వాహనాలు కొంటారు. వివాహయత్నాలు కలసివస్తాయి. వ్యాపారులకు పెట్టుబడులు ఉద్యోగా లలో ఏ బాధ్యతనైనా సమర్థవంతంగా నిర్వర్తిస్తారు. పారిశ్రామికవేత్తలకు ఆహ్వానాలు. 5,6 తేదీల్లో శారీరక రుగ్మతలు. ఆంజనేయ దండకం పఠించండి.

**సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం**

అదనపు ఆదాయం సమకూరుతాయి. ముఖ్య మైన కార్యక్రమాలు పూర్తి. శ్రేయోభిలాషులతో ఉత్సాహంగా గడుపుతారు. కుటుంబసభ్యుల సలహా లతో కొత్త నిర్ణయాలు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారులు సంస్థలను విస్తరిస్తారు. ఉద్యోగులకు విధుల్లో అవాంతరాలు తొలగును. రాజకీయవేత్తలకు మంచికాలం. 2,3 తేదీలలో అనారోగ్యం, నవగ్రహస్తోత్రాలు పఠించండి.

**కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు**

చిన్ననాటి స్నేహితులను కలుసుకుంటారు. విద్యార్థులకు నూత నోత్సాహం. రాబడి గతం కంటే మెరుగ్గా ఉంటుంది. ధార్మిక కార్యక్రమాలలో పాల్గొం టారు. వ్యాపారులకు లాభాలు మరింత దక్కుతాయి. ఉద్యోగులకు విధుల్లో అవాంతరాలు తొలగుతాయి. పారిశ్రామికవేత్తలు, రచయితలు అనుకున్నది సాధిస్తారు. 5,6 తేదీల్లో బంధువులతో విభేదాలు. శివపంచాక్షరి పఠించండి.

**తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు**

కార్యక్రమాలు విజయవంతంగా సాగుతాయి. శ్రేయోభిలాషుల సూచనలు అమలు చేస్తారు. సోదర, సోదరీమణులతో ఉత్సాహంగా గడుపుతారు. దేవా లయాలు సంద. వ్యాపారులకు లాభాలు దక్కవచ్చు. రాజకీయవేత్తలకు కొత్త ఆశలు చిగురిస్తాయి. కళాకారులు, క్రీడాకారులకు ప్రోత్సాహకరంగా ఉంటుంది. 4,5తేదీల్లో ఆకస్మిక ప్రయాణాలు. స్వల్ప అనారోగ్యం. విష్ణుసహస్రనామ పారాయణ చేయండి.

**వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ**

ముఖ్యమైన కొన్ని కార్యక్రమాలు నిదానించినా చివరికి పూర్తికాగలవు. అదనపు ఆదాయం సమకూరి అవసరాలు తీరతాయి. ధార్మిక కార్యక్రమాలలో పాల్గొం టారు. కొన్ని వివాదాలు పరిష్కారమై ఊపిరి పీల్చు కుంటారు. ఉద్యోగులకు సంతోషకరమైన సమా చారం. పారిశ్రామికవర్గాలకు కాస్త ఊరట. 6,7 తేదీల్లో వృథా ఖర్చులు. కుటుంబంలో ఒత్తిడులు. శారీరక రుగ్మతలు. నవగ్రహస్తోత్రాలు పఠించండి.

**ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం**

కొత్త కార్యక్రమాలు ప్రారంభించి సజావుగా పూర్తి చేస్తారు. వాహనాలు, భూములు కొనుగోలుచేస్తారు. కొన్ని వివాదాలు పరిష్కరించుకుంటారు. ఆలయాలు సందర్శన. ఉద్యోగులకు మరింత ఉత్సాహవంతంగా ఉంటుంది. కళాకారులకు కొత్తఅవకాశాలు. రచ యితలు, క్రీడాకారులు లక్ష్యాలు సాధిస్తారు. 1,2 తేదీల్లో ఖర్చులు. బంధువులతో వివాదాలు. గణేశాష్టకం పఠించండి.

**మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు**

ఆస్తి వివాదాలు కొలిక్కివస్తాయి. చేపట్టిన పనులు కొంత నెమ్మదించినా ఎట్టకేలకు పూర్తి చేస్తారు. ఆపదలో ఉన్న వారికి చేయూతనందిస్తారు. గృహ నిర్మాణయత్నాలు అనుకూలిస్తాయి. వ్యాపారులకు తగినంత లాభాలు. ఉద్యోగులకు అనుకూల పరిస్థి తులు. రచయితలు కొంత ఊరట చెందుతారు. 2,3 తేదీల్లో కుటుంబసభ్యుల నుంచి ఒత్తిడులు. నవగ్రహస్తోత్రాలు పఠించండి.

**కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు**

చిత్రవిచిత్ర విషయాలు తెలుస్తాయి. రాబడి మరింత ఉత్సాహాన్నిస్తుంది. ఆస్తి వివాదాలు పరిష్కార దశకు చేరుకుంటాయి. ప్రముఖుల నుంచి ముఖ్య సమాచారం అందుతుంది. వ్యాపారులకు లాభాలు. ఉద్యోగులకు ఉన్నతస్థితి దక్కే సూచనలు. పారిశ్రామికవేత్తలకు కొత్త ఆశలు. కళాకారులు, రచయితలు పట్టుదలతో అవకాశాలు. 4,5 తేదీలలో అనుకోని ఖర్చులు.నృసింహస్తోత్రాలు పఠించండి.

**మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి**

ఖర్చులు పెరుగుతాయి. శారీరక రుగ్మతలు. కొన్ని కార్యక్రమాలు అవాంతరాలు కలుగుతాయి కష్టమే తప్ప ఫలితం కనిపించదు. సోదరులతో భూ వివాదాలు నెలకొంటాయి. దేవా లయాల సందర్శన. ఇంటి నిర్మాణాలు కొంత మందగిస్తాయి. వ్యాపా రులకు సామాన్యంగా లాభిస్తుంది. రాజకీయవేత్తలు, కళాకారుల యత్నాలు ముందుకు సాగవు. రచయిత లకు కొద్దిపాటి చికాకులు. 5,6 తేదీల్లో శుభవార్తలు. వాహనసౌఖ్యం. గణేశ్ స్తోత్రాలు పఠించండి.

# పదరసం-470

### ఆధారాలు

**అడ్డం**

1) మార్పులు కూర్పులతో సరిచేయడం (4)
3) గుండ్రటి బుట్టవంటి చిన్నపడవ (2)
4) ఇదే చేనును మేస్తే అని సామెత (2)
5) చాలాలేత పిందె (2)
6) అగస్త్యుడు 'తిరగబడ్డ' ఈ పర్వతాన్ని పెరగకుండా చేశాడు (2)
8) అడ్డు, ఆపు లేని, సాధ్యం కాని (5)
10) గెలిచినవాడు తిరగబడ్డాడు (3)
12) ఇంటి పైకప్పుకూ, వీధులు వేయడానికీ వాడే రాయి (3)
13) సమగ్రం, విస్తారం (3)
15) గద్గద స్వరం (3)
16) రొద (4)
18) నేత సరిగాలేదు (4)
19) ద్రవాలను బాగా కలపడం (4)
21) పత్రంలేని స్వల్పకాలపు చిన్న అప్పు (4)
22) మోటు (3)
23) నమ్మక ద్రోహం (5)
24) పరమమొండిగా ఉంటే ఇలా అనడం రివాజు (3)

**నిలువు**

1) విభేదాలు వదిలేసి చేసుకునే సంధి (3)
2) "పైకి" విడమరచి చెప్పడం (4)
3) ఇంకొకరిచేత చేయించుటకు పురికొల్పు (5)
4) ముళ్ళమండ (2)
5) అమ్మవారు ఆవహించుట (3)
7) అబ్బురం, అపూర్వం (2)
9) కత్తి (4)
11) ఎరుపు (3)
13) విషయ జ్ఞానం ఉన్నవాడు (3)
14) ఇంటి గుట్టు .... అని సామెత (5)
15) బాలురాడుకొను త్రాడుచుట్టివదలే ఆటవస్తువు (3)
17) కలిసి ఉంటే ..... అని నానుడి (5)
18) నీటి నిలవ వలన వచ్చే పాకుడు (2)
20) తలుపు మూయుటకు వాడే అడ్డుకొయ్య (3)
22) పదునుగా ఉండే చివర (2)

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | | 2 | ■ | 3 | | ■ | 4 | |
| | ■ | ■ | | ■ | | ■ | 5 | | ■ |
| 6 | 7 | ■ | 8 | | | | | ■ | 9 |
| ■ | 10 | 11 | | ■ | | ■ | 12 | | |
| ■ | ■ | | ■ | 13 | | 14 | ■ | ■ | |
| 15 | | | ■ | | ■ | 16 | | 17 | |
| | ■ | ■ | 18 | | | | ■ | | ■ |
| 19 | 20 | | | ■ | ■ | 21 | | | |
| ■ | | ■ | ■ | 22 | | | ■ | | ■ |
| 23 | | | | | ■ | ■ | 24 | | |

## పదరసం - 469 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| పె[1] | చ్చా | లు[2] | ■ | అ[3] | ■ | అ[4] | ప[5] | వా | దు[6] |
| ట్టి | ■ | వా | ■ | మా[7] | టు | ■ | హో | ■ | ర్భ |
| చా[8] | మ | న | చా | య | ■ | దు[9] | రా | చా[10] | రం |
| కి | ■ | ఆ | ■ | కు | ■ | స్స | ■ | క | ■ |
| రీ[11] | భా[12] | ■ | వి[13] | డు | ద[14] | ల | ■ | చ[15] | ట్టి |
| ■ | డు[16] | ధు | యో | ■ | ప్ప | ■ | ఐ[17] | క్యం | ■ |
| చే[18] | ను | ■ | గం[19] | గా[20] | ళం | ■ | రా | ■ | అ[21] |
| మ | ■ | పి[22] | ■ | వు | ■ | వి[23] | వ | ర | ణ |
| కూ[24] | డ | లి | ■ | కే | ■ | ■ | తం | ■ | కు |
| ర | ■ | చి[25] | ల | క | కొ | య్యి | ■ | చే[26] | వ |

సినిమా

అరుణ



ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారు ఎప్పుడెప్పుడు విడుదల అవుతుందా అని ఎదురు చూస్తున్న 'కల్కి 2898 ఎ.డి.' జూన్ 27న వివిధ భాషల్లో విడుదలైంది. 'మహానటి' ఫేమ్ నాగ అశ్విన్ దర్శకత్వంలో వైజయంతీ మూవీస్ పతాకంపై ప్రముఖ నిర్మాత అశ్వనీదత్ దీనిని నిర్మించారు. కల్కి పురాణం ఆధారంగా రూపొందిన 'కల్కి' మూవీ కథేంటో ముందు తెలుసుకుందాం.

# భావోద్వేగాలకు అతీతం 'కల్కి 2898 ఎ.డి.'

అది కలియుగం 2898వ సంవత్సరం. ప్రపంచంలోని తొలి నగరంగా చెప్పే కాశీ పుణ్యక్షేత్రం లోని ప్రజలు క్షామంతో విలవిలలాడుతుంటారు. భూమి మీద జీవించి ఉండడం క్లిష్టంగా మారిన కారణంగా అన్ని ప్రాంతాల వారు ప్రాణాలను అరచేతుల్లో పెట్టుకుని కాశీ చేరుతుంటారు. అయితే ఈ ప్రపంచంలోని సంపన్నులంతా అప్పటికే యాస్కిన్ (కమల్ హాసన్) సృష్టించిన కాశీ సమీపంలోని కాంప్లెక్స్ అనే ప్రాంతంలో హాయిగా జీవితాన్ని కొనసాగిస్తుంటారు. అక్కడకు సామాన్యులు వెళ్లాలంటే, యూనిట్స్‌ను చెల్లించాలి. ఆ యూనిట్స్‌ను సంపాదించడం కోసం భైరవ (ప్రభాస్) ప్రయత్ని స్తుంటాడు. స్వార్థపరుడైన భైరవకు కాంప్లెక్స్‌కు చేరడం ఒక్కటే లక్ష్యం. ఇదిలా ఉంటే... కాంప్లెక్స్ పీడితులందరికీ శంభాల అనే ప్రదేశంలో రక్షణ లభిస్తుంటుంది. ఆ ప్రాంతం ఎక్కడుందో తెలియని కాంప్లెక్స్ సుప్రీమ్ యాస్కిన్ దాన్ని ఎలాగైనా నాశనం చేయాలని కంకణం కట్టుకుంటాడు. అలానే శంబాలా ప్రాంతంలోని వారు కొందరు కాంప్లెక్స్‌లో చొరబడి అక్కడి విషయాలను తమ అధినేత్రి మరియమ్మ (శోభన) కు చేరవేస్తుంటారు. కాస్తంత వెనక్కి వెళితే... మహాభారత యుద్ధ సమయంలో ఉత్తర గర్భంలోని (అభిమన్యుడి తనయుడు) శిశువును బ్రహ్మాస్త్రంతో అంతం చేస్తాడు అశ్వత్థామ (అమితాబ్ బచ్చన్). దాంతో కల్కి అవతరించే వరకూ మరణం లేకుండా జీవచ్ఛవంలా బతకమని అశ్వత్థామను శ్రీకృష్ణుడు శపిస్తాడు. కల్కి రాక కోసం అశ్వత్థామ వేల సంవత్సరాలుగా ఎదురు చూస్తుంటాడు. మరోపక్క కాశీలోని గర్భవతులను కాంప్లెక్స్‌కు పంపించి వారి నుండి సీరమ్ తీసి యాస్కిన్‌కు 'ప్రాజెక్ట్ కె' నిమిత్తం అక్కడి సైంటిస్టులు అందిస్తుంటారు. అలా కాంప్లెక్స్‌కు వెళ్లిన సుమతి (దీపికా పదుకొనే)... శంబాలాకు చెందిన గూఢచారి సాయంతో కాంప్లెక్స్ నుండి బయటపడి శంబాల చేరుతుంది. ఆమె గర్భంలో ఉంది భగవంతుడే అని గ్రహించిన అశ్వత్థామ ఆమెను కాంప్లెక్స్ సైన్యం నుండి రక్షిస్తుంటాడు. ఇదే సమయంలో సుమతిని అప్పగిస్తే... తనకు కాంప్లెక్స్‌లో ప్రవేశం దొరకు తుందని భైరవ ఆమెను బంధించడానికి ప్రయత్ని స్తుంటాడు. అశ్వత్థామకు, భైరవకు జరిగిన పోరాటంలో విజయం ఎవరికి దక్కింది? శంబాల ఆచూకీ గుర్తించి నాశనం చేయాలనుకున్న యాస్కిన్ కోరిక తీరిందా? ప్రపంచంలోని అన్ని మతాల వారిని ఒకచోట చేర్చి, దేవుడి ఆగమనం కోసం ఎదురు చూస్తున్న శంబాల ప్రజల ఆకాంక్ష నెరవేరిందా? అనేదే 'కల్కి 2898 ఎ.డి.' కథ.

సంక్లిష్టమైన ఈ కథ ఈ తరానికి అర్థం కావడం కోసం దర్శకుడు నాగ అశ్విన్ కొంతకాలంగా వివిధ రకాలుగా కథ గురించి వివరణ ఇస్తూ ఉన్నారు. వాటిని అనుసరించిన వారికి ఈ సినిమా అర్థమౌ తుంది. కానీ ఎలాంటి అంచనాలు లేకుండా థియేటర్‌కు వచ్చే వారు కొంత అయోమయానికి గురయ్యే ఆస్కారం ఉంటుంది. హాలీవుడ్ తరహా చిత్రాలను తెలుగు వారూ నిర్మించగలరని 'కల్కి 2898 ఎ.డి.'తో నాగ అశ్విన్ నిరూపించాడు. హీరోయిజానికి ప్రాధాన్యత ఇవ్వకుండా... కేవలం పాత్రలు, వాటి స్వభావాలను బట్టే కథను నడిపాడు. ఆ కారణంగా ఇందులోని పాత్రలతో ప్రేక్షకులు మమేకం కావడం కాస్తంత కష్టమే. విజువల్ వండర్‌గా 'కల్కి' ప్రేక్షకులను థ్రిల్‌కు గురిచేస్తుంది తప్పితే... భావోద్వేగాలను కలిగించడంలో విఫలం అయ్యింది.

అదే సమయంలో ప్రధాన పాత్రధారి భైరవ పాత్రలోనూ కొంత తికమక చోటు చేసుకుంది. కాశీ క్షేత్ర పాలకుడైన భైరవగా అతన్ని ప్రేక్షకులు భావిస్తుంటారు. కానీ సినిమా పతాక సన్నివేశంలో అతడిని కుంతీపుత్రుడు కర్ణుడిగా చూపించడంతో 'కల్కి' కథను తెలుసుకుందామని వస్తే... కర్ణుడి చిత్రం చూపించారేమిటి? అనే భావన ప్రేక్షకులకు కలుగుతుంది. సినిమా పేరుకు, చూపించిన కథకు సంబంధం లేదు కదా అనిపిస్తుంది. అయితే... సుమతి గర్భంలో ఉన్న భగవంతుడే కల్కి అనుకుంటే... అతని కథంతా ఈ సినిమా ద్వితీయార్థంలో చూడాల్సిందే!

ప్రభాస్ యాక్షన్ సీన్స్‌లో తప్పితే... మిగిలిన సన్నివేశాలలో పెద్దంత కష్టపడకుండానే అతని పాత్రను దర్శకుడు తీర్చిదిద్దాడు. అయితే అతనికి జోడీగా నటించిన దిశా పటానీ పాత్రను అతిథి పాత్రలా మలచడం ఓ పాటకు పరిమితం చేయడం ప్రభాస్ ఫాన్స్‌ను నిరుత్సాహానికి గురిచేస్తుంది. దీపికా పదుకునేది ఇందులో కీలక పాత్ర తప్పితే... ప్రభాస్‌తో డైరెక్ట్‌గా సంబంధం ఉండే పాత్ర కాదు. అందరినీ ఆకట్టుకునే పాత్ర ఏదైనా ఉందంటే అది అమితాబ్ పోషించిన అశ్వత్థామ పాత్ర! కమల్ హాసన్ పోషించిన యాస్కిన్‌కు పెద్దంత ప్రాధాన్యం ఇవ్వలేదు. అతిథి పాత్రకు ఎక్కువ ప్రధాన పాత్రకు తక్కువ. ఇక ఇతర ప్రధాన పాత్రలను రాజేంద్రప్రసాద్, శోభన, పశుపతి, బ్రహ్మానందం, శాశ్వత బెనర్జీ, అన్నా బెన్ తదితరులు పోషించారు. రామ్ గోపాల్ వర్మ, రాజమౌళి, విజయ్ దేవరకొండ, మృణాల్ ఠాకూర్, అవసరాల శ్రీనివాస్, మాళవిక నాయర్, ఫరియా అబ్దుల్లా, అనుదీప్ అతిథి పాత్రల్లో మెరిశారు. భారీ అంచనాలు పెట్టుకోకుండా 'కల్కి 2898 ఎ.డి.'ని చూస్తే ఫర్వాలేదనిపిస్తుంది.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్

# అమర్నాథ్ యాత్రకు శ్రీకారం

అమర్నాథ్ యాత్ర ప్రక్రియకు జూన్ 22న శ్రీకారం చుట్టారు. అందుకు సూచనగా హిమలింగం ఏర్పడే ప్రదేశంలో అర్చకులు ప్రథమ పూజ నిర్వహించారు. జమ్ముకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్, శ్రీఅమర్నాథ్‌జీ ఆలయ బోర్డ్ అధ్యక్షులు మనోజ్ సక్సేనా ఈ విషయాన్ని తన ఎక్స్ సందేశంలో తెలియచేశారు. సముద్ర మట్టానికి 3,888 మీటర్ల ఎత్తులో అమర్నాథుడి గుహాలయం ఉంది. దేశప్రజలంతా అమర్నాథ్ హిమలింగాన్ని దర్శించుకుని ఆశీస్సులు పొందాలని కూడా గవర్నర్ విజ్ఞప్తి చేశారు. నిజానికి జమ్ముకశ్మీర్‌కు చెందిన అన్ని మతాలవారు, వర్గాల వారు కూడా అమర్నాథ్ యాత్రలో పాల్గొంటారు. జూన్ 29న ప్రారంభమయ్యే అమర్నాథ్ యాత్ర 52 రోజులు సాగి ఆగస్ట్ 19న ముగుస్తుంది.




లెఫ్టినెంట్ గవర్నర్ సక్సేనా





From: JAGRITI Telugu Weekly
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2024-2026; RNI Regd. No. 3270/57.
Volume : 76 Issue : 34



# జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
# మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు











వెల : ₹.220/- | వెల : ₹.200/- | వెల : ₹.390/- | వెల : ₹.250/- | వెల : ₹.250/-













వెల : ₹.360/- | వెల : ₹.90/- | వెల : ₹.200/- | వెల : ₹.100/- | వెల : ₹.150/-












వెల : ₹.999/- | వెల : ₹.395/- | వెల :₹.495/- | వెల : ₹.799/- | వెల : ₹.599/-

పై పుస్తకములకు మరియు క్రొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

సాహిత్య నికేతన్ : 3-4-852, కేశవనిలయం, బర్కత్‌పురా, హైదరాబాద్ -27.
040-27563236, 9290127329

సాహిత్య నికేతన్ : ఏలూరు రోడ్, గవర్నరు పేట, విజయవాడ – 2, దూరవాణి : 8333812687